# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, మే 6, 2025 | సంపుటి - 20 | సంచిక 114 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక



**కసరత్తు మొదలు పెట్టిన ప్రభుత్వం**

**సిబిల్ స్కోరు ఆధారంగా లబ్ధిదారుల గుర్తింపు**

హైదరాబాద్ : రాజీవ్ యువవికాసం కింద అందించే రుణాలను జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు రుణాల మంజూరు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ నెలాఖరుకు లబ్ధిదారుల జాబితాను అంటే అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. మొదటి విడతలో సుమారు 5 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం అందించేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 2లో

## ఉద్యోగ సంఘాలతో చర్చలేవీ

**కమిటీ నియిమించినా చర్చలకు పిలవని మంత్రులు**

**సిఎం వ్యాఖ్యలపై ఉద్యోగ సంఘాల నేతల వ్యాఖ్య**

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సబ్ కమిటీ ఏర్పాటైనప్పటికీ, ఏడు నెలలు గడిచినా ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడాన్ని 2లో

## రసాయన ఎరువుల వాడకం తగ్గాలి

**భూసారాన్ని పెంచితేనే మనుగడ**

**ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి**

**రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో తుమ్మల**



వికారాబాద్ : వ్యవసాయంలో మరిన్ని మార్పులు రావాలని,రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికా ఉత్పత్తి పేరుతో భూసారం దెబ్బతీస్తున్నారని అన్నారు. దీనిపై రైతులు ఆలోచన చేయాలని అన్నారు. భూసారం దెబ్బతింటే ఏ మందూ పనిచేయదని అన్నారు. రైతు వేదికలో..'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని మంత్రితుమ్మల సోమవారం 2లో

## ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

**కేంద్ర,రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి**

**రాజీవ్ రహదారిని మంచిర్యాల వరకు పొడగించాలి**

**కాగజ్ నగర్ సభలో కేంద్రమంత్రి బండి సంజయ్**



కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ : ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని... అభివృద్ధి విషయంలో కాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రాలఅభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ నమ్ముతారని అన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి అభివృద్ధిలో ముందుకు సాగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో హైవేల విస్తీర్ణం 5,100 కి.మీ.కు చేరుకుందని ఆయన అన్నారు. మంత్రి కోమటిరెడ్డి బోళ మంత్రి..మనసులో ఏమి ఉంచుకోడు.. ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మహారాష్ట్ర బార్డర్ లో నేషనల్ హైవేకు శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో

## ఉగ్రదాడిపై మనకేం సంబంధం

**భారత్ విమానాలను కూల్చేయాలన్న ఎంపి ఒమర్**

**దాడికి దిగితే ధీటుగా జవాబిస్తామన్న ఆర్మీ చీఫ్**



2

## ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది



**ఉద్యోగాల నియమకాలు..కొత్త బస్సుల కొనుగోళ్ల చేశాం**

**అనేక బకాయిలను కూడా చెల్లించి మేలు చేశాం**

**ఇప్పుడు సమ్మెతో మళ్లీ వెనకపడేయవద్దు**

**ఆర్టీసీ కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం సూచన**

హైదరాబాద్ : కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని ,ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో సీసీఎస్, పీఎఫ్ పైసలు వాడుకున్నారని విమర్శించారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసి గాడితో పడుతున్న సమయంలో ఆర్టీసీ సమ్మె ప్రతిపాదన సరికాదని అన్నారు. సోమవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసిన వారిలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ టీఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వద్ధామరెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్ 2లో

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు

**ఇవన్నీ ప్రభుత్వ హత్యగానే గుర్తించాలి**

**ఎక్కడా ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు**

**అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనాలి**

**అందాలపోటీపై ఉన్న శ్రద్ధ రైతులపైనా పెట్టండి**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**



3

## రూపాయి అప్పుకూడా పుట్టని పరిస్థితి

**రాజకీయ ఉచ్చులో సమిధలు కావద్దు**

**సమరం కాదు.. సంయమనం కావాలి**

**మీకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం**

**కలిసి పని చేస్తేనే తెలంగాణ బలపడుతుంది**

**ఉద్యోగ సంఘాల సమ్మె ప్రకటనలపై సిఎం రేవంత్**



హైదరాబాద్ :

ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనామొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా.. సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు.

మిగతా 2లో

**ఖజానా అంతంతమాత్రంగానే ఉన్నా..ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, అందుకు ఉద్యోగులు సమరం చేస్తారా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు.**

## మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

- ఎక్కడా లోపం రాకుండా పటిష్ట ఏర్పాట్లు
- మే10నుంచి 31 వరకు పోటీలపై ప్రత్యేక చర్యలు
- చారిత్రక ప్రాంతాల్లో పర్యటించే వారికి సదుపాయాలు
- అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

2



## అంబర్‌పేట, బిహెచ్ఇఎల్ ప్లై ఓవర్లకు మోక్షం

**ఉప్పల్ ప్లై ఓవర్ పనులు పదినెల్లో పూర్తి**

**భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని సూచన**

**ప్రారంభించిన కేంద్రమంత్రి నితిని గడ్కరీ**

హైదరాబాద్ : హైదరాబాద్‌లో అంబర్‌పేట ఫ్లై ఓవరు అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట, బీహెచ్ఈఎల్ కూడలిలో నిర్మించిన పైవంతెనలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. రోడ్ల నిర్మాణం కోసం పెండింగ్ లో ఉన్న భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అందరికీ నమస్కారం, బాగున్నారా..? అంటూ తెలుగులో మాట్లాడడం మొదలు పెట్టిన ఆయన అనేక అభివృద్ధి అంశాలపై స్పందించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు సరిగా సాగడంలేదని గడ్కరీ పేర్కొన్నారు. ఈ పనుల్లో తలెత్తిన సమస్యకు 2లో

## కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రోడ్డు కనెక్టివిటీ

**హైవేల విస్తరణ వల్ల రోడ్డు ప్రమదాలు తగ్గాయి**

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

2



# రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక

ఈ క్రమంలో బ్యాంకు రుణాలు పొందాలంటే సిబిల్ స్కోర్ బాగుండాలి. ఇప్పుడు రాజీవ్ యువ వికాసం స్కీమ్‌లో సిబిల్ స్కోర్ కీలకం కానుంది. పథకం ద్వారా ప్రభుత్వ సహాయంతో రుణం పొందాలనుకునే యువతకు క్రెడిట్ స్కోర్‌ను ప్రధాన అర్హతగా నిర్ణయించనున్నారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే లేదా గతంలో రుణాలు తీసుకుని చెల్లించకపోతే వారి దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుణాల దరఖాస్తులకు ముందు సిబిల్ స్కోర్‌ను తప్పనిసరిగా పరిశీలించనున్న బ్యాంకులు, దానికి సంబంధించి ఫీజు కూడా వసూలు చేయనున్నాయి. ప్రతి దరఖాస్తుకు రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేసే యోచనలో కొన్ని బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. సిబిల్ స్కోర్ వసూలుపై ప్రభుత్వం స్పందించింది. తక్కువ ఆదాయ వర్గాల అభ్యర్థులపై భారం పడకుండా చూడాలనే ఉద్దేశంతో బ్యాంకులు వసూలు చేసే ఫీజును మినహాయించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు నివేదించనున్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 16,25,441 దరఖాస్తులలో అత్యధికంగా బీసీల నుంచి 5,35,666, ఎస్సీల నుంచి 2,95,908, ఎస్టీల నుంచి 1,39,112, ఈబీసీల నుంచి 23,269, మైనారిటీల నుంచి 1,07,681, క్రిస్టియన్ మైనారిటీ-ల నుంచి 2,689 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం మండల స్థాయిలో దాదాపు 70 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తుది జాబితా మే నెలాఖరులో అందుబాటులోకి రానుంది. మండల అధికారులు పరిశీలించిన దరఖాస్తులను బ్యాంకులకు పంపించి అర్హుల ఎంపిక జరుగుతుంది. తుది జాబితా తయారైన తర్వాత అదే కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి అందజేస్తారు.

# రసాయన ఎరువుల వాడకం తగ్గాలి

తుమ్మల ప్రారంభించారు. సభాపతి ప్రసాద్ కుమార్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డిలతో పాటు- ధరూర్ క్లస్టర్ పరిధిలోని రైతులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ సన్నద్ధంలో భాగంగా శాస్త్రవేత్తలు రైతులను సమాయత్తం చేశారు. వరి సాగులోనూ  పాక్షికంగా ఆరుతడి విధానం పాటించాలని తుమ్మల అన్నారు. యూరియా అధికంగా వాడి, మనల్ని పోషించే భూతల్లిని నాశనం చేయొద్దని సూచించారు. గత ప్రభుత్వం పంటల బీమాను పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం పంటల బీమాను మళ్ళీ పునరుద్ధరించనుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దీని సాగు పెరగాలి. ఇప్పుడు అన్ని జిల్లాల్లో ఈ పంట సాగుకు అనుమతి ఉంది. ఆయిల్‌పామ్‌లో మూడేళ్ల పాటు- అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. గతంలో ఈ పంట దిగుబడి ఆరేళ్లకు వచ్చేది.. ఇప్పుడు మూడేళ్లకే వస్తోంది. దీని సాగుతో నెలకు రెండుసార్లు జీతం వచ్చినట్లు- రైతులకు ఆదాయం వస్తుంది. గత ప్రభుత్వం పంటల బీమాను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం పంటల బీమాను మళ్లీ పునరుద్ధరించనుంది. ఖజానా ఖాళీగా ఉండటం వల్ల కొన్ని ఆలస్యం అవుతున్నాయని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# ఉగ్రదాడిపై మనకేం సంబంధం

ఇస్లామాబాద్ : పహల్గాం ఉగ్రదాడిపై పాక్ జాతీయ అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్ష నేత, పీటీఐ మద్దతుతో గెలిచిన ఎంపీ ఒమర్ అయూబ్ భారత్‌పై విషం కక్కారు. యుద్ధోన్మాదంతో ఊగిపోతూ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం దాడిపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చర్చ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు న్యూఢిల్లీకి దాసోహం అన్నట్టుగా ఉన్నాయని ఆక్షేపణ తెలిపారు. దాడితో పాక్‌కు సంబంధం లేదన్నారు. భారత్‌పై దాడిచేసి వారి విమానాలు నేలకూల్చాలన్నారు. పహల్గామ్ మనకు ఎంతో దూరం..అక్కడకి వెళ్లి మనమెలా దాడి చేస్తామని అన్నారు. ఇదిలావుంటే  ఈ నేపథ్యంలో పాక్ పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్  కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తమ దేశంపై ప్రతీకార చర్యలకు పాల్పడితే.. దానికి దీటుగా బదులిస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. భారత్ నుంచి ఏదైనా దాడి జరిగిన వెంటనే తమ సైన్యం చురుగ్గా ప్రతిస్పందిస్తుందని మునీర్ వ్యాఖ్యానించారు. తాము ప్రాంతీయ శాంతికి కట్టుబడి ఉన్నప్పటికీ..జాతీయ ప్రయోజనాలను, దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి తమ సైనికులు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే.. పహల్గాం దాడికి వారం రోజుల ముందు మునీర్ పాకిస్థాన్‌లో చేసిన కశ్మీర్‌పై చేసిన ప్రసంగమే కారణమై ఉండొచ్చని భారత నిఘా వర్గాలు అనుమానం వ్యక్తం చేశాయి. ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో ఆయన మాట్లాడుతూ.. 'మన ఉద్దేశం స్పష్టం. కశ్మీర్ గతంలోనూ మన జీవనాడిలా ఉండేది. భవిష్యత్తులోనూ ఉంటుంది. దానిని మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరుల పోరాటంలో.. వారిని ఒంటరిగా వదిలేయం. మన జీవితంలోని ప్రతి అంశంలోనూ హిందువుల కంటే భిన్నమని భావించిన మన పూర్వీకుల ఆలోచనలను అప్పుడే వారు గుర్తుంచుకుంటారు. మన మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు భిన్నమైనవి. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. మనవి రెండు దేశాలు' అని మునీర్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాతే పహల్గాం దాడి చోటుచేసుకుంది. అదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా, నిఘా విమానాలను కరాచీ నుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించడం అనుమానాలను బలపరుస్తోంది. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై దాడి జరిగినప్పుడు మునీర్ పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అధిపతిగా ఉన్నారు. ఆ దాడి ఆయన కనుసన్నల్లోనే జరిగిందని చెబుతారు. ఇప్పుడు ఆయనే ఆర్మీ చీఫ్ కావడంతో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకను ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

## ప్రధాని కార్యాలయానికి రాహుల్

### సిబిఐ డైరెక్టర్ ఎంపికపై భేటీ

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్రమోదీతో కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్లో విపక్ష నేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ప్రధాని మోదీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా సీబీఐ డైరెక్టర్ ఎంపికపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అటు-, పహల్గాం దాడికి సంబంధించి పాకిస్థాన్ తో అనుసరించాల్సిన విషయాలపై కూడా వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్టు- సమాచారం. వీటితో పాటు పలు కీలక అంశాలు కూడా ఇరువురు నేతల మధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. సోమవారం సాయంత్రం రాహల్ ప్రధాని కార్యాలయానికి వెళ్లారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కొత్త చీఫ్‌ని ఎంపిక చేసేందుకు నిర్వహించిన భేటీలో  ఆయన పాల్గొన్నారు. ప్రధాని కార్యాలయంలో నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీ- సమావేశానికి రాహుల్‌తో పాటు- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా హాజరయ్యారు.  ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలం మే 25న ముగియనున్న తరుణంలో కొత్త చీఫ్ ఎంపికపై చర్చించినట్లు- తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల నియామక కమిటీ-లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు.  ఈ కమిటీ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం సీబీఐ డైరెక్టర్ నియామకాన్ని చేపడుతుంది.

# రూపాయి అప్పుకూడా పుట్టని పరిస్థితి

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాం లో సమయానికి జీతాలు రాకున్న నోరు విప్పలేదు.. ఇప్పుడు వాళ్ల అడగకముందే జీతాలు ఇస్తోన్న  సమరం చేస్తామంటున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని.. రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని సూచించారు. రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిన స్థితిలో ఉందని.. ఒక్కరూపాయి కూడా అప్పు పుట్టడం లేదని.. బ్యాంకులకు వెళితే దొంగలను చూసినట్లు- చూస్తున్నారని అన్నారు. అణాపైసా చిక్కడం లేదని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పినా ఎవరూ నమ్మడం లేదన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్లు వేయాలనే పరిస్థితి నెలకొందని.. స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి పరిష్కారమని తెలిపారు. సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టు-బడులను ఆకర్షించగలుగు తోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటు-ంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు-, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

# మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

హైదరాబాద్ : మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారికి ఆతిథ్యమివ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.మే 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రపంచస్థాయి పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు- చేయాలని పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటా పరిచయం చేసేందుకు ఉపయోగపడే మిస్ వరల్డ్ 2025 వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అన్నారు. పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు 3000 మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలని, పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. పర్యాటక శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, అధికారులు అంతా సమర్థంగా తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ- పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మే 10 నుంచి 31వ తేదీ వరకు వరుసగా జరిగే కార్యక్రమాల షెడ్యూలుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు- చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ప్రారంభోత్సవం నుంచి 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని చార్మినార్, లాడ్ బజార్‌తో  పాటు- తెలంగాణ తల్లి, సెక్రెటేరియట్ తోపాటు- రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో అవసరమైన రవాణా, వసతులు కల్పించాలన్నారు. అక్కడ భద్రత కట్టు-దిట్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుకోని అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు- చేయాలన్నారు. హైదరాబాద్ లో మిస్ వరల్డ్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు- చేసుకోవాలని, ఈదురు గాలులు, వర్షాలు వచ్చినా గ్రేటర్ సిటీ- పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీతో పాటు- హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిస్ వరల్డ్ కు వచ్చే విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతో పాటు- గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సెక్రెటేరియట్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు- వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరఫున మిస్ వరల్డ్ 2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బీసీ, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు- చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, హోర్డింగ్ లతో పాటు- సిటీ-లోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలని అన్నారు.

# అంబర్‌పేట, బిహెచ్ఇఎల్ ఫ్లై ఓవర్లకు మోక్షం

పరిష్కారం కనుగొన్నామని, వేగంగా పూర్తి చేయడంకోసం కొత్త కాంట్రాక్టర్‌ను నియమించామని తెలిపారు. వచ్చే పది నెలల్లో ఫ్లై ఓవర్‌ను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ భూసేకరణ వేగంగా పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఐటీ-, ఫార్మా రంగాల్లో అగ్రస్థానంలో ఉందని.. ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు ఇది కేంద్ర బిందువైందని గడ్కరీ అభిప్రాయపడ్డారు. దేశంలోని అనేక నగరాల నుంచి ప్రజలు హైదరాబాద్‌ను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌ను ప్రధాన నగరాలతో కలిపేలా జాతీయ రహదారుల అభివృద్ధి జరిగిందని వివరించారు. ఇండోర్-హైదరాబాద్ కారిడార్ తెలంగాణలో పూర్తయ్యిందని, మహారాష్ట్రలో కూడా పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కారిడార్‌తో 20 గంటల ప్రయాణం 10 గంటల్లో పూర్తి అవుతుందని చెప్పారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్-విజయవాడ 4 లేన్ రోడ్డు ని 6 లేన్ రోడ్డుగా మారుస్తామని చెప్పారు. నాగ్‌పూర్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన డబుల్ డెక్కర్ ఎయిర్ బస్ ను హైదరాబాద్ రింగ్ రోడ్డుపై ప్రయోగాత్మకంగా పరిశీలన చేయాలని రాష్ట్ర మంత్రులను కోరారు. ఈ బస్సులో ఎయిర్ హోస్టెస్ లాగా బస్ హోస్టెస్ కూడా ఉంటారని, సాధారణ బస్సుల కంటే 3 శాతం ఛార్జి తక్కువగా ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని.. డీజిల్, పెట్రోల్ వాహనాలపై ఆధారం తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులు వ్యవసాయంలో కూడా పర్యావరణహిత వాహనాలు ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క స్మార్ట్ నగరాలతో దేశ అభివృద్ధి సాధ్యం కాదని, స్మార్ట్ గ్రామాలు అవసరం అని గడ్కరీ తెలిపారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. హైదరాబాద్‌లో ఐటీతోపాటు ఫార్మా రంగం కూడా పెద్దదే. దేశంలోని ఎన్నో నగరాల నుంచి హైదరాబాద్‌కు వస్తుంటారు. అన్ని ప్రధాన నగరాలను హైదరాబాద్‌కు కనెక్ట్ చేసేలా జాతీయ రహదారులు అభివృద్ధి చేశాం. తెలంగాణ అభివృద్ధికి మోదీ నేతృత్వంలో మేమంతా కట్టు-బడి ఉన్నాం. ఇండోర్- హైదరాబాద్ కారిడార్ తెలంగాణ పనులు పూర్తి చేశాం. మహారాష్ట్రలో కూడా పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. ఈ కారిడార్ పూర్తయితే 20 గంటల ప్రయాణం 10 గంటల్లోనే చేయొచ్చు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ - విజయవాడ 4 లైన్ల రోడ్డును 6 లైన్లుగా మారుస్తాం. అంబర్‌పేట పైవంతెనను రూ.145 కోట్లతో, నాలుగు వరుసల్లో  సుమారు 1.5 కి.మీ మేర నిర్మించగా.. చందానగర్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా రామచంద్రాపురం వరకు రూ.176 కోట్లతో 1.6కి.మీ మేర బీహెచ్ఈఎల్ వంతెనను నిర్మించారు. నితిన్ గడ్కరీ కృషి వల్ల ఏ గ్రామానికి వెళ్లినా జాతీయ రహదారులు కనిపిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయన్నారు. అమెరికాను తలదన్నేలా భారత్‌లో జాతీయ రహదారులు ఉన్నాయి. నితిన్ గడ్కరీ దగ్గరకు ఏ పార్టీ ఎంపీ వెళ్లి అడిగినా కాదనకుండా ఇస్తారు. ఆయన్ను ఫ్లై ఓవర్ల మంత్రి అని కూడా పిలుస్తుంటారు. అంబర్‌పేట ÷-లఫైఓవర్ ప్రారంభించుకున్నప్పటికీ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగానే ఉంది. ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆయా ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేయాలి' అని అన్నారు. నో అనే మాట గడ్కరీ నోటి నుంచి రాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఉప్పల్, కొంపల్లి కారిడార్‌లు వేగవంతం చేయాలని కేంద్రమంత్రిని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, కరీంనగర్ హైవేను జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు. ఇదిలావుంటే అంబర్‌పేట పైవంతెన ప్రారంభోత్సవ సమయంలో ఉద్రిక్తత చోటు- చేసుకుంది. కాంగ్రెస్, భాజపా శ్రేణుల మధ్య తోపులాట చోటు- చేసుకుంది. భాజపా నాయకులు మోదీ..మోదీ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పోటీగా నినాదాలు అందుకున్నారు. గడ్కరీ కాన్వాయ్‌ను కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నేతలను  పోలీసులు చెదరగొట్టారు.

# ఉద్యోగ సంఘాలతో చర్చలేవీ

తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలకు ఎన్నో సమస్యలు ఉన్నాయి., సీఎం రేవంత్ రెడ్డి చర్చకు రావాలని పిలిచారు.. కానీ మంత్రులు మాత్రం చర్చకు సమయం కేటాయించడం లేదని అన్నారు. గత ప్రభుత్వం విజ్ఞప్తులకు స్పందించకపోవడం వాస్తవమే. ఆర్థిక సమస్యలు పక్కన పెట్టినప్పటికీ, విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. మేము సమరం కాదు, ఉద్యమం చేస్తున్నాం. మంత్రుల కోసం గంటల తరబడి ఎదురుచూస్తున్నాం. అడగొద్దు అంటే అడగం. మేమే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చాం అని ఆయన పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అంటే గౌరవం. మీరు తండ్రి పాత్రలో ఉన్నారు. మీరు ఇచ్చిన గంట సమయం మాకు విలువైనది. కానీ, మిగిలిన మంత్రులు మాత్రం మాట్లాడటం లేదు. ప్రజలపై యుద్ధం చేయాలని మేము కోరడం లేదు. సబ్ కమిటీ- అనే మీ ఏర్పాటు- చేసిన బృందం అసలు మాట్లాడటానికి ముందుకు రావడంలేదు. సీఎం చెప్పినట్లే, కొంతమంది సంఘాల నేతలు ప్రభుత్వంతో కుమ్మక్కు అయ్యారు. వాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో చూడండి. ప్రభుత్వానికి డబ్బుల్లేవన్న విషయాన్ని మేము అర్థం చేసుకోగలం. కానీ, మాతో మాట్లాడి సమస్య పరిష్కారం చేయండి. కోట్ల రూపాయలు అడగడం లేదని ఆయన అన్నారు. మొత్తంగా ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై తమ అంచనాలను స్పష్టంగా తెలియజేస్తూ సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

ఈ  సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్. రూ. 3526 కోట్లతో 95 కిలోమీటర్ల మేర ఫోర్ లైన్స్ నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. ఆదిలాబాద్ అనగానే వెనుబడిన అనే అపోహ ఉండేది కానీ.. ఆదిలాబాద్ లో రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. అయితే ఆదిలాబాద్‌ను వెనకబడేశారని అన్నారు. గత పాలకులకు ఈ జిల్లాను పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాకముందు 2500కి.మీ రహదారులు  హైవే ఉండేది.  బీజేపీ అధికారంలోకి వచ్చాక 5100 కి.మీ నేషనల్ హైవేలు నిర్మించాం. దేశంలోని జాతీయరహదారుల కోసం లక్షా 20 వేల కోట్లు- కేటాయించాం. తెలంగాణకు కేంద్రం రూ. 12 లక్షల కోట్లు కేటాయించింది.  రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలి. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే  దేశం విశ్వ గురువు అవుతుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేసేందుకు కేంద్రం సిద్ధం.  హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే రహదారులు సరిగా లేవు.  రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా నిర్మించేందుకు కేంద్రం రెడీగా ఉంది.  రాజీవ్ రహదారి నిర్మించిన కాంట్రాక్టర్ సమస్యను పరిష్కరించాలి.  రాజీవ్ రహదారిని మంచిర్యాల వరకు పొడించాలని కోమటిరెడ్డిని కోరారు. నితిన్ గడ్కరీ ఎవరు ఏది అడిగినా ఇస్తారని బండి సంజయ్ అన్నారు.

# కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రోడ్డు కనెక్టివిటీ

కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ : కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీనే లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో రూ. 3,694.4 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు జరిగాయని, హైవేల విస్తరణ వల్ల రోడ్డు ప్రమదాలు తగ్గాయని.. సమయం తగ్గిందని అన్నారు.తెలంగాణలో హైవేల నిర్మాణ పనులకు...కేంద్రం రూ. 1.25 లక్షల కోట్లు- కేటాయించిందని తెలిపారు. క రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హైవేల విస్తీర్ణం 5 వేల కిలోమీటర్లు దాటిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గడ్కరీతో కలసి ఆయన కాగజ్‌నగర్ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాటల్ఆడుతూ.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనెక్టివిటీ-ని పెంచడం మోదీ సర్కార్ లక్ష్యమని అన్నారు. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణం 5వేల కి.మీ దాటిందని చెప్పారు. జాతీయ రహదారుల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు, ప్రయాణ సమయం భారీగా తగ్గాయి. రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కేంద్రం అంకితభావంతో పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 7 -టె-క్స్-టైల్ పార్కులు మంజూరు చేస్తే తెలంగాణకు కూడా ఒకటి దక్కింది. రూ.6,330 కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి పరిశ్రమను పునరుద్ధరించుకున్నాం. ఇచ్చిన హామీ ప్రకారం నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు మంజూరు చేశాం. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని మోదీ ప్రభుత్వం అందజేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# ఆర్టీసీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది

కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్, ఎస్టీఎంయూ జనరల్ సెక్రెటరీ పున్న హరికృష్ణ, తదితరులు ఉన్నారు. ఆర్టీసీ సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ సంఘాల నేతలు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ సమస్యలపై ఉద్యోగులు ఎప్పుడైనా తనను కలవవచ్చని.. వారికి తానెప్పుడు అందుబాటులోనే ఉంటానని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమస్యలు పరిష్కరించడానికి తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం తమ కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం , ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని.. సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. సమ్మె చేయొద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీ అభివృద్ధి కోసం 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామని.. ఒక్కరినైనా ఇబ్బంది పెట్టలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ రూ.400 కోట్లు చెల్లించామని తెలిపారు. 2017 ప్రకారం పే స్కేల్ 21 శాతం ఇచ్చామని..సంవత్సరానికి రూ.412 కోట్ల భారం తమ ప్రభుత్వంపై పడుతోందని చెప్పారు. పీఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1039 కోట్లు చెల్లించామని వెల్లడించారు. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి-2024 నుంచి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ. 345 కోట్లు- చెల్లించామని అన్నారు. 1500 మందిని కారుణ్య నియామకాల కింద విధుల్లోకి తీసుకున్నామని వివరించారు. తమ ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీలో 3038 మంది ఉద్యోగులను నియమించనుందని చెప్పారు. కొత్త బస్సులు కొనుగోలు చేశామని, తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసి కార్మికులు సమ్మెకు పిలుపునివ్వడంతో స్పందించిన మంత్రి పొన్నం.. సమ్మె చేయొద్దని, చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆర్టీసి సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సమస్యలు వినడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. ఆర్టీసి పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. కాగా, తెలంగాణ వ్యాప్తంగా మే 7 నుండి ఆర్టీసి కార్మికుల నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఆర్టీసి పరిరక్షణ, విలీన ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ.. మే 6 అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు బంద్ కానున్నట్లు కార్మికులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తోంది.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మరణాలు



సిద్దిపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మరణాలకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యులని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గు చేటుని విమర్శించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం నాడు హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామ ర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, అన్నదాతల ఆవేదనపై లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. అందాల పోటీలపై పోటీపడి సమీక్షలు నిర్వహిస్తున్న నాయకులకు, కొనుగోలు కేంద్రాల్లోనే కుప్పకూలుతున్న రైతున్నల గుండె కోత వినిపించడం లేదా? అని ప్రశ్నించారు.సాగునీళ్లు అందించడంలో, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో, కొనుగోలుచేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా ధాన్యం కొనలేదని.. రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తూ రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. ధాన్యం కుప్పలపైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 15న జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూరు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో జలపతిరెడ్డి అనే రైతు మృతి చెందాడని, ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో హనుమండ్ల ప్రేమలత అనే మహిళా రైతు హఠాన్మరణం చెందిందని, ఏప్రిల్ 22న మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి కొనుగోలు కేంద్రంలో బిర్రు వెంకన్న ప్రాణాలు కోల్పోయాడని, ఏప్రిల్ 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం నేర్పుతూ చింతకింది హనుమయ్య కుప్పకూలాడని తెలిపారు. ధాన్యపు రాశులే సాక్ష్యంగా, కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఈ మరణాలకు బాధ్యులు అని అన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం, వారి ప్రాణాల మీదకు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీళ్లు అందించడంలో వైఫల్యం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు- చేయడంలో వైఫల్యం, కాంటాలు పెట్టడంలో వైఫల్యం, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం, బడాయిగా చెప్పిన బోనస్ అందజేయడంలో ఘోర వైఫల్యమని హరీశ్‌రావు అన్నారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రైతు మహోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులు ప్రాణులు కోల్పోతుంటే ఏం ముఖం పెట్టుకొని వేడుకలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈదురుగాలులు, అకాల వర్షాలతో రైతులు దినదినగండంగా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని హరీశ్‌రావు అన్నారు. ఒక వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పినందుకు, ఇంకెందుకో తెలియదు గానీ ప్రకృతి పగ పట్టినట్టుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతూ నష్టపోకుండా ప్రతి రైతుకూ మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టారని.. పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం ధాన్యం కొనుగోళ్ల పక్రియ ప్రహసనంగా మారిందని అన్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు 10 రోజులు దాటుతున్నా రైతులకు చెల్లించడం లేదని తెలిపారు. ధాన్యం డబ్బులు 48 గంటల్లోనే చెల్లించాలని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన మాటలు ఉత్త మాటలే అయ్యాయని అన్నారు. 70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకు 24.43 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని అన్నారు. దీని విలువ రూ. 5664 కోట్లుత అని.. చెల్లించింది మాత్రం రూ. 3163 కోట్లు అని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వాహకుల అలసత్వం.. ఫలితంగా అన్నదాతలు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి వారాల కొద్దీ వేచి చూసినా కాంటాలు కావడం లేదని హరీశ్‌రావు తెలిపారు. టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో, అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నాయని అన్నారు. వివిధ కారణాలు చెప్పి 5 కిలోల దాకా తరుగు తీస్తుండటం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నదని చెప్పారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, తడిచిన ధాన్యం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం, పది రోజుల నుంచి కొనుగోలు పక్రియ జరగడం లేదని విమర్శించారు. మార్కెట్లో వంద లారీలు ధాన్యం తడిసిపోయి ఉన్నాయని, వడ్ల కుప్పల మీదనే రైతులు ప్రాణాలు వదులుతున్నారని హరీష్ రావు అన్నారు. ఇప్పటికే ఐదుగురు రైతులు ధాన్యపు కుప్పల మీదనే ప్రాణాలు వదిలారన్నారు. ఇవి సాధారణ మరణాలు కావని, ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ ఈ ప్రభుత్వానికి రైతుల మీద లేదని విమర్శించారు. అందాల పోటీలు అన్నం పెడతాయా అని ప్రశ్నించారు. దేశంలో అత్యధిక పంట పండిందని గొప్పలు చెప్పడం కాదని.. రైతుల బాధలు పట్టించుకోవాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని కోరారు. పండిన పంటను కొనక రైతులను తిప్పలు పెడుతున్నారని.. అయితే డిల్లీకి.. లేకుంటే అందాల పోటీల రివ్యూలు... అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ.. రైతుల మీద లేకుండా పోయిందన్నారు. అకాల ఈదురు గాలులు, వర్షాలకు మామిడి కాయ లేకుండా మొత్తం రాలి పోయిందని అన్నారు. పత్తి రైతుల్ని కూడా ప్రభుత్వం ముంచిందని, పత్తి రైతులకు 20 శాతం మాత్రమే ఏంఎస్‌పికి తీసుకున్నారని.. మిగతా 80 శాతం బ్రోకర్లు, ప్రైవేటు మిల్లర్ల పాలు చేశారని విమర్శించారు. దాదాపు మూడు వేల కోట్ల నష్టం రైతులకు జరిగిందన్నారు.పత్తి రైతులకు జరిగిన అన్యాయంపై సీబీఐ చేత విచారణ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. 48 గంటల్లో వడ్ల పైసలు ఇస్తున్నామని చెబుతున్న మంత్రి నిరూపిస్తారా అని సవాల్ చేశారు. పది రోజులలోపు పైసలు రాడమే లేదన్నారు. బోనస్ అని గొప్పగా చెప్పి, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రైతు బంధు, రైతు బీమా ఆగిపోయిందని.. తక్షణమే రైతు బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేవుడు, చర్చి, దర్గా మీద సీఎంకు నమ్మకం ఉంటే రుణ మాఫీ డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ప్రభుత్వానికి పరిపాలన సరిగా చేయడంలేదని, పాలన గాలిలో దీపంలా మారిందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేల ఇన్పుట్ సబ్సిడీ అందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇవ్వలేదు.. నాణ్యమైన కరెంటు ఇవ్వలేదు.. నీళ్లు ఇవ్వలేదు.. పండిన పంటను కూడా కొనడం లేదు అని విమర్శించారు. రుణమాఫీ జరిగిన రైతులు వివరాలతో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు- చేయాలని సూచించారు. 25 శాతం మందికి రుణమాఫీ చేసి పూర్తి రుణమాఫీ జరిగిందని ప్రచారం చేసుకోవడం దుర్మార్గమని అన్నారు. మరికొన్ని చోట్ల దొంగల బెడద కూడా రైతన్నకు నిద్ర లేకుండా చేస్తున్నదని హరీశ్‌రావు అన్నారు. ఇంటిని వదిలి, రోజుల తరబడి రైతులు వరి కుప్పలపై టార్ఫాలిన్ కవర్లు కప్పి అక్కడే కాపలా కాస్తున్న పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాతలకు కన్నీళ్లు పెట్టిస్తున్నదని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడం నిరాశలోకి నెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పత్తి రైతులకు ప్రభుత్వం మోసం చేసింని అన్నారు. ఈఈఒ అధికారులతో కలిసి పత్తి రైతులను ముంచి 3500 కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించిన తర్వాత విజిలెన్స్ ఎంక్వయిరీ వేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం సహా, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదని మండిపడ్డారు.

## కెసిఆర్ అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదు

### పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అద్దంకి దయాకర్

జనగామ : కెసిఆర్ అధికారంలోకి వచ్చేది లేదు, సచ్చేది లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌కు రేవంత్ రెడ్డిని తట్టుకోవడం అంత ఈజీ కాదని స్పష్టం చేశారు.జనగామ జిల్లా పాలకుర్తిలోని బృందావన్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ తీరును తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా ఆ సభలో కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీష్ రావులకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని ఎద్దేవా చేశారు. అలాగే.. నువ్వు ఉద్యమ నాయకుడి అని చెప్పుకుంటావు. 9 సంవత్సరాలుగా సీఎంగా ఉన్నావు. ఒక్క సభ కోసం వందల కోట్లు ఖర్చు పెట్టావు. కానీ, రేవంత్ రెడ్డి ఒక్కరే నిన్ను రాజకీయంగా పూర్తిగా కుదిపేశాడు. ఆ దెబ్బకి నీవు ఇప్పటివరకు కోలుకోలేదని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, కేటీఆర్ ను బీఆర్ఎస్ పార్టీ జనతా గ్యారేజ్ అన్నావు.. కానీ, ఆ గ్యారేజ్‌లో తానే తన కొడుకును సంపేస్తున్నాడు అని విమర్శించారు. బీజేపీ పార్టీపై కూడా అద్దంకి దయాకర్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ ఒక బిల్లా రంగ పార్టీ. అందులో కిషన్ రెడ్డి, బండి సంజయ్ లాంటి నేతలు బిల్లా రంగ నాయకులుగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడిన బీజేపీ నాయకులు, ఇప్పుడు మోడీ ప్రభుత్వం కులగణన చేస్తామంటే సంతోషంగా స్పందిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా, కాంగ్రెస్ పార్టీ లక్ష్యం రాహుల్ గాంధీని ప్రధాని చేయడమేనని దయాకర్ పేర్కొన్నారు. నాకు పార్టీ నుండి అవకాశం రాకపోయినా ఎప్పుడూ బాధపడలేదని, పార్టీ ఎప్పుడైనా నన్ను గుర్తిస్తుందని నమ్మకం ఉందని ఆయన అన్నారు. పార్టీ నన్ను గుర్తించి ఎమ్మెల్సీ పదవిని ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ వాడుకునే వదిలేసే పార్టీ కాదు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇచ్చే పార్టీ అదే కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హైదరాబాద్ చేరుకుంటున్న సుందరీమణులు

### ఘనంగా స్వాగతిస్తున్న తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్స్ హైదరాబాద్ చేరుకుంటున్నారు. సోమవారం పోర్చుగల్, ఘనా, ఐర్లాండ్ దేశాలకు చెందిన ప్రతినిధులు శంషాబాద్ చేరుకున్నారు. వీరికి పూర్తి సంప్రదాయ లాంఛనాలతో పర్యాటక శాఖ స్వాగతం పలికింది. స్వాగత సత్కారాలతో పాటు-, భద్రత, వసతికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. పోర్చుగల్ కు చెందిన మారియా అమెలియా ఆంటోనియో, ఘనా నుంచి జుట్టా అమా పోకుహా అడ్డో, ఐర్లాండ్ కు చెందిన జాస్మిన్ జెర్హార్డ్ లు హైదరాబాద్ చేరుకున్నారు.

## ఆర్టీసీ కార్మికులక సమ్మె కవాతు

### సమ్మె యధాతథంగా కొనసాగుతుందని వెల్లడి

హైదరాబాద్ : ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పిలుపు నిచ్చిన నేపథ్యంలో సోమవారం వారు కవాతు నిర్వహించారు. అందులోభాగంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్దనున్న బస్ భవన్‌ను తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సోమవారం ముట్టడించారు. దీంతో బస్ భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మరోవైపు సమ్మె యధా విధిగా కొనసాగుతోందని ఆర్టీసీ జేఏసీ ఈ సందర్భంగా ప్రకటించింది. సమ్మె నేపథ్యంలో తమతో చర్చలకు ఆర్టీసీ యాజమాన్యం పిలవకపోవడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అర్థరాత్రి నుంచి బస్సులు ఎక్కడివక్కడ నిలిచిపోతాయని చెప్పారు. తమ సమ్మెకు సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. మే 7వ తేదీ నుంచి తాము తలపెట్టిన సమ్మె యధా విధిగా కొనసాగుతుందని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. కార్మికుల కవాతు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఆదివారం ఆర్టీసీ కార్మిక నేతలతో సమావేశమయ్యారు. సమ్మెను ఉప సంహరించుకోవాలని వారికి ఆయన సూచించారు. ఆర్టీసీ సంస్థ ఇప్పుడే లాభాల బాట పడుతోందని వారికి వివరించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు తీరిన అనంతరం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చేపట్టిన వివరాలను వారికి ఆయన సోదాహరణగా వివరించారు. అయితే ఆర్టీసీ జేఏసీ నేతలు మాత్రం తమ సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోమని స్పష్టం చేశారు. ఆ క్రమంలో ఆర్టీసీ కార్మికులు సోమవారం కవాతు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ముఖ్య కార్యాలయం బస్ భవన్‌ను వారు ముట్టడించారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. మే 7వ తేదీ నుంచి తాము సమ్మెకు వెళ్తున్నట్లు- తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా ఏప్రిల్ 27వ తేదీన అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్టీసీ జేఏసీ విడుదల చేసింది. మేడే స్ఫూర్తితో తాము ఈ సమ్మెకు సిద్దమయ్యామంది. ఇప్పటి-కై-నా ప్రభుత్వం స్పందించి.. తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి ఆర్టీసీ జేఏసీ తీసుకు వెళ్లింది.

## హరిరామ్ ఆర్థిక లావాదేవీలపై ఆరా

### లాకర్లు తెరిపించే చర్యలు మొదలు

హైదరాబాద్ : ఆదాయానికి మించి ఆస్తుల కేసులో కాళేశ్వరం ప్రాజెక్ట్ మాజీ ఈఎన్‌సీ హరిరామ్ కస్టడీ కొనసాగుతోంది. ఐదురోజుల కస్టడీలో భాగంగా ఏసీబీ అధికారులు నాలుగో రోజు ఆయనను ప్రశ్నించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల పత్రాలను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు వాటి కొనుగోళ్లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. సోదాల్లో భాగంగా గుర్తించిన బ్యాంకు లాకర్లు తెరిపించేందుకు చర్యలు ప్రారంభించారు. ఈరోజు బ్యాంకు లాకర్లు తెరిచే అవకాశం ఉంది. వాటిని తెరిస్తే మరికొన్ని కీలక పత్రాలు, ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటు-ందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలోనూ ఏవైనా ఆస్తుల పత్రాలు లభిస్తే వాటి ఆధారంగా కూడా హరిరామ్‌ను మరింత లోతుగా ప్రశ్నించే అవకాశం ఉంది. హరిరామ్‌ను ఐదురోజుల పాటు- కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది. ఈరోజు నాలుగోరోజు విచారణ కొనసాగుతోంది. అయితే గడిచిన మూడు రోజుల విచారణలో కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బంజారాహిల్స్ ఏసీబీ ప్రధాన కార్యాలయంలో హరిరామ్‌ను దాదాపు ఐదు మంది అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు వందల కోట్లు- ఆస్తులు కూడబెట్టినట్లు- ఇప్పటికే అధికారులు ఓ అంచనాకు వచ్చారు. ఇంకా బినామీ ఆస్తులకు సంబంధించి కూడా పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈరోజు సాయంత్రం లోగా బ్యాంకు లాకర్లను కూడా తెరిచే అవకాశం ఉంది. ఆ. వాటి పత్రాలను సీజ్ చేశారు. మూడు రోజుల విచారణలో ఏసీబీ అధికారులకు హరిరామ్ సహకరించడం లేదని సమాచారం. దీంతో నేడు, రేపటి విచారణ చాలా కీలకమని చెప్పుకోవచ్చు. ఈ రెండు రోజుల విచారణ తర్వాత ఎలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయి.. రిమాండ్‌కు తరలించే సమయంలో ఎలాంటి కీలక అంశాలు రాబట్టారు అనే విషయాలను రిమాండ్ రిపోర్టులో పేర్కొనే అవకాశం ఉంది. ఈరోజు మధ్యాహ్నం తరువాత హరిరామ్‌ను తీసుకెళ్లి బ్యాంకు లాకర్లు ఓపెన్ చేసి అక్కడే విచారణ జరిపే ఛాన్స్ ఉంది.

## నక్సల్స్‌తో చర్చల ప్రసక్తి లేదు

పెద్దపల్లి : మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదనే విషయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు రామగుండంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే చర్చలేంటని సంజయ్ ప్రశ్నించారు. ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారంటూ బండి సంజయ్ ఎదురు ప్రశ్నించారు. కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోంది. మావోయిస్టులు దశాబ్దాలుగా అమాయకులను కాల్చి చంపిన సంగతి గుర్తు లేదా?, మావోయిస్టుల సానుభూతి పరులు సాధించిందేంటని అన్నారు. వారిపై నిషేధం విధించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని అన్నారు. మావోయిస్టులు ఎవరున్నా తుపాకీ వీడి లొంగిపోవాల్సిందే.. జన జీవన స్రవంతిలో కలవాల్సిందే. పౌర హక్కుల సంఘం నేతలారా.. నక్సల్స్ నచ్చజెప్పండని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. కేవలం సర్వే మాత్రమే జరిగిందన్నారు. ఇక్కడ బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. ప్రతి ఇంటికి కచ్చితంగా వెళ్లి నిర్వహించేది కులగణన అని అన్నారు. జనగణన మాదిరిగానే మోదీ ప్రభుత్వం కులగణన చేస్తుందన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామన్నారు బండి సంజయ్.

## బిఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు

### హరీష్‌ను అన్ ఫాలో చేసిన కెటిఆర్
### వైఎస్ బతికుంటే హరీష్ కాంగ్రెస్‌లో ఉండేవారు
### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబంపై ఆది శ్రీనివాస్ షాకింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు ఉన్నాయని.. తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని అన్నారు. హరీష్‌రావును సోషల్ మీడియాలో కేటీఆర్ ఆన్ ఫాలో చేశారని తెలిపారు. ఆ పార్టీలో గ్రూప్ తగాదాలు తారాస్థాయికి చేరాయని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో కుర్చీ పంచాయితీ నడుస్తోందని విమర్శించారు. ఒక వైపు కవిత, మరో వైపు కేటీ-ఆర్, ఇంకోక వైపు హరీష్‌రావు ఇలా గ్రూప్ తగాదా నడుస్తుందని ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం) సీఎల్పీ మీడియా పాయింట్‌లో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. హరీష్‌రావు కాంగ్రెస్‌లోకి రావడానికి గతంలో ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉంటే హరీష్‌రావు ఇప్పటికి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేవారని తెలిపారు. హరీష్‌రావు కాంగ్రెస్‌లోకి వచ్చే విషయంపై ఏమైనా ఉంటే అధిష్ఠానం చూసుకుంటుందని అన్నారు. బీఆర్ఎస్‌లో హరీష్‌రావు ప్రాముఖ్యం తగ్గిపోయిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. బీసీ కులగణన కాంగ్రెస్ పేటెంట్ అని ఆది శ్రీనివాస్ ఉద్ఘాటించారు. గతంలో ప్రతీ పేద వాడికి ఏది కావాలో గుర్తించి కాంగ్రెస్ అందించిందని తెలిపారు. కులగణనపై ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉందని.. దానిని తమ ప్రభుత్వం పూర్తి చేసిందని అన్నారు. కుల గణనపై బీజేపీ ఏనాడూ నోరు విప్పలేదని చెప్పారు. తాము కులగణన చేసిన తర్వాత బీజేపీ దిగి వచ్చిందని అన్నారు. బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్ వైపు చూస్తుండటంతో బీజేపీ కుయుక్తులు చేస్తోందని విమర్శలు చేశారు. తెలంగాణలో కులగణన కాదు, సర్వే చేశారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంటు-న్నారని అన్నారు. ఈ రెండింటికి తేడా ఏంటని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. రేపు బీజేపీ ప్రభుత్వం చేసేది కూడా ఇదే కదా.. కులగణన చేసేది ఈ అధికారులే కదా అని ఆది శ్రీనివాస్ నిలదీశారు. సర్వే, కుల గణన చేసినా కులం మారదు కదా అని ప్రశ్నించారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కులగణన ప్రారంభించి కట్ ఆఫ్ డేట్ పెట్టి పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని చెప్పారు. ఈ రోజు దేశవ్యాప్తంగా బీసీలు ఒక్కటవుతున్నారని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన బీసీ ధర్నాకు 17 రాజకీయ పార్టీలు హాజరైతే.. బీజేపీ, బీఆర్ఎస్‌లు దూరంగా ఉన్నాయని మండిపడ్డారు. బీసీల పట్ల ఈ రెండు పార్టీల చిత్తశుద్ధి ఏంటో తెలుస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## 15న పోచంపల్లి సందర్శించనున్న మిస్ పోటీదారులు

### భారీగా ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ

హైదరాబాద్ : హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు జరగబోతున్న సంగతి తెలిసిందే. అయితే ఒక ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలో భాగస్వాములు అవుతున్న మిస్ వరల్డ్ – 2025 గ్రూప్ –2 పోటీదారులు మే 15న ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని సందర్శించనున్నట్లు పర్యాటక విభాగం అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ఇక్కత్ పై ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి, దాని సంక్లిష్టమైన ఇక్కత్ నేత పద్ధతులకు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. పోచంపల్లిని యునెస్కో ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామంగా గుర్తించింది. ఇది చేతిపనులు, సంస్కృతి, వారసత్వానికి సజీవ మ్యూజియం. మిస్ వరల్డ్ పోటీదారులు ఇక్కత్ సాంప్రదాయ టైఅండ్–డై ప్రక్రియను పరిశీలిస్తారు. నిష్ణాతులైన నేత కార్మికులతో సంభాషిస్తారు. అలాగే హైదరాబాద్ నిజాంలు ఒకప్పుడు అభిమానించిన డబుల్ ఇకాట్ కళాఖండం అయిన ఐకానిక్ టెలియా రుమల్ తయారీని చూస్తారు. ఆచార్య వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలో చారిత్రాత్మక పాత్ర పోషించిన ఈ గ్రామం వస్త్ర కళాత్మకత, సామాజిక–సాంస్కృతిక వారసత్వం అరుదైన మిశ్రమాన్ని అందిస్తుంది. మిస్ వరల్డ్ వేదిక అపూర్వమైన అంతర్జాతీయ దృశ్యమానతను అందిస్తున్నందున, ఈ ప్రతిష్టాత్మక సందర్శన తెలంగాణ రాష్ట్ర గొప్ప చేనేత వారసత్వాన్ని ప్రపంచ పటంలో ఉంచుతుంది. పోచంపల్లి శక్తివంతమైన నేత, గ్రామీణ హస్తకళ ఇంకా సాంస్కృతిక లోతును ప్రదర్శించడం ద్వారా, ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న చేనేత అభిమానులకు భారతదేశ జీవన సంప్రదాయాల శక్తివంతమైన వేడుకగా మారుతుంది. ఈ నెల చివర్లో హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే కోసం అంచనాలు పెరుగుతున్న కొద్దీ, పోచంపల్లి సందర్శన ఒక హైలైట్‌గా ఉండనుంది. దీనితో చేనేత వారసత్వాన్ని, మగ్గం తెలంగాణ కథను ప్రపంచానికి తెలియజేస్తుంది.

## ఎండబెట్టిన మొక్కజొన్న అగ్నికి ఆహుతి

### లబోదిబోమంటున్న అన్నదాతలు

వరంగల్ : వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మొగిలిచర్లలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎండబెట్టిన మక్క పంట అగ్నికి ఆహుతయ్యింది. గీసుకొండ నుంచి మొగిలిచెర్లకు వెళ్లే రహదారిపై విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో ఉన్న సుమారు 30 ఎకరాల మొక్కజొన్న చేను ఉంది. ఇటీవల రైతులు చేలల్లోని మొక్కజొన్న కంకులను ప్రధాన రహదారిపై ఎండలో ఆరబెట్టారు. రహదారిపై రైతులు 30 ఎకరాలకు సంబంధించిన మొక్కజొన్న కంకులను ఎండలో ఆరబెట్టారు. రాత్రి ఓ రైతు చేనులో మొక్కజొన్న చొప్పను కాల్చేందుకు నిప్పుపెట్టగా.. ప్రమాదవశాత్తు అది దావానలంలా వ్యాపించింది. కొన్ని క్షణాల్లోనే పక్కనే ఉన్న చేలకు మంటలు అంటు-కుని తీవ్రరూపం దాల్చాయి. భారీగా ఎగిసిపడిన అగ్నికీలలను ఆర్పేందుకు స్థానికులు యత్నించినా.. మంటలు అదుపులోకి రాలేదు. దీంతో వరంగల్ నుంచి రెండు ఫైరింజిన్లను రప్పించి మంటలను అదుపు చేశారు. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# సంపాదకీయం

## సమగ్ర పంటల బీమాపై ఆలోచన చేయండి !

అకాల వర్షాలు మరోమారు తెలుగు రాష్ట్రాల రైతులను దెబ్బతీసాయి. పంటచేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బతినడంతో పంటలు నేలకొరిగాయి. రైతులు పెట్టిన పెట్టుబడులు రాక..అప్పుల్లో కూరుకు పోతున్నారు. ఏలా ఇది జరుగుతున్న తంతే. వరి, బొప్పాయి, మామిడి, మక్కజొన్న తదితర పంటలు ఇలా దెబ్బతింటున్నాయి. అన్నదాతల పంటలసాగు జూదంలా మారింది. పంటలు దండిగా పండితే మద్దతు ధరలు ఇవ్వరు. పంటలు చేతికొస్తాయనుకుంటే వడగళ్లకు నేలరాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నష్ట పరిహారం కూడా ప్రహసనంగా మారింది. అధికారులు రావాలి..అంచనాలు వేయాలి...తరవాత అరకొ సాయం అందుతుంది. కొందరికి అదికూడా అందదు. ఇంతటి దౌర్భాగ్యంలో రైతులు ఉన్నా..ఊరడించే పాలకులు సకాలంలో సాయం చేసే చర్యలు తీసుకోరు. నిజానికి సమగ్ర పంటలబీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలి. ప్రీమియం ప్రబుత్వాలే కట్టుకుంటే..రైతులకు పంటనష్టపోయినప్పుడు నూటికనూరు శాతం నష్ట పరిహారం వచ్చేలా చేయాలి. అప్పుడు అన్నదాత నిశ్చితంగా పంటలు సాగుచేస్తారు. సమగ్ర పంటల బీమాతో రైతులను ఆదుకునేలా ప్రణాళికలను అత్యవసరంగా సిద్దం చేయాల్సి ఉంది. మనిషికి, పశు వులకు, వాహనాలకు, ఇళ్లకు బీమా చేస్తున్న పద్దతిలోనే పంటల బీమాకు కూడా ప్రణాళిక చేయాల్సి ఉంది. ఇకపోతే ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించి.. వారంతా ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహిం చడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని రావడం, దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించడం వల్ల ఒక్కో రైతు కనీసం వందమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు. దీంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతులకు అవకాశాలు పెరుగతాయి. విదేశీ మారక నిల్వలను సాధించవచ్చు. ఈ సూత్రాన్ని గతంలో ఉన్న ఏ ప్రభుత్వం పాటించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా పాటించడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన మోడీ వారి పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. కేవలం విదేశీ పెట్టుబడులే సర్వస్వం అన్న విధంగా నేతలంతా ఆయా దేశాల ముందు మోకరిల్లుతున్నాయి. కానీ ఏనాడు రైతులకు ఒక్క పైసా విదిల్చడం లేదు. గిట్టుబాటు ధరలు, పంటలకు బీమా తదితర అంశాలను పట్టించుకోవడం లేదు. రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం కదలడం లేదు. పంటల బీమా విధిగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటే రైతులను ఆదుకున్న వారు అవుతారు. ఇందుకు జాతీయ స్థాయిలో సమగ్ర బీమా పథకం అమలు చేయాలి. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన సందర్భాల్లో బీమా వర్తించేలా చూడాలి. పంటనష్ట పోయిన రైతులు ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా లేదా..బిచ్చమెత్తుకునే ఉండే పరిస్థితులు పోవాలి. బీమా సొమ్ము దర్జాగా రాబట్టుకునేలా చట్టాలు రావాలి. అప్పుడే అన్నదాత కంటినిండా నిద్రపోగలడు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్దిపై వారికి సమాచారం ఉండడం లేదు. అకాల వర్షాలు, వడగళ్లు, తుఫాన్లు సంభవిస్తే జరిగే నష్టాలను పొందేలా సమగ్ర బీమా పథకం రూపొందించాల్సిన బాధ్యత కేంద్రానిది. కానీ ఇలా చేయలేకపోతున్నారు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు, విలయం సంభవించి నప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో కనీసం ఇందులో పది శాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్రస్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేరవేయక పోవడంతోనే బీమాకు దూరమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఎప్పుడు ఎలా చెల్లించాలో గ్రామాల వారిగా వ్యవసాయాధికారులు దండోరా వేసి రైతుల దృష్టికి తీసుకుని రావాలి. బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్‌కు గ్రామం యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం యూనిట్‌గా పంట బీమా అమలు చేయాల్సి ఉంది. దీనికితోడు టమాట, మామిడి పంటలకు కూడా వాతావరణ బీమాను ప్రకటించడం వల్ల రైతులకు ఊరట కలగనుంది. పంటల వారీగా ప్రీమియం ధరలు, చెల్లించాల్సిన గడువు తేదీల వివరాలతో కూడిన మార్గదర్శ కాలను ప్రభుత్వం విడుదల చేయడంతో పాటు రైతులకు తెలియచేయాలి. ఎన్ని హెక్టార్లలో ఏ విధమైన పంటలను రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయాలి. ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందన్నది సీజన్‌కు ముందే కానుంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్క జొన్న, వేరుశనగ, శనగ పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. పంటరుణం తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు కూడా బీమా పథకాలను వినియోగించుకోవచ్చు. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు. ఇవన్నీ గ్రామస్థాయిలో ప్రచారం జరగాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది.

మిర్చి,పత్తి,శనగ తదితర రైతులు నష్టం సంభవించి నప్పుడు ఏ విధంగా పరిహారం పొందవచ్చో గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. విదేశీ పారిశ్రామిక వేత్తలను కాళ్లావేళ్లాపడుతూ వారి ప్రాపకం కోసం పాకులాడే రోజులు పోయేలా రైతులు స్వయం సమృద్ధి సాధించాలి. అప్పుడే దేశంలో రైతులకు భరోసా దక్కుతుంది. దీనిని అత్యవసర విషయంగా గుర్తించి రాష్ట్రాలు కూడా ప్రణాళికలు సిద్దం చేసి కేంద్రంతో చర్చిస్తే మంచిది.

# కర్రెగుట్టల 'అంచున' యుద్ధమా.. శాంతా?



దేశంలో మావోయిస్టులకు ప్రభుత్వాలకు మధ్య దశాబ్దాలుగా సాగుతున్న ఘర్షణ ఇటీవల ఒక కొత్త మలుపు తిరిగింది. ఈ మలుపు 2014లో కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా, అమిత్ షా హోం మంత్రిగా పరిపాలన ప్రారంభించిన దగ్గర నుంచే చూస్తున్నాం. ఇందుకు తాజా ఉదాహరణగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పరిధిలోని కర్రెగుట్టల ప్రాంతంలో కేంద్ర బలగాలు పొరుగు రాష్ట్రమైన చత్తీస్‌గఢ్ పోలీసుల సహకారంతో సాగిస్తున్న వేటను చెప్పుకోవచ్చు. దాదాపు రెండు వారాలుగా కర్రెగుట్టల ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్ (అంచున) సాగుతూ ఉన్నది. భౌగోళికంగా చూసినట్టయితే కర్రెగుట్టలు చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్నాయి. ఇక్కడ వరుసగా దాదాపు 20 నుండి 30 వరకు గుట్టలున్నట్టు అంచనా. ఈ గుట్టల మీద మావోయిస్టులు కొన్ని దశాబ్దాలుగా గుహలు, సొరంగాలు ఏర్పరచుకొని బలమైన షెల్టర్లుగా వాడుకుంటున్నారు. ఈ ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున బాంబులు ప్రయోగించడం, డ్రోన్లు ఉపయోగించడం ఇతరత్రా సాంకేతికంగా, ఆధునికంగా చేతికందిన అన్ని మార్గాలనూ కేంద్ర బలగాలు ఉపయోగిస్తున్నాయి. ఒక విశేషమేమిటంటే కర్రెగుట్టల చుట్టూ ఉన్న తెలంగాణ ప్రాంతంలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వైపు గాని, అటు చత్తీస్‌గఢ్ ప్రాంతంలోని సుకుమా, బీజాపూర్ జిల్లాల వైపు గాని దరిదాపుల్లోకి కూడా కేంద్ర బలగాలు మీడియాను అనుమతించకపోవడంతో మీడియా పెద్ద ఎత్తున తనకు తోచిన కథనాలు రాయడం, ప్రసారం చేయడం వల్ల తీవ్ర గందరగోళం ఏర్పడింది. జరుగుతున్నది ప్రత్యక్షంగా చూసే వీలు లేని కారణంగా సత్యాలు రాసే, ప్రసారం చేసే అవకాశం లేకపోవడంతో బాటు, మావోయిస్టు పార్టీ పేరిట ఎవరో విడుదల చేసిన నకిలీ పత్రికా ప్రకటన ప్రచారం, ప్రసారం చేసి ప్రజలకు అసత్యం అందించి మీడియా నాలుక కరుచుకునే పరిస్థితి. ఎన్నో ఏళ్ళుగా తమకు రహస్య స్థావరాలుగా ఉన్న కర్రెగుట్టల మీద తాము ఉన్నామనే అర్థం వొచ్చే విధంగా పత్రికా ప్రకటన ఇచ్చి దాని ఉనికి మావోయిస్టు పార్టీ ఎందుకు బహిర్గతం చేసుకుంటుంది అన్న ఆలోచన మీడియా వారికి రాకపోవడం ఆశ్చర్యం. తరువాత ఒకటి రెండు రోజుల్లోనే మావోయిస్టు పార్టీ ఆ ప్రకటన తాము విడుదల చెయ్యలేదనీ, అది పోలీసులు సృష్టించిన నకిలీ ప్రకటన అని స్పష్టం కూడా చేసింది. ఇది మీడియా దృష్టికి పెద్దగా వచ్చినట్టు లేదు. ఒకటి రెండు మినహాయింపులు ఉంటే ఉండొచ్చు. కర్రెగుట్టల మీద కేంద్ర బలగాలు జరిపిన ఈ ఆపరేషన్ కగార్‌లో ముగ్గురు మహిళలు చనిపోయారు. వాళ్ళు మావోయిస్టు పార్టీకి చెందినవారని పోలీసులు, కాదు అమాయక ఆదివాసీ మహిళలని మావోయిస్టులు అంటున్నారు. దాదాపు పది రోజుల తర్వాత కేంద్ర బలగాలు కర్రెగుట్టల మీద జాతీయ జెండా ఎగరేసి ఏదో శత్రురాజ్యం మీద యుద్ధం గెలిచి అక్కడి మన భూభాగాన్ని ఆక్రమించుకున్నట్టుగా హడావిడి చేసాయి. కర్రెగుట్టలు కేంద్ర బలగాల స్వాధీనం కావడం మామూలు విషయమేమీ కాదు. చాలా కాలంగా అవి మావోయిస్టులకు పెద్ద ఎత్తున ఆశ్రయంగా ఉపయోగపడుతూ వచ్చినవి అనే విషయం ఇంతకు ముందే మాట్లాడుకున్నాం. అయితే కర్రెగుట్టలను స్వాధీనం చేసుకున్నంత మాత్రాన అయిపోలేదు. దాని వరుస వెంబడే 20 నుండి 30 వరకు గుట్టలు ఉన్నాయని చెప్తున్నారు. ఎక్కడెక్కడ ఏమున్నాయో రాష్ట్రాల పోలీసు బలగాలకే తెలియని స్థితి. కర్రెగుట్ట, దుర్గం గుట్ట, దోబికొండ, నీలం సారాయి వంటి కొన్ని గుట్టలను ఇప్పటికైతే గుర్తించారు. మొత్తం అన్నిటినీ గుర్తించి పర్యవేక్షించడానికి, మావోయిస్టుల ఆచూకీ తెలుసుకోవడానికి సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంప్ ఒకటి కర్రెగుట్టల దగ్గర ఏర్పాటు చేశారు. ఇప్పటికే చత్తీస్‌గఢ్ ప్రాంతంలో భారీ ఎత్తున ప్రాణనష్టం చూసిన మావోయిస్టుల కదలికలు కేంద్ర ప్రభుత్వ ఈ చర్యతో ఇబ్బందికరంగా మారతాయనడంలో సందేహం లేదు. వేరు వేరు పేర్లతో అయినా దేశంలో కొన్ని రాష్ట్రాల్లో, అందునా దక్షిణాదిన నక్సలైట్ ఉద్యమం అర్ధశతాబ్దంగా ఆటుపోట్లను తట్టుకుంటూ, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సాగిన క్రమంలో ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం గతంలో ఎప్పుడు రాష్ట్రాల శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యగానే చూస్తూ ఉండేది. నక్సలైట్ ఉద్యమం బలంగా ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తరచూ కేంద్రానికి నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కోవడం కోసం, దాన్ని అణిచివేయడం కోసం అదనపు బలగాలు కావాలని, అదనపు నిధులు కేటాయించాలని పలుమార్లు విజ్ఞప్తులు చేయడం చూసాం. కేంద్ర ప్రభుత్వం, అది ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఈ విజ్ఞప్తిని పెద్దగా పట్టించుకున్న దాఖలాలు చాలా కాలం లేవు. చాలా కొద్ది సందర్భాల్లో కేంద్రం ఈ విజ్ఞప్తుల్ని అరకొరగా అంగీకరించి సాయం చేసిన విషయం కూడా తెలిసిందే. గత పది పదకొండు సంవత్సరాల కాలంలో మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల మీద యుద్ధం ప్రకటించింది. ఈ మాటే ఎందుకనాల్సి వస్తున్నదంటే సాక్షాత్తు కేంద్ర హోం మంత్రి అమిత్ షా పలుమార్లు లోక్‌సభ వేదికగా ఫలానా తేదీలోగా నక్సలైట్ ఉద్యమాన్ని తుదముట్టిస్తామని ప్రకటనలు చేశారు. తాజాగా ఆయన ఇటీవలే లోక్‌సభలో 2026 మార్చి నెల నాటికి మొత్తం నక్సలైట్ ఉద్యమం తుడిచిపెట్టుకుపోతుందని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే ఆపరేషన్ కగార్ పేరిట నక్సలైట్ ఉద్యమాన్ని అంతమొందించేందుకు రాష్ట్రాల ప్రమేయం లేకుండా కేంద్ర బలగాలని దింపి దాడులకు ఉపక్రమించింది. ప్రధానంగా మావోయిస్టు ఉద్యమం బలంగా ఉన్న చత్తీస్‌గఢ్, దానికి ఆనుకొని ఉన్న తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో కేంద్ర బలగాలు విస్తృతంగా దాడులు జరిపి అనేక మందిని తుద ముట్టించాయి. అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం 2025 మొదటి మూడు మాసాల్లోనే 140 మందికి పైగా మావోయిస్టులు చత్తీస్‌గఢ్‌లోనే భద్రతా దళాల చేతుల్లో హతమయ్యారు. వీరందరూ మావోయిస్టులని కేంద్ర ప్రభుత్వం లేదు ఇందులో అమాయకపు ఆదివాసీలు కూడా ఉన్నారని మావోయిస్టు ఉద్యమం వాదిస్తున్నాయి. అయితే ఇందులో మావోయిస్టు ముఖ్యులు కూడా కొందరు మరణించారు. 2024లో అయితే మొత్తం 235 మంది మరణించారు. కొన్ని సందర్భాలలో కేంద్ర భద్రత బలగాలకు సంబంధించిన వారు కూడా మావోయిస్టుల దాడిలో చనిపోయారు. ఇదిలా ఉంటే కర్రెగుట్టలలో కగార్ మొదలుకాక ముందే మావోయిస్టులు ప్రభుత్వంతో చర్చలకు రావడానికి తాము సిద్ధంగా ఉన్నామని ముందుకొచ్చారు. బహుశా చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్ మరణాల కారణంగా కూడా మావోయిస్టు పార్టీ ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చు. అయితే ఈ ఆపరేషన్ అంతా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో లేదు. కేంద్ర ప్రభుత్వమే నేరుగా చూస్తున్నందున రాష్ట్రాలు అశక్తంగా ఉండటం, మహా అయితే హింస ఆపండి, చర్చలు జరపండి అని కోరగలవు. కర్రెగుట్టలు తెలంగాణ భూభాగంలో ఉన్నా తెలంగాణ ప్రభుత్వం ప్రమేయం గానీ, ఈ రాష్ట్ర పోలీసుల భాగస్వామ్యం గానీ లేకుండానే ఆపరేషన్ కగార్ సాగిపోతున్నది. అసలు సమాచారం అయినా ఇచ్చారా అన్నది అనుమానమే.

## కుటుంబాన్ని కడతేర్చిన కలహాలు

### ఇద్దరు పిల్లలకు ఉరేసి..తండ్రి ఆత్మహత్య

సంగారెడ్డి : క్షణికావేశం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. కలహాల కారణంగా కుటుంబాలు విఛ్చిన్నమవుతున్నాయి. జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోతున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలకు ఉరి వేసి తాను ఉరివేసుకుని తండ్రి సుభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇంటి ఓనర్ కి స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకుని డోర్ పగలగొట్టి చూడగా కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాలు లభ్యమయ్యాయి. భార్య మంజు(35) కి వేరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతో గత కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగు తున్నాయని అరోపణపలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో పిల్లలతో కలిసి సుభాష్(40) ఉంటున్నాడు. మానసిక వేదనకు గురైన సుభాష్ చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. కుమారుడు రిథిక్ మర్యాన్(09), కుమార్తె ఆరా(05)కి ఉరివేసి...అనంతరం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డు. ముగ్గురి మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


## ఎండల తీవ్రతతో తగ్గిన కూరగాయల సాగు

### కూరగాయల ధరల్లో పెరుగుదల



హైదరాబాద్ : మార్కెట్లలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీనికితోడు దిగుబడులు కూడా తగ్గాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.. అకాల వర్షాల వల్ల కూరగాయల దిగుబడి తగ్గింది. రూ.100కు రెండు, మూడు కూరగాయలు కూడా రావడం లేదు. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. అకాల వర్షాలతో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో నగరానికి రావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు. బీర కిలో రూ.80కి పెరిగిపోయింది. అది రిటేల్ మార్కెట్లో వంద వరకు అమ్ముతున్నారు. అంటే రెట్టింపుయింది. బెండ కిలో రూ.రూ.60కి పెరిగింది. అది రిటేల్‌లో 20కి పావు కిలో అమ్ముతున్నారు. అన్ని కూరగాయల ధరలుదాదాపు రెండు రెట్లు పెరిగింది. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో అకాల వర్షాలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్‌కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు.

## మంచివారితోనే స్నేహం మంచిది !



ఆధ్యాత్మికం

తిరుమల : మంచి వ్యక్తులతో స్నేహం... ఎప్పుడూ సత్యమే పలికేలా చేస్తుంది. బుద్ధి మాంద్యాన్ని తొలగిస్తుంది. జ్ఞానాన్ని పెంచుతుంది. సమాజంలో గౌరవాన్ని కలిగిస్తుంది. కల్మషాలను పోగొడుతుంది. మనసును నిర్మలంగా ఉంచుతుంది. పేరు ప్రతిష్ఠలు పెరిగేలా చేస్తుంది. మనోవికాసాన్ని కలిగిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే... సజ్జనులైన వారి సాంగత్యం సకలార్థ సాధనం అని పెద్దలు చెబుతారు. అలా ప్రతి ఒక్కరిని ప్రేమించగలగాలి. ప్రేమ అంటే ఇరువురు స్త్రీ పురుషుల మధ్య ఉండేదేనా, ఉద్భవించేదేనా? కాదు. ప్రేమకు పరిమితి లేదు. హద్దుల్లేవు. గోడలు, పై కప్పు, తలుపులు, తాళాలు... ఏమీ లేవు. స్వేచ్ఛగా, ఎప్పటికీ రెక్కలు తెగని పక్షిలా దిగంతాలకు, అనంతాలకు ఎగిరిపోయే ఒక అమృత కెరటం. అయితే అది అపురూపమైనదే గానీ ఎవరికీ అందుబాటులోకి రానిది మాత్రం కాదు. దాన్ని అందరూ అనుభవించవచ్చు. అనుభూతించవచ్చు. అదే దాని ప్రత్యేకత. నిజానికి ఈ లోకం ఇంత సజావుగా నడుస్తోందంటే దానికి కారణం, మూలం... ప్రేమే. ప్రేమ... భగవంతుడి ప్రతిరూపమే. ఆయన కల్యాణ గుణమేఇంత అద్భుతమైన ప్రేమను నిత్యజీవితంలో అనుభవిస్తున్న లోకం ఎంతో ఆనందంలో ఓలలాడాలి కదా... మరి ఈ దుఃఖం ఏమిటి, ఈ విషాదం ఏమిటి? మనుషుల్లోని స్వార్థం, మూర్ఖత్వం, దురాశ... ఈ దుర్గుణాలవల్ల వంచనకు గురవుతున్నామన్న సత్యం అమాయకులమైన మనకర్థం కాదు. అర్థమయ్యేసరికి మన జీవితమే ముగిసిపోతుంది.

# ప్రజావాణీలో 12 దరఖాస్తులు

## - కాటారం తహశీల్దార్ ఏ. నాగరాజు



**కాటారం, 05 (హైదరాబాద్ న్యూస్):** కాటారం మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మండలాల నుంచి వచ్చిన 12 పిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారులతోమర్యాదపూర్వకంగాఉంటూవారిసమస్యలను ఓపికతో విని పరిశీలిస్తామని తహశీల్దార్ ఏ. నాగరాజు తెలిపారు. దరఖాస్తులు వచ్చిన వాటిలో 12 దరఖాస్తులు రెవెన్యూకు సంబంధించినవని, పేర్కొన్నారు. కాటారం ఎంపిడిఓ అడ్డూరి బాబు, ఎంపీ ఓ పిల్లి వీరస్వామి మరియు ఆయా శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా దివాస్ కార్యక్రమంలో 16 పిర్యాదులు

## - బాధితుల ఫిర్యాదులపై పోలీస్ సిబ్బంది తక్షణమే స్పందించాలి
## - జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే



**జయశంకర్ భూపాలపల్లి, ప్రతినిధి (హైదరాబాద్ న్యూస్): మే 05:** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివాస్ కార్యక్రమంలో బాగంగా ఎస్పీ వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితుల నుంచి 16 పిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని పరిష్కరిం చాలన్నారు. డ్రగ్స్,మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాధితుల సమస్యలు సత్వరంగా పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు,

## ఈ రెండు విటమిన్లు లోపిస్తే క్యాన్సర్ ముప్పు తప్పదు..

# ఆ మార్పులను తేలికగా తీసుకోవద్దు!

క్యాన్సర్ అత్యంత ప్రాణాంతక వ్యాధి. అయితే, చికిత్సలు, మందులతో క్యాన్సర్ ఆటకట్టించొచ్చు. కానీ చికిత్స ఆలస్యమైతే రోగిని రక్షించడం కష్టం. అంతేకాకుండా క్యాన్సర్ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నది అందువల్లనే క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధిగా నేటికీ పరిగణిస్తుంటారు. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్సలు, మందులు ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ చికిత్స ఆలస్యమైతే, రోగిని రక్షించడం కష్టం. ముఖ్యంగా శరీరంలో మూడు విటమిన్లు లోపిస్తే క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. శరీరంలోని ఏ భాగంలోనైనా క్యాన్సర్ రావచ్చు. జన్యుపరమైన కారకాలు, విటమిన్లు, ఖనిజాల లోపం వల్ల కూడా క్యాన్సర్ వస్తుంది. శరీరంలో విటమిన్ సి లోపం క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. విటమిన్ సిని ఆస్కార్బిక్ ఆమ్లం అని కూడా పిలుస్తారు. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో పాటు విటమిన్ 'సి' కొల్లాజెన్ సంశ్లేషణ, గాయాల నయం, వ్యాధుల నివారణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపం వల్ల అన్నవాహిక, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచుతుంది.రోగనిరోధక శక్తిని పెంచడానికి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి విటమిన్-సి అధికంగా ఉండే ఆహారాలు (పాలు, పాల ఉత్పత్తులు, నిమ్మకాయలు, టమోటాలు, క్యారెట్లు, చింతపండు మొదలైన సిట్రస్ పండ్లు) తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. విటమిన్ సితోపాటు విటమిన్ ఎ కూడా క్యాన్సర్‌తో సంబంధం కలిగి ఉంటుంది. ఇది కంటి చూపుతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో, జన్యు నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. విటమిన్ ఎ లోపం ఊపిరితిత్తులు, అన్నవాహిక, కడుపు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. క్యారెట్, గుమ్మడికాయ, పండిన బొప్పాయి, పాలకూర, నెయ్యి, వెన్న, కొవ్వు చేపలు, మాంసం, గుడ్లు వంటి వివిధ కూరగాయలలో విటమిన్ ఎ అధిక స్థాయిలో ఉంటుంది. కాబట్టి ఈ ఆహారాలను డైట్‌లో ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు విటమిన్ డి ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. సాధారణంగా విటమిన్ ఎ సూర్యకాంతి నుండి లభిస్తుంది. విటమిన్ డి లోపం వల్ల రొమ్ము, ప్రోస్టేట్, కొలొరెక్టల్, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ విటమిన్ లోపాన్ని భర్తీ చేయడానికి సూర్యరశ్మి తగిలేలా ఉండాలి. గుడ్డు సొనలు, సముద్రపు చేపలు, పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవాలి.

# ఇప్పటి మీరు ప్లాస్టిక్ బాటిళ్లలోనే నీళ్లు తాగుతున్నారా..?

## మీ ఆరోగ్యం అంతే సంగతి.. తస్మాత్ జాగ్రత్త..

క్యాన్సర్ వచ్చే ప్రమాదం: ప్లాస్టిక్‌ను అధికంగా ఉపయోగించడం వల్ల శరీరం దానిలోని రసాయనాలతో ప్రత్యక్ష సంబంధంలోకి వస్తుంది. దీని కారణంగా మన శరీరం అనేక వ్యాధులకు రిజర్వాయర్‌గా మారుతుంది. ప్లాస్టిక్‌లోని సీసం, కాడ్మియం, మెర్క్యురీ వంటి రసాయనాలు శరీరంలో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి విడుదలయ్యే రసాయనాలు మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇది మన రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రోజుల తరబడి ప్లాస్టిక్ బాటిల్స్ లో నీరు తాగుతూ ఉంటే మనిషిలోని రోగనిరోధక శక్తి సన్నగిల్లే ప్రమాదం ఉంది. కాలేయ క్యాన్సర్: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల థాలేట్స్ అనే రసాయనాలు మన శరీరంలోకి చేరి కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. అసలే ఇది వేసవి కాలం.. ప్లాస్టిక్ బాటిల్స్ పై ఎండ పడితే అవి మైక్రోప్లాస్టిక్ ను విడుదల చేస్తాయి. ఆ నీరు తాగితే హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. అండాశయ క్యాన్సర్: ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల ప్లాస్టిక్‌లోని రసాయనాల వల్ల మహిళల్లో అండాశయ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ బాటిల్‌కు ఎండ తగిలితే..డయాక్సిన్ లాంటి విషపదార్థాలు నీటిలో కలుస్తాయి. ఆ నీరు తాగడం వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా పొంచివుంది. ప్లాస్టిక్ బాటిల్‌తో ఇన్ని అనార్థలను ఎదుర్కొకక తప్పదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయంగా రాగి బాటిల్స్,ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న స్టీల్, మట్టి, వెదురు బాటిల్స్ వంటివి వాడితే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. తప్పనిసరిగా ప్లాస్టిక్ బాటిళ్లు ఉపయోగించుకోవాల్సి వస్తే ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్?ను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# 15 నుండి 26 వరకు సరస్వతి పుష్కరాలు..

## ◆ 10 వరకు పనులు పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



**జయశంకర్ భూపాలపల్లి, ప్రతినిధి (హైదరాబాద్ న్యూస్): మే 05:** సరస్వతి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు కాళేశ్వరం లో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగు తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం కాళేశ్వరంలో విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం ఏర్పాటు, శాశ్వత మరియు తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మాణం, టెంట్ సిటీ, ఫుడ్ కోర్టు, ఎగ్జిబిషన్, స్టాళ్లు ఏర్పాటు పనులను అధికారులతో కలిసి ఆయన పనులను పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ నుండి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పనకు చేపట్టిన పనులు ఈ నెల 10 వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రేపటి నుండి సరస్వతి తల్లి విగ్రహం ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. విఐపి ఘాట్ వద్ద తోరణ నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. సరస్వతీ ఘాట్, గోదావరి ఘాట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. టెంట్ సిటీ, ఫుడ్ కోర్టు, ఎగ్జిబిషన్, స్టాళ్లు ఏర్పాటు పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. మంచినీరు, భక్తులు బట్టలు మార్చు గదులు, గోదావరి హారతి పనులు టైం లో పూర్తి చేయాలని ఆదేశించారు. తాత్కాలిక రహదారి నిర్మాణం జరుగుతుందని, నీళ్లు, బుల్డోజర్ ద్వారా చదును చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పీఆర్, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్, దేవాదాయ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, డిపిఓ వీరభద్రయ్య, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ఆర్టీసీ డిఎం ఇందు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, దేవాలయ ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు,



# టీబీ రోగుల్లో కనిపించని దగ్గు లక్షణం.. ఆందోళ చెందుతోన్న వైద్య నిపుణులు! ఎందుకంటే..

భారత్‌తోసహా ప్రపంచవ్యాప్తంగా ప్రతీయేట క్షయవ్యాధి కేసులు గణనీయంగా నమోదవుతున్నాయి. మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి చాలా సందర్భాలలో ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. అయితే కొంతమందికి కిడ్నీ, మెదడు, వెన్నెముకలో కూడా వ్యాధి వస్తుంది. అత్యంత సాధారణ లక్షణం నిరంతర దగ్గు. అందుకే మూడు వారాల పాటు దగ్గు ఉంటే టీబీ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు కూడా సూచిస్తుంటారు. అయితే దగ్గు రాకపోయినా ఒక వ్యక్తి టీబీ బారిన పడతాడా? అనే సందేహం మీకు కలిగి ఉంటుంది. దీని గురించి వైద్య నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ తెలుసుకుందాం.. చాలా మంది టీబీ రోగుల్లో దగ్గు వంటి లక్షణాలు కనిపించవని తాజా పరిశోధనలో వెల్లడైంది. ది లాన్సెట్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్‌లో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం.. ఆసియాలో తో బాధపడుతున్న వారిలో 80 శాతం మందిలో దగ్గు లక్షణాలు లేవని పేర్కొంది. శాస్త్రవేత్తల బృందం నిర్వహించిన ఈ అధ్యయనంలో చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే టిబి రోగులలో నిరంతర దగ్గు వంటి లక్షణాలు చాలా అరుదుగా కనిపిస్తాయట నిజానికి, టీబీ రోగుల్లో దగ్గు లక్షణాలు లేకపోవడం ఆందోళన కలిగించే అంశం అని పరిశోధకులు అంటున్నారు. దగ్గు వంటి ప్రధాన లక్షణాలు రోగులలో ఎందుకు కనిపించవు అనే విషయంపై పరిశోధకులు మరింత కృషి చేయాలని నిపుణులు అంటున్నారు. లేడీ హార్డింజ్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగంలో హెచ్‌ఓడి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌హెచ్ ఘోటేకర్ మాట్లాడుతూ.. టీబీ రోగులలో నిరంతర దగ్గు చాలా ముఖ్యమైన లక్షణం. ఇక వేళ రోగిలో దగ్గు కనిపించకపోతే టీబీ వ్యాధిని సకాలంలో గుర్తించడంలో బాధితులు విఫలం అవుతారు. బాధితుల్లో దగ్గు లక్షణాలు కనిపించకపోవడం అనే విషయంపై పరిశోధకులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ లక్షణాలు కనిపించకపోతే టీబీని గుర్తించడంలో మరింత జాప్యం జరుగుతుంది.



దీనివల్ల వ్యాధి తీవ్రత పెరుగుతూనే ఉంటుంది. ఫలితంగా ఇతర అవయవాలకు కూడా టీబీ వ్యాపించే ప్రమాదం ఉంది. ఇది మరణానికి దారి తీసే అవకాశం ఉంది. అటువంటి పరిస్థితుల్లో ఇతర లక్షణాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం చాలా అవసరం. దగ్గు కాకుండా టీబీ వ్యాధిగ్రస్తుల్లో కనిపించే ఇతర ఈ లక్షణాలు ఏవంటే.. టీబీ ప్రధాన లక్షణాలు ఏవంటే.. బరువు వేగంగా తగ్గిపోవడం, రాత్రి వేళల్లో చెమటలు, ఎప్పుడూ అలసిపోతూ ఉండటం, ఛాతి నొప్పి శ్లేష్మం, రక్తంతో దగ్గు

# క్యాన్సర్ నుంచి కోలుకున్న తర్వాత మళ్లీ మళ్లీ ఎందుకు తిరగబెడుతోంది..? దీనిని అడ్డుకోలేమా..

క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. ఈ వ్యాధి శరీరాన్ని గుల్ల చేస్తుంది. చికిత్స కూడా అదే స్థాయిలో తీవ్ర వేధనకు గురి చేస్తుంది. అయితే రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్.. వంటి సందర్భాల్లో చికిత్స విజయవంతంగా పూర్తైన తర్వాత.. పూర్తిగా కోలుకుంటారు. కానీ 25 ఏళ్లు, 30 ఏళ్ల తర్వాత మళ్లీ క్యాన్సర్ బయటపడుతుంది. ఇలాంటి వారి జీవితాల్లో క్యాన్సర్ మరోసారి విధ్వంసం సృష్టించింది. దీంతో క్యాన్సర్ చికిత్స తర్వాత, ఈ వ్యాధి మళ్లీ మళ్లీ ఎందుకు పునరావృతమవుతుంది? అనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా, గత కొన్ని దశాబ్దాలుగా క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గతంతో పోల్చితే ఈ వ్యాధి గురించి ప్రజలు ప్రస్తుతం మరింత అవగాహనతో ఉన్నారు. అందువల్ల సకాలంలో రెగ్యులర్ చెకప్‌ల కారణంగా ఎక్కువ కేసులు గుర్తించి చికిత్స తీసుకుంటున్నారు. చాలా మంది క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించ గలుగుతున్నారు. చికిత్స చేయించుకున్న తర్వాత ప్రజలు క్యాన్సర్ నుంచి విముక్తి పొందుతున్నారు. అయితే ఒకసారి క్యాన్సర్ నయమైన తర్వాత, అది ఇతర అవయవాలలో అభివృద్ధి చెందడం లేదంటే అదే భాగంలో తిరిగి విజృంభించడం వంటివి ఎందుకు జరుగుతాయో.. అందుకు కారణం ఏమోటో ఇక్కడ తెలుసుకుందాం.. నిపుణులు ఏమంటారు? క్యాన్సర్ వెనుక కారణం కణాల అనియంత్రిత పెరుగుదల. దీని వెనుక మన అనారోగ్య జీవనశైలి, అధిక ధూమపానం, ఇతర కారణాలు ఉన్నాయి. కానీ చాలా సందర్భాలలో క్యాన్సర్ నయమైతే, అది శరీరంలోని ఇతర భాగాలలో మళ్లీ సంభవిస్తుందని డాక్టర్ అజయ్ కుమార్ చెబుతున్నారు. క్యాన్సర్ మళ్లీ ఎందుకు వస్తుంది? క్యాన్సర్ అనేది ఒక ప్రమాదకరమైన వ్యాధి. ఇది చాలా సందర్భాలలో నయమైన తర్వాత మళ్లీ వస్తుంది. నేడు, క్యాన్సర్ చికిత్సకు అనేక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇవి క్యాన్సర్‌ను నయం చేస్తాయి. అయితే క్యాన్సర్ పునరావృతానికి మాత్రం అనేక కారణాలు కారణమవుతాయి. పునరావృతమయ్యే క్యాన్సర్ వెనుక ఉన్న అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం. ఒకసారి నయమైన తర్వాత రోగి మళ్లీ తన పాత అనారోగ్య అలవాట్లను అనుసరించడం ప్రారంభిస్తే క్యాన్సర్ పునరావృతమయ్యే ప్రమాదం పెరుగుతుంది. అధిక ధూమపానం, పొగాకు వినియోగం కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. క్యాన్సర్ నయమైన తర్వాత, మళ్లీ వీటిని తీసుకునే వారికి మళ్లీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. అనేక సందర్భాల్లో, కుటుంబ చరిత్ర కూడా క్యాన్సర్ పునరావృతానికి కారణం అవుతుంది. శరీరంలో క్యాన్సర్ కణాలు మిగిలి ఉండటం వల్ల మళ్లీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కొన్నిసార్లు చికిత్స చేసినప్పటికీ కొన్ని క్యాన్సర్ కణాలు శరీరంలో చురుకుగా ఉండి మళ్లీ క్యాన్సర్‌గా మారుతాయి. ఈ కణాలు శరీరంలోని ఇతర భాగాలలో కూడా అభివృద్ధి చెంది క్యాన్సర్‌కు కారణం అవుతాయి. మహిళల్లో చిన్న వయసులోనే గర్భనిరోధక మాత్రలు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. నేటి కల్తీ యుగంలో, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అనేక అంశాలు ఉన్నాయి. క్యాన్సర్‌ను గుర్తించడానికి స్కాన్ చేసుకోవాలి. క్యాన్సర్ నయమైన తర్వాత, వైద్యులు మొత్తం శరీరాన్ని స్కాన్ చేయకపోతే మళ్లీ క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉండే ప్రమాదం ఉంది.



# ఈ గింజలను ఇలా తింటే పొట్ట తగ్గడం ఖాయం..! బరువు తగ్గి, ఎముకలు బలంగా ఉంటాయ్..!



బరువు తగ్గడానికి చియా గింజల నీరు: బరువు తగ్గడానికి చియా గింజల నీటిని తీసుకోవచ్చు. దీని కోసం ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. ఉదయాన్నే పరగడుపున దీన్ని సేవించండి. ఈ నీటిని రోజూ తీసుకోవడం వల్ల చాలా వరకు బరువు తగ్గవచ్చు. బరువు తగ్గడానికి చియా సీడ్స్ స్మూతీ: బరువు తగ్గడానికి చియా విత్తనాలను స్మూతీస్‌లో ఉపయోగించవచ్చు. దీని కోసం మీకు ఇష్టమైన పండ్లు, పెరుగును వేసి కలపాలి. తర్వాత ఒక చెంచా నానబెట్టిన చియా గింజలను వేసి అన్ని మిక్స్ చేయండి. దీన్ని అల్పాహారంగా తీసుకోవచ్చు. సలాడ్‌లో చియా విత్తనాలను ఉపయోగించండి : బరువు తగ్గడానికి, చియా గింజలను సలాడ్‌లో కలిపి తినవచ్చు. ఇది మీ కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది. దీని కోసం, మీరు సలాడ్లో 1-2 స్పూన్ల చియా విత్తనాలను తినవచ్చు. కావాలనుకుంటే నిమ్మరసం, నల్ల మిరియాలు కూడా చల్లుకోవచ్చు. బరువు తగ్గడానికి చియా సీడ్స్ పుడ్డింగ్: బరువు తగ్గడానికి చియా సీడ్స్ పుడ్డింగ్ ఒక ఆరోగ్యకరమైన ఎంపిక. దీన్ని సిద్ధం చేయడానికి, ఒక టేబుల్ స్పూన్ చియా గింజలను రాత్రంతా పాలలో నానబెట్టండి. ఇందులో పండ్లు, డ్రై ఫ్రూట్స్, నట్స్ వేసి ఉదయాన్నే తీసుకుంటే తినడానికి రుచికరంగా ఉంటుంది మరియు బరువు కూడా తగ్గుతుంది. ఓట్స్, చియా విత్తనాలు: మీరు అల్పాహారంగా ఓట్స్ తింటే, మీరు చియా విత్తనాలను కూడా అందులో కలుపుకోవచ్చు. ఓట్స్‌లో చియా గింజలను వేసుకోవటం వల్ల మీ అల్పాహారం మరింత పోషకమైనదిగా మారుతుంది.ఇదిశరీరంలోని అదనపు కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది.

# అధిక రక్తపోటును ఇలా కూడా గుర్తించవచ్చు..

కానీ పరీక్షల చేయించుకున్న తర్వాత గానీ చాలా మందికి శరీరంలో అధిక రక్తపోటు ఉన్నట్లు అర్థమవుతుంది. నిజానికి మైకము, భయము, చెమట, నిద్రలేమి అధిక రక్తపోటు వంటి ప్రారంభ లక్షణాలు ద్వారా అధిక రక్తపోటును గుర్తించవచ్చంటున్నారు నిపుణులు. కానీ ఈ లక్షణాలు చాలా సాధారణం. వీటి ద్వారా మాత్రమే అధిక రక్తపోటుతో బాధపడుతున్నారా లేదా అని నిర్ధారించడం సాధ్యం కాదు. 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' ప్రకారం.. కళ్లు ఎరుపు రంగులోకి మారడం, కనుగుడ్డుపై ఎర్రటి రక్తపు ఛాయలు కనిపించడాన్ని సబ్‌కంజంక్టివల్ హెమరేజ్ అని పిలుస్తారు. ఇది అధిక రక్తపోటు హెచ్చరిక సంకేతంగా పరిగణిస్తారు. సకాలంలో చికిత్స తీసుకోకపోతే అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. డయాబెటిక్ రోగుల కంటి రంగు కూడా కొన్నిసార్లు ఎరుపు రంగులో ఉంటుంది. ఇవే లక్షణాలు అధిక రక్తపోటు ఉన్న రోగులలో కూడా కనిపిస్తాయి. ఫలితంగా, ఇది రెండు వ్యాధుల సాధారణ లక్షణంగా పరిగణిస్తుంటారు. ముఖం ఎర్రబడటం, ఎరుపు కళ్ళు అధిక రక్తపోటు ప్రారంభ సంకేతాలు. ముఖంలోని రక్తనాళాలు పల్చగా మారినప్పుడు ముఖం ఎర్రబారడం జరుగుతుంది. కాబట్టి మీరు ఈ విషయాలన్నీ గమనించినట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# భూ భారతీ పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సు

- రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్న..
- మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం






**శామీర్ పేట కలెక్టరేట్, మే 05:** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం సూచించారు. సోమవారం భూ భారతీ పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం ధర్మారం గ్రామంలో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. రైతులు అందించిన దరఖాస్తులను, సిబ్బంది పనితీరును పరిశీలన జరిపి, అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ధరణిలో పెండింగ్ ఉన్నవా, లేవా అని ముందుగా అడిగి తెలుసుకుని, ధరణిలో పెండింగ్ లో ఉంటే ధరణి లో ఉన్న నంబరు ఆ ధరఖాస్తు పై వేసి ఆన్ లైన్ లోనే వాటిని పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను సమస్యల వారిగా విడివిడిగా బంచులుగా చేసుకొవాలన్నారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి అప్పటికప్పుడే పరిష్కారం జరిగేలా చూడాలన్నారు.

పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను కీసర మండల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. అనంతరం నర్సంపల్లిలో నిర్వహిస్తున్నరెవెన్యూ సదస్సును కూడా పరిశీలించి కలెక్టరు సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. ఈ సదస్సులలో లా ఆఫీసర్ చంద్రావతి, కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఎంఆర్ఓ అశోక్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు

- మే 5 నుంచి మే 19 వరకు ఎలిగేడు మండలంలో రెవెన్యూ సంస్థల నిర్వహణ
- నిర్ణయిత సమయంలో యువ వికాసం అర్హుల ఎంపిక
- చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- మే 10 వరకు ఇందిరమ్మ ఇండ్ల తుది లబ్ధిదారుల జాబితా ఎంపిక
- ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై పత్రిక సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి మే 05, :** ప్రభుత్వ జారీచేసిన నిబంధనలో ప్రకారం ప్రాధాన్యత కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై పత్రిక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం పై సుల్తానాబాద్ మండలం మినహా అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ధరణి చట్టం, భూ భారతి చట్టం మధ్య వ్యత్యాసాలను స్పష్టంగా రైతులకు వివరించామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపెల్లి జిల్లాలో మే ఐదు నుంచి మే 19 వరకు వెలిగేడు మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ భారతి చట్టం క్రింద భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తులను పూర్తిస్థాయిలో జూన్ 2 వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కోర్టు కేసుల సమస్యలు, కుటుంబ వివాదాల సమస్యలు మినహాయించి మిగిలిన అన్ని రకాల సమస్యలను భూ భారతి చట్టం వినియోగించి పరిష్కరిస్తామని అన్నారు. ప్రతిరోజు రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయో సమగ్ర రికార్డు నిర్వహిస్తున్నామని, ఆర్ఎస్ఆర్, అసైన్మెంట్ సమస్యలు, సాధా బైనామా దరఖాస్తులు, పార్ – బీ సమస్యలు, ఇతర వివిధ రకాల భూ సమస్యలను భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.రాజీవ్ యువ వికాసం పథకం కింద మన జిల్లాలో ఆన్ లైన్ ఆఫ్ లైన్ మొత్తం కలిపి సుమారు 47 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం కొంత మేర సబ్సిడీ, బ్యాంకు బ్యాంకు లింకేజీ కలిపి యువ వికాసం యూనిట్ గ్రౌండ్ చేయాల్సి ఉంటుందని, ఎన్.పి.ఏ ఉన్న దరఖాస్తుదారులు, సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న దరఖాస్తుదారులను, గత ఐదు సంవత్సరాలలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ కార్పొరేషన్ల నుంచి యూనిట్ల పొందిన దరఖాస్తులను ముందుగా మినహాయిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మన దగ్గర పట్టణ ప్రాంతాలలో అధికంగా దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో గా దరఖాస్తుల ధ్రువీకరణ పూర్తి చేస్తామని, రాష్ట్రం నుంచి జిల్లాకు యువ వికాసం నిధుల కేటాయింపు జరగగానే మండలాల వారీగా కేటాయింపులు చేసి అర్హుల తుది జాబితా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తయారు చేస్తామని అన్నారు.గత వాన కాలం ఎటువంటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని, అదేవిధంగా యాసంగి పంట కొనుగోలుకు పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు. యాసంగి పంట సీజన్ లో పెద్దపెల్లి జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 334 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 13 వేల 573 రైతుల నుంచి 240 కోట్ల విలువ చేసే లక్షా 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 154 కోట్ల ధాన్యం డబ్బులు చెల్లించామని కలెక్టర్ తెలిపారు. సన్న రకం ధాన్యం కొనుగోలు లో ఉన్న సమస్యలను పరిష్కరించామని, ఇప్పటివరకు ఐదువేల మెట్రిక్ టన్నుల సన్న రకం దానం కొనుగోలు చేశామని అన్నారు. జిల్లాలో ఎటువంటి డిఫాల్ట్ లేని 105 రైస్ మిల్లులకు ముందుగా ధాన్యం కేటాయింపులు చేశామని , రైస్ మిల్లర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూస్తున్నామని అన్నారు. గత వాన కాలంలో ఒకేరోజు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ప్రస్తుతం రెగ్యులర్ గా 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతుందని, యాసంగి పంటలో ఉత్పత్తి బాగా వచ్చినందున కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం వస్తుందని, నాణ్యత ప్రమాణాలు ఉన్న చివరి గింజ వరకు ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని, అవసరమైన హమాలీలను అదనంగా బీహార్ నుంచి రప్పించామని అన్నారు. అకాల వర్షాలు కురిస్తే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. పెద్దపెల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలలో 1940 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 700 ఇండ్లు గ్రౌండ్ చేసామని, బేస్మెంట్ వరకు పూర్తి చేసుకున్న 150 ఇండ్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ప్రతి సోమవారం ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి ప్రకారం నిధులు విడుదల అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మే 10, 2025 వరకు జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చోప్పున ( పైలెట్ ప్రాజెక్టులో మంజూరు చేసిన మినహాయించి) లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసి అందించిన లబ్ధిదారుల జాబితాను అధికారులు మరోసారి వెరిఫై చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ కమిటీ అందించిన జాబితాలో ఎక్కడైనా అనర్హులు ఉంటే వారిని తొలగించి వారి స్థానంలో అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన దరఖాస్తుల ధ్రువీకరణ తర్వాత జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదంతో మంజూరు పత్రాలు పంపిణీ చేసి గ్రౌండ్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు ఎక్కడైనా అనర్హులకు కేటాయించినట్లు తెలిస్తే వెంటనే వాటిని రద్దు చేసే అధికారం జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం కేటాయించిందని, ఎక్కడైనా ఎవరైనా అనర్హులకు ఇండ్లు మంజూరు అయితే అధికారులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి ప్రభుత్వం అసిస్టెంట్ ఇంజనీరు కేటాయిస్తుందని కలెక్టర్ తెలిపారు.అనంతరం పాత్రికేయులు అడిగిన వివిధ ప్రశ్నలకు సందేహాలకు కలెక్టర్ సమాధానం అందించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రింట్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

# మే 20 లోపు అర్హత పరీక్ష లేకుండా డిప్లొమా కోర్సులో ప్రవేశం కొరకు అనాధ, నిరుపేద బాలికలు దరఖాస్తు చేసుకోవాలి

## - జిల్లా సంక్షేమ అధికారి పి.వేణు గోపాల్ రావు

**పెద్దపల్లి ప్రతినిధి మే 05, :** మే 20 లోపు అర్హత పరీక్ష లేకుండా శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ శిక్షణా సంస్థలో డిప్లొమా కోర్సులో ప్రవేశం కొరకు అనాధ, నిరుపేద బాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పి.వేణు గోపాల్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ శిక్షణా సంస్థ, హైదరాబాద్ నందు పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులకు 2025-2026 విద్యాసంవత్సరానికి గానూ పదవ తరగతి పూర్తి చేసినటువంటి తల్లిదండ్రులు కోల్పోయిన ( అనాథ ) బాలికలు , తల్లి గానీ, తండ్రిని కోల్పోయిన బాలికలు (పాక్షిక అనాధ), నిరుపేద బాలికలకు ఎటువంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని, 3 సంవత్సరాల పాటు డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ ,డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ , డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్ , డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.ఆసక్తి, అర్హత గల బాలికలు కుల, ఆదాయ (అనాథ బాలికలకు అవసరం లేదు ), మరణ దృవీకరణ పత్రములు (అనాథ బాలికలకు మాత్రమే) బోనా ఫైడ్ స్టడీ సర్టిఫికేట్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు ఫారం నకు సంబంధిత దృవపత్రాలను జతచేసి పెద్దపల్లి పట్టణం లోని బాల రక్షా భవన్ కార్యాలయంలో మే 20 వ తేది లోగా దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు 9032427241 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి పి.వేణు గోపాల్ రావు ప్రకటనలో తెలిపారు.

# విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం

## - ఎంఇఓ సీతాలక్ష్మి





**ధర్మపురి, మే 5, :** ధర్మపురి మండల కేంద్రం లో 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతుల శిబిరంను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఇఓ సీతాలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా వారిచే స్థానిక ధర్మపురి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోమండలం లోని 6 నుండి 9 వ తరగతి చదివే విద్యార్థులకు ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపరిచే నేపథ్యంగా మే5 తేదీ నుండి పదిహేను రోజుల పాటు ఉదయం 9 నుండి 11 వరకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంతామణి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించినట్లు ఎం.ఈ.ఓ తెలిపారు. ఇట్టి శిక్షణా కాలంలో పిల్లలకు గణితం, స్పోకెన్ ఇంగ్లీషు, విజ్ఞాన శాస్త్రం, నైతిక, సామాజిక విలువలు, చిత్రలేఖనం మరియు మొదలగు అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని కల్పించడానికి నిష్ణాతులైన, నిపుణులైన ప్రభుత్వ ఉపాధ్యాయుల చే శిక్షణ ఇవ్వబడునని ఎం.ఈ.ఓ తెలిపారు. ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ధర్మపురి మండల పోషకులను ఆమె కోరారు. ఆసక్తిగల విద్యార్థుల పోషకులు శిక్షణ శిబిరం కో ఆర్డినేటర్ రావులపెల్లి శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ గణితం జెడ్పిహెచ్ఎస్ (గర్ల్స్) సెల్ నెం. 9121395356 ని సంప్రదించి పేర్లు నమోదు చేసుకొని తరగతులకు పంపాల్సిందిగా మండల విద్యాధికారిణి ఎస్. సీతాలక్ష్మి తెలిపారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్,మే 5,):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గోదారి తిరుపతి కుమారుడు రాకేష్ గత నెల 29న కరీంనగర్ లో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. ఎంతో భవిష్యత్ కలిగిన రాకేష్ చిన్న వయసులో మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే కవ్వంపల్లి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి రాకేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.తిరుపతి కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.కాంగ్రెస్ మండలాద్యక్షుడు బండారి రమేశ్, మాజీ మండలాధ్యక్షుడు మోరపెల్లి రమణారెడ్డి, నాయకులు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, మామిడి అనిల్ కుమార్, పోలు రాము, రమేశ్, నోముల అనిల్ గౌడ్, గోదారి రాజమల్లు, గోదారి చరణ్ తదితరులు ఎమ్మెల్యే వెంట పరామర్శలో పాల్గొన్నారు.

## పచ్చి క్యారెట్ తింటే పిచ్చెక్కించే బెనిఫిట్స్.. 1, 2 కాదు

క్యారెట్‌లను ఉడికించి కాకుండా పచ్చిగా తింటే శరీరానికి కావల్సినంత పోషకాలు అందుతాయని నిపుణులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా క్యారెట్ మహిళలకు మేలు చేస్తుందని అంటున్నారు. కాబట్టి పచ్చి క్యారెట్ తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం పదండి పచ్చి క్యారెట్లు తింటే.. శరీరంలో ఈస్ట్రోజెన్ ఉత్పత్తి కంట్రోల్‌లో ఉంటుంది. వాస్తవానికి, అదనపు ఈస్ట్రోజెన్ మెటిమలు, ఒత్తిడి సహా ఇతర హార్మోన్ల అసమతుల్యతలకు కారణమవుతుంది. ఈ సమస్యను నివారించడంలో క్యారెట్ మనకు ఉపయోగపడుతుంది.అలాగే, పచ్చి క్యారెట్లు కడుపులోని చెడు బ్యాక్టీరియాను తగ్గించడంలో సహాయపడతాయి. క్యారెట్‌లో ప్రత్యేకమైన ఫైబర్స్ ఉంటాయి. జీర్ణక్రియ ప్రక్రియ సాఫీగా జరుగుతుంది. లివర్ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడుతుంది. పచ్చి క్యారెట్లు శరీరంలోని చెడు బ్యాక్టీరియా, ఎండోటాక్సిన్, ఈస్ట్రోజెన్‌లను నియంత్రిస్తాయి. రోజుకు ఒక పచ్చి క్యారెట్ తినడం వల్ల కార్టిసాల్, ఎండోటాక్సిన్, ఈస్ట్రోజెన్ అధిక స్థాయిలో ఏర్పడకుండా అడ్డుకట్ట. ఎండోటాక్సిన్‌లను నిలువరించడంలో క్యారెట్ అద్భుతంలా పనిచేస్తుంది. క్యారెట్‌లో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, 4 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలకు రోజుకు కనీసం 700 నుండి 900 మైక్రోగ్రాముల విటమిన్ అవసరం. ఒక పచ్చి క్యారెట్ తినడం వల్ల తగినంత విటమిన్ ఎ అందుతుందని పేర్కొంది. క్యారెట్‌లో విటమిన్ ఎ, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. అందువల్ల, పచ్చి క్యారెట్‌లను తినడం వల్ల మొటిమలు, మచ్చలను నివారించవచ్చు. విటమిన్ ఎ థైరాయిడ్ పనితీరుపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. క్యారెట్‌లో విటమిన్ ఎ దండిగా ఉంటుంది. కాబట్టి హైపోథైరాయిడిజం ఉన్నవారికి క్యారెట్ ఒక వరమని చెప్పాలి. పచ్చి క్యారెట్ తింటే.. కంటి చూపును పదును అవుతుంది. రక్తపోటును తగ్గుతుంది. ప్రోటీన్‌ను పెంచడం, శక్తిని పెంచడం, ఎముకలను బలోపేతం చేయడం వంటి అనేక ప్రయోజనాలను చేకూరుతాయి. క్యారెట్‌లో క్యాలరీలు తక్కువగా, ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గుతారు. ఇది అనవసర కొవ్వును తగ్గిస్తుంది.



## ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ..

**- ప్రజావాణి కార్యక్రమంలో (91) ఫిర్యాదులు..**

**- మేడ్చల్ జిల్లా డిఆర్ఓ హరిప్రియ**





**శామీర్ పేట కలెక్టరేట్, మే 05 :** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను తహాసీల్దారు రాజశేఖర్ రెడ్డితో కలిసి డిఆర్ఓ హరిప్రియ స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోసోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (91) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ సూచించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలుల భీభత్సం - నేల రాలిన మామిడి...!



**మానకొండూర్,మే 5,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలో ఆదివారం రాత్రి వీచిన భారీ ఈదురుగాలులకు జగ్గయ్యపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 20 ఎకరాల్లో మామిడి పంటలు నేలకొరిగాయి.దీంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. జగ్గయ్యపల్లిలో వ్యాట వెంకట్ రెడ్డి, లక్ష్మారెడ్డి చెందిన మూడు ఎకరాలు, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి చెందిన ఐదు ఎకరాల మామిడి తోట దెబ్బ తినగా మండల కేంద్రంలో గల మరో పది ఎకరాల్లోని మామిడి తోటలు కూడా దెబ్బతిన్నాయి.అరుగాలం కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన మామిడి పంట, కాయలు చేతికి వచ్చే సమయానికి ఒక్కసారిగా ఈదురుగాలుల ధాటికి నేలపాలవ్వడంతో రైతులు తీవ్రంగా కుమిలిపోతున్నారు. పూత దశ నుంచి కాయలు కాసే వరకు ఎన్నో కష్టాలు పడి పెంచిన పంట ఈదురుగాలుల దెబ్బకు పూర్తిగా నష్టపోవడంతో పెట్టుబడి కూడా తిరిగి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జరిగిన నష్టంతో కోలుకోలేని దెబ్బతిన్న తమను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భాధిత మామిడి రైతులు వేడుకుంటున్నారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లికి గురుకుల ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ కృతజ్ఞతలు





**మానకొండూర్,మే 5 ,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లిలో గల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం 20లక్షలు మంజూరు చేసిన సందర్భంగా గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం పాఠశాల పేరెంట్స్ కమిటీతోకలిసి సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లిని శాలువాలతో ఘన సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ గురుకులాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో దేవంపల్లి ఎస్సీ గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు రేనుకుంట బాబు, గురుకులాల పూర్వ విద్యార్థి,సీనియర్ జర్నలిస్ట్ మొగురం రమేష్, పేరెంట్స్ రోడ్డ రాజ్ కుమార్, దేవేందర్, జేరిపోతుల రాజు, జంగం రాజేశం, కోడిముంజ అంజి పాల్గొన్నారు.

## మండల విద్యాధికారి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌లు

**ముత్తారం.మే.05.:** ముత్తారం మండలంలోని అడవీశ్రీరాంపూర్,పారుపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ చేపట్టారు. శనివారం అడవిశ్రీరాంపూర్లో 15 మంది,పారుపల్లిలో 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సమ్మర్ క్యాంప్ లో వాలంటీర్లు పిల్లలకు ఆటలు, ఆంగ్లం, తెలుగు, గణితం, చిత్రలేఖనంలో మెళకువలను నేర్పుతున్నట్లు ఎంఇఓ హరి ప్రసాద్ తెలిపారు.



# అర్జీ.1 ఏరియాలో త్వరలో “జాబ్ మేళా”

**• ఆర్జీ. 1 జిఎం శ్రీ డి. లలిత్ కుమార్**



**గోదావరిఖని ప్రతినిధి, మే 5, :** గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు తెలంగాణా రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశానుసారం సింగరేణి సి అండ్ ఎం.డి ఎన్. బలరాం సూచనల మేరకు రామగుండం ఏరియా1లో త్వరలో “జాబ్ మేళా” కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించుటకు సోమవారం రోజు ఆర్జీ. 1 జిఎం డి. లలిత్ కుమార్ అధ్యక్షతన సమావేశ హాలు నందు ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా జియం తెలియజేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా తలపెట్టిన “జాబ్ మేళా” కార్యక్రమానికి సంబందించిన పనుల పురోగతి గురించి చేపట్టవలసిన ప్రణాళికల గురించి అధికారులతో సమీక్షా నిర్వహిచడం జరిగింది. ఇట్టి “జాబ్ మేళా” కు సంబందించి హైదరాబాదుకు చెందిన 80 నుండి 100 ప్రైవేటు కంపెనీలు పాల్గొనటం జరుగుతుందని తెలిపారు. ఈ కంపెనీలలో వివిధ రకాల ఉద్యోగ అవకాశాలకు సంబందించి కంపెనీల యొక్క ప్రతినిధులు పాల్గొనటం జరుగుతుందని తెలిపారు. ఇట్టి కంపెనీలలో పని చేయుటకు ఆసక్తి అర్హత కలిగిన నిరుద్యోగ యువతను ఎంపిక చేసి వారికి ఉద్యోగ ఆవకాశాలు కల్పించుటకు త్వరలో ఇంటర్వ్యు ఆధారంగా ఎంపిక చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతందని తెలిపారు. ఇట్టి “జాబ్ మేళా” నిర్వహణకు సంబందించిన అన్ని రకాల వసతులు, ఏర్పాట్లను పకడ్బందింగా నిర్వహించాలని ఎక్కడ కూడా ఇబ్బందులు కలుగకుండా సజావుగా జరుగు విధంగా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని జియం లలిత్ కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి చేసారు. కావున ఆసక్తి గల నిరుద్యోగ యువతి యువకులు పదవ తరగతి నుండి పిజి, సాంకేతిక విద్య ఇతర పై చదువులు చదివిన వారు 2 పాస్ పోర్ట్ సైజ్ పొటోలు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాఫిలతో అర్జీ .1 జివిటిసి నందు ధరఖాస్తులను స్వయంగా అందజేయగలరని జియం తెలియజేసారు. ఇతర వివరాలకు సెల్ నెం. 9491144252 నెంబరుకు సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జిఎం గోపాల్ సింగ్, డిజియం పర్సనల్ కిరణ్ బాబు, అధికారులుహో ఆంజనేయులు, ఆంజనేయ ప్రసాద్, వర ప్రసాద్, లక్ష్మి రాజం, ధనలక్ష్మి బాయి, రాజేష్ కుమార్, అశోక్ రావు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాది హామీ కూలీలకు కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలి

**- ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు రెడ్డిగాని రాజు**



**తిమ్మాపూర్,మే 5,(:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నేదునూరు, లక్ష్మీదేవిపల్లి గ్రామాలలోని ఉపాధి హామీ పని ప్రదేశాలను కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు రెడ్డిగాని రాజు నాయకులతో కలిసి సోమవారం సందర్శించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రెడ్డిగాని రాజు మాట్లాడుతూ.....రాష్ట్రంద ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు, కూలీలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ,బడుగు బలహీనులకు పెద్దపీట వేసి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.ప్రజా సమస్యలు తీర్చేందుకు రోజుకు 20గంటలు పనిచేస్తూ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న గొప్ప నాయకుడు ఎమ్మెల్యేగా ఉండడం మానకొండూర్ నియోజకవర్గ ప్రజల అదృష్టమని ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అనే ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టి ప్రత్యేకించిన ఆఫ్ ద్వారా సమస్యను తెలుసుకొని సంబంధించిన అధికారులతో వెళ్లి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించే విధంగా రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతుందన్నారు.ఆప్ ద్వారా సమస్యల్ని భాదితులు నేరుగా ఎమ్మెల్యేకి తెలపాలని తాను కూడా గ్రామాల్లో రోజుకో గంట కేటాయించి ప్రతి నిరుపేద కుటుంబాన్ని కలిసి సమస్యలు తెలుసుకుని ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్తానని ధీమా వ్యక్తం చేశారు.దాదాపుగా మూడు,నాలుగు నెలలుగా ఉపాది కూలీలకు చెల్లించని కూలీ డబ్బులు కేంద్ర ప్రభుత్వం వెంటనే కూలీల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం ఉపాధి కూలీలందరికీ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో నేదునూరు, లక్ష్మీదేవిపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు గ్రామ శాఖ మహిళా అధ్యక్షురాలు వర్ణ పద్మ - కరుణాకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కాల్వ కుమార్, యువజన నాయకులు బొంతపల్లి అనిల్,నీలం జగపతి రెడ్డి,అందే లక్ష్మణ్, ఎలగందుల రవీందర్, ఎలగందుల మల్లయ్య,రెడ్డి గాని మొగిలి, కవ్వంపల్లి నాగరాజు, మహిళ నాయకురాల్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నిసార్ ఇమ్రాన్ స్మారక ఫైనల్ క్రికెట్ టోర్నమెంట్

**- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన బిజేపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ్ రెడ్డి**



**గోదావరిఖని ప్రతినిధి, మే 5, :** ఏప్రిల్ తేదీ 20 రోజున జెన్ కో గ్రౌండ్ లో రామగుండం బిజేపి ఇంచార్జ్ కందుల సంధ్యారాణి- పోచం సహకారంతో వారి చేతులమీదుగా ప్రారంభమైన, నిసార్ మరియు ఇమ్రాన్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ నేడు ఘనంగా ముగిసింది. మ్యాచ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి బిజేపి పార్టీ జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మ్యాచ్ ప్రారంభం నుండి మొత్తం 32 టీం లు పాల్గొనగా, తుది పోటీలో రఘు 11 టీం మరియు ప్రకాశ్ జిడికే టీం జట్లు తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ప్రకాశ్ జిడికే జట్టు విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం విన్నర్ టీం కి 25 వేల రూపాయలు రన్నర్ టీం కి 15 వేల రూపాయలని విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ “క్రీడలు మన జీవితంలో ఒక భాగంగా మారాలి అన్నారు. ఇవి శారీరకంగా కాదు, మానసికంగా కూడా మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపించడం అభినందనీయం అని, ఈరోజు జరిగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ద్వారా క్రీడాకారులు ఎంతో మంచి ప్రతిభ చూపారని అన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభని వెలికితీసేందుకు ఇటువంటి టోర్నమెంట్లు బలమైన వేదికలు అవుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వంగా గానీ, సంఘస్థాయిలో గానీ మరింతగా ప్రోత్సహించాలన్నారు. విజేతలు మాత్రమే కాదు, పాల్గొన్న ప్రతి ఒక్కరూ అభినందనీయులే అన్నారు. విజయం ఓటములు క్రీడల్లో సహజం, కానీ వాటి ద్వారా నేర్చుకునే పాఠాలు జీవితాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్, ఊరగొండ అపర్ణ, క్యాతం వెంకటరమణ, పిడుగు కృష్ణ, ముసుకుల భాస్కర్ రెడ్డి,కోమల మహేష్, మచ్చ విశ్వాస్, తోట కుమారస్వామి, సిలువేరు అంజి, జక్కుల నరహరి, ఐత పవన్, దెబ్బట కమల్, బుసిపాక సంతోష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ డి.వేణు**

**పెద్దపల్లి ప్రతినిధి మే 05,:** ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల అర్జీలను స్వీకరించారు.ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు.ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన భోగి రాజు రహదారి కింద సర్వే నెంబర్ 36/3 లోని 30 గుంటల భూమి కోల్పోయానని తనకు 14 గుంటల డబ్బులు మాత్రమే వచ్చాయని మిగిలిన 16 గుంటల డబ్బులు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మంథని రెవెన్యూ డివిజన్అధికారికరాస్తూపరిశీలించేచర్యలుతీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి పట్టణం 16వ వార్డుకు చెందిన కనకయ్య సర్వే నెంబర్ 1459 లో అర గుంట భూమి 1998 లో కొనుగోలు చేశానని, తనకు ఆ భూమిని సాధా బైనామా చేసి తన పాస్ పుస్తకంలో చేర్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అరటిపండు, బొప్పాయి కలిపి తింటే అనారోగ్యానికి గురవుతారా..? ఇదిగో క్లారిటీ



మన ఆరోగ్యానికి పండ్లు చాలా అవసరం. పండ్ల ద్వారా ప్రొటీన్, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు శరీరానికి అందుతాయి. అందుకే డైలీ ఫ్రూట్స్ తినమని డాక్టర్లు చెబుతుంటారు. కొంతమంది వివిధ రకాల పండ్లను సలాడ్ రూపంలో తినడానికి ఇష్టపడతారు. అరటిపండు, బొప్పాయి కలిపి తినడాన్ని చాలామంది ఇష్టపడతారు. అయితే ఈ 2 ఫ్రూట్స్ తినడం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను తెలుసుకుందాం పదండి.. అరటిపండు, బొప్పాయి కలిపి తింటే ఆరోగ్యానికి మంచిదా, చెడ్డదా అనే ప్రశ్నకు సమాధానం మన జీర్ణవ్యవస్థపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అరటి, బొప్పాయి రెండు విభిన్న స్వభావం కలిగిన పండ్లు కాబట్టి, వాటిని కలిపి తినడం వల్ల ఆరోగ్యంలో ఇబ్బందులు వస్తాయి. కాబట్టి ఇలా తినకపోవడమే మంచిదని అంటున్నారు. అరటిపండు, బొప్పాయి కలిపి తింటే వాంతులు, తలనొప్పి, వికారం, ఎసిడిటీ, గ్యాస్టిక్ ప్రాబ్లెమ్, అలర్జీ వంటి సమస్యలు వస్తాయట. ఉబ్బసం, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఈ పండ్ల కాంబినేషన్ తినడం వల్ల సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉందట. బొప్పాయి, అరటిపండు కలిపి తింటే కడుపు నొప్పికి కూడా కారణం కావచ్చు. కాగా కామెర్లు బాధపడుతున్నవారు బొప్పాయి తినకూడదని కూడా డాక్టర్లు సలహా ఇస్తున్నారు. ఇందులోని పపైన్, బీటా కెరోటిన్ కామెర్లు సమస్యను పెంచుతుందని చెబుతున్నారు. ఇక శరీరంలో పొటాషియం అధిక స్థాయిలో ఉంటే అరటిపండ్లను తినకూడదు. ఇది శరీరంలో తీవ్రమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది.

## సింగరేణికి కాం, కార్మిక సంఘాల సమ్మె నోటీస్



**యైటింక్లయిన్ కాలనీ. మే 05 :** సింగరేణి రామగుండం రెండవ ఏరియా యాజమాన్యానికి, సోమవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఐక్యవేదిక సమ్మె నోటీస్ అందజేశారు. ఉదయం ఏరియా జీఎం కార్యాలయానికి వచ్చిన ఐక్యవేదిక నాయకులు యాజమాన్యం పక్షాన ఏరియా పర్సనల్ డీజియం అనిల్ కుమార్ ను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న చట్టాలను కాపాడుకునేందుకు, ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు కలిసి రావాలంటూ కాంట్రాక్ట్ కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణి లో యాజమాన్యం కాంటాక్ట్ కార్మికులను యాజమాన్యం కట్టు బానిసలుగా వాడుకుంటూ, వేతనాలను పెంచకుండా శ్రమ దోపిడీ చేస్తుందని ఆరోపించారు. మరోవైపు బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత, కార్మిక వర్గ వ్యతిరేక చర్యల్లో భాగంగా లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి, పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గంపై అనుసరిస్తున్న నిరంకుశ విధానాలపై, ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం కలిసికట్టుగా పాల్గొని ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు సిద్ధం కావాలని, ఐక్యవేదిక నాయకులు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఇక సమ్మె నోటీస్ ఇచ్చిన వారిలో ఉల్లి మొగిలి (సిఐటియు), కె. విశ్వనాథ్, డి. లక్ష్మణ్ (ఐఎఫ్టియు), మద్దెల శ్రీనివాస్ (టిసికెఎస్), టి. రత్నకుమార్ (ఏఐఎఫ్టియు) లు ఉన్నారు.

## ఎస్.ఎస్.సి లో స్కూల్ టాపర్‌ను అభినందించిన ఎంఇఓ. సీతాలక్ష్మి



**ధర్మపురి, మే 5, :** ఎస్.ఎస్.సి దొనూర్ గ్రాంలోనిలో స్కూల్ టాపర్‌గా మార్కులు సాధించిన విద్యార్థినిని ఎంఇఓ సీతాలక్ష్మి అభినందించారు. ప్రాంతం లో చదువుతూ ఈ మధ్యనే ప్రకటించిన ఎస్.ఎస్.సి 2025 ఫలితాల్లో 506/600 మార్కులు సాధించిన దొనూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని ని, పాఠశాల గురువులకు మరియు తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్కూల్ టాప్ 1 స్థానంలో నిల్చిన దోనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సంగ నర్సింహులు కుమార్తె అశ్వితని పాఠశాల హెడ్ మాస్టర్ మరియు ఎంఈవో ఎస్. సీతాలక్ష్మి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీతాలక్మి మాట్లాడుతూ ఆడపిల్ల చదువు సమాజ అభివృద్ధికి పట్టుగొమ్మ అని కొనియాడి ఆడవాళ్ళు అన్నిరంగాల్లో ఇంకా రాణించాలని ఎం.ఈ.ఓ సూచించారు. ఈ అభినందన కార్యక్రమం లో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం. ఎం.సురేష్ కుమార్ గణితం స్కూల్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

## కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ప్రతి రైతుకు యూనిక్ ఐడి

### - మండల వ్యవసాయాధికారి అనూష



**ముత్తారం.మే.06.:** ముత్తారం మండలంలోని మైదంబండ,ఖమ్మంపల్లి క్లస్టర్ పరిధిలో రైతులకు యూనిక్ ఐడిని కేటాయించేందుకు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యవసాయఅధికారి అనూష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దేశంలోని ప్రతి పౌరుడికి ఆధార్ గుర్తింపు ఉన్నట్లే ప్రతి రైతుకు ఒక విశిష్టమైన 11 అంకెల యూనిక్ ఐడి నెంబర్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు యొక్క భూములకు సంబంధించిన వివరాలను రిజిస్టర్ చేయనున్నట్లు,ప్రతి రైతు తమ ఆధార్,ఆధార్ లింక్ రిజిస్టర్ మొబైల్, పట్టా పాస్ బుక్‌తో గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని సూచించారు. తద్వారా యూనిక్ ఐడిని పొంది రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు హారిక, శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తి మృతి పట్ల మౌనం పాటించిన ధర్మపురి బార్ అసోసియేషన్



**ధర్మపురి, మే 5, :** ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అలుక వినోద్ కుమార్ ఆధ్వర్యం లో బార్ అసోసియేషన్ న్యాయవాదులు అకాల మరణం చెందిన గిరిజ ప్రియదర్శిని మృతి పట్ల మౌనం పాటించి నివాళులు అర్పించారు. వారి ఆత్మ కు శాంతి కలగాలని భగవంతుణ్ణి వేడుకోవడం జరిగింది. ఆమె ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్జి గా ఉన్న సందర్భంలో మన ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఏర్పాటు కావడంలో వారు చేసిన సేవలను ఈ సందర్భంగా న్యాయవాదులు గుర్తుచేసుకుంన్నారు. ఈ కార్యక్రమం లో ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియు న్యాయవాదులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రెవెన్యూ సదస్సులను వినియోగించుకొని భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించాలి
- పాఠశాలలో పెండింగ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- ఎలిగేడు మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష







**పెద్దపల్లి ప్రతినిధి మే 05, :** రైతులు పండించిన నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎలిగేడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఎలిగేడు మండల కేంద్రం లోని గ్రామపంచాయతీ లో నిర్వహిస్తున్న భూ భారతీ రెవెన్యూ సదస్సు, బుర్హాన్ మియాపేట గ్రామంలో జరుగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరిశీలించారు. భూ సమస్యలు ఉన్నవారు తమ దరఖాస్తులను రెవెన్యూ సదస్సులలో అందించాలని, భూ భారతి చట్టం ప్రకారం ప్రతి భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఎలిగేడు మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఐకేపి, ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ధూళికట్ట ఐ.కె.పి, పి.ఎ.సి.ఎస్, బుర్హాన్ మియాపేట గ్రామంలో పి.ఎ.సి.ఎస్ మరియు ఐ.కె.పి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెరిగిందని, నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ధాన్యం నాణ్యత ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలు రాగానే కొనుగోలు చేస్తామని అన్నారు.అనంతరం ఎలిగేడు మండలం శివ పల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరగా గ్రౌండ్ చేసుకొని పనులు ప్రారంభించాలని, బేస్మెంట్ వరకు పూర్తి చేసుకున్న ఇండ్లకు ప్రభుత్వం నుండి లబ్ధిదారులకు ఒక లక్ష రూపాయల నిధులు విడుదల చేస్తుందని కలెక్టర్ తెలిపారు. దూళికట్ట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఇన్చార్జి ఆర్డీవో సురేష్, తహసిల్దార్ బషీరుద్దీన్, అడిషనల్ డి.ఆర్.డి.ఓ. రవికుమార్, ఎం.పి.డి.ఓ భాస్కర్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు రావాలి, భద్రత కావాలి

- ఐఎన్టియూసి నేత బి.జనక్ ప్రసాద్




**యైటింక్లయిన్ కాలనీ. మే 05 :** రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కావాలి అన్నదే యూనియన్ లక్ష్యమని, ఐఎన్టియూసి సెక్రెటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ అన్నారు. సోమవారం స్తానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల సంపూర్ణ సహకారంతో నేడు, 16 వందల మెగావాట్ల పవర్ పవర్ ప్లాంట్ లను, కొత్తగూడెం, ఇల్లందు ఏరియాల్లో రెండు బొగ్గు గనులు సాధించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ 100 కోట్ల టర్నోవర్ లో కొనసాగుతుందని తెలిపారు. ఇంకా సింగరేణి ఆధ్వర్యంలో ఒక ఐటీ పరిశ్రమ, రెండు సిమెంట్ పరిశ్రమల ఏర్పాటు జరగాలని, తద్వారా మరో ఐదువేలకు పైగా నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సింగరేణి కార్మికులకు లక్షా 90 వేల లాభాల వాట, దేశంలో ఎక్కడా లేని విధంగా కాంట్రాక్ట్ కార్మికులకు 5000 రూపాయల వాటను ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. అలాగే యూనియన్ అభ్యర్థన మేరకు, సింగరేణి కార్మికులకు స్వంత ఇంటి పథకం అమలు చేసేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖంగా ఉందని పేర్కొన్నారు. యూనియన్ పెట్టుకున్న లక్ష్యాలకు అణుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సింగరేణి సంస్థను కాపాడుతూ, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని వ్యాఖ్యానించారు. ఇక నాడూ నేడూ ఒక వైపు సింగరేణి సంస్థను కాపాడుకుంటూ, మరో వైపు కార్మిక వర్గానికి అనునిత్యం అందుబాటులో ఉంటూ, వారి హక్కులను సాధిస్తూ సమస్యలను పరిస్కరిస్తున్నది కేవలం కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టియూసి మాత్రమేనని జనక్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. ఇంకా ఈ సమావేశంలో యూనియన్ రెండవ బ్రాంచ్ ఉపాధ్యాక్షులు బి. శంకర్ నాయక్, నాయకులు ధర్మపురి, అక్బర్ అలీ, ఎండి. అక్రమ్, కొత్త సత్యనారాయణ రెడ్డి, కొంగర రవీందర్, ఎన్. దశరథం, వాసంశెట్టి మార్కండేయ, కే శ్రీనివాసరెడ్డి, ఎస్. మల్లేశ్, మల్లికార్జున్, రాజిరెడ్డి, చాట్ల సదానందం, పోగుల వీరారెడ్డి, నవీన్, కిషన్ నాయక్, అశోక్ పాల్గొన్నారు.

# నేత్రదానంతో 'వసంత్ ' ఇద్దరికీ చూపు..!

- ఆత్మహత్య చేసుకున్న కొడుకు
- పుట్టెడు దుఃఖంలో తల్లిదండ్రులు
- బిడ్డ జ్ఞాపకాలను బతికించేందుకు నేత్రదానం
- అవగాహన కల్పించిన సదాశయ ఫౌండేషన్



**రామగిరిమే 05:-** కొడుకు చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు ఇద్దరు అంధులకు కంటి చూపును ప్రసాధించడానికి అతని నేత్రాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. పెద్దపల్లి జిల్లా సెంటినరీ కాలనీ లో నివసించే వేముల రవి శంకర్-జయలక్ష్మి ల కుమారుడు అందరితో అన్యోన్యంగా ఉండే వసంత్ కుమార్, ఆదివారం, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు అకాలమరణంతో తల్లిదండ్రులతోపాటు మృతురాలి పెదనాన్న పెద్దమ్మ లు రాజేందర్-చండిరాణి అన్నయ్య వర్షిత్ కుమార్ శోకసంద్రంలో మునిగిపోయారు. వసంత్ నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు కంటి చూపును ప్రసాదించ వచ్చని, ఇద్దరు అంధులతో ఈ లోకాన్ని అతని కళ్ళు సజీవంగా చూస్తూనే ఉంటాయని తల్లితండ్రలకు సదాశయ ఫౌండేషన్ రాజన్న, లైన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ డైరెక్టర్ మారుతి మాజీ జెడ్పిటిసి గంట వెంకట రమణారెడ్డి అవగాహన కల్పించారు. దీంతో స్పందించిన కుటుంబ సభ్యులు వసంత్ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో వసంత్ నెత్రాలను సేకరించి, హైదరాబాదుకు తరలించారు. అనంతరం ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ నుంచి వచ్చిన అభినందన పత్రాన్ని ఫౌండేషన్ అధ్యక్షులు సాన రామకృష్ణ రెడ్డి, సలహాదారు నూక రమేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి , సెంటినరీ కాలనీ కన్వీనర్ సమ్మయ్య చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేసి అభినందించారు. విషాదంలో కూడా మరో ఇద్దరు అంధులకు వెలుగులు పంచడానికి నేత్రదానం చేయడానికి ముందుకు కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షలు టి.శ్రవణ్ కుమార్, మెరుగు భీష్మాచారి, ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, జిల్లా మహిళా అధ్యక్షురాలు వెల్ది కవిత అనంతరాములు, పట్టణ కార్యదర్శి బోల్ల చంద్రశేఖర్, లైన్స్ క్లబ్ సెంట్రింగ్ కాలనీ డైరెక్టర్ మాజీ జెడ్పిటిసి గంటవెంకటరమణారెడ్డి రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.మల్లికార్జున్ తదితరులు అభినందించారు. ఆమె మృతి పట్ల సంతాపం తెలిపి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# స్పోర్ట్స్


# సెంచరీ ముంగిట బోల్తా పడ్డ యంగ్‌స్టర్లు



2025 ఐపీఎల్ రసవత్తరంగా సాగుతోంది. హెూరాహెూరీ మ్యాచ్‌లు ప్రేక్షకులకు ఫుల్ మజానిస్తున్నాయి. యంగ్ ప్లేయర్ల నుంచి సీనియర్లు సత్తా చాటు కుంటున్నారు. ముఖ్యంగా యువ ఆటగాళ్లు ప్రతీ బంతిని బౌండరీ దాటించాలని ప్రయత్నిస్తున్నారు. సెంచరీ బాదేసి ప్రపంచానికి తమ సత్తా ఏంటో చూపించాలని తహతహలాడుతున్నారు. ఈ నేపథ్యంలో గత మూడు మ్యాచ్?ల్లో ముగ్గురు యంగ్?స్టర్లు సెంచరీ ముంగిట బోల్తా పడ్డారు.చిన్నస్వామి వేదికగా శనివారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్?లో చెన్నై యువ సంచలనం ఆయూష్ మాత్రే అదరగొట్టాడు. 214 పరుగుల భారీ ఛేదనలో ఆయూష్ పోరాటం వల్లే సీఎస్కే విజయం అంచుల గాకా వెళ్లింది. 17ఏళ్ల ఆయూష్ ఐపీఎల్?లో ఆడుతుంది నాలుగో మ్యాచే అయినా ఛేజింగ్?లో అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. ఒత్తిడిలో పరిస్థితులను తట్టుకొని మరీ అదరగొట్టాడు. మాత్రే 48 బంతుల్లోనే 94 పరుగులు చేశాడు. ఎంగ్డి బౌలింగ్?లో భారీ షాట్?కు ప్రయత్నించి క్యాచౌట్ అయ్యాడు. అలా కెరీర్?లో తొలి సెంచరీని 6 పరుగుల తేడాతో మిస్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్?లో సీఎస్కే పరుగుల తేడాతో ఓడింది.రాజస్థాన్ రాయల్స్ యంగ్ ప్లేయర్ రియాన్ పరాగ్ ఆదివారం నాటి కోల్?కతా మ్యాచ్?లో సూపర్ ఇన్నింగ్స్?తో ఆకట్టుకున్నాడు. 207 పరుగుల ఛేదనలో రాజస్థాన్ 8రన్స్?కే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో పరాగ్ సూపర్ ఇన్నింగ్స్?తో రాజస్థాన్?ను మళ్లీ గేమ్?లోకి తీసుకొచ్చాడు. అద్భుత బ్యాటింగ్?తో జట్టును విజయం వైపునకు నడిపించాడు. ఈ క్రమంలోనే 90ల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. పరాగ్? క్రీజులో ఉన్నంతసేపు రాజస్థాన్?దే విజయం. కానీ 95 వ్యక్తిగత పరుగుల వద్ద పరాగ్?ను హర్షిత్ రానా చక్కటి బంతితో బోల్తా కొట్టించి పెవిలియన్ చేర్చాడు. దీంతో పరాగ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఐపీఎల్?లో తొలి సెంచరీకి 5 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. ఆఖర్లో కోల్?కతా అద్భుతంగా బౌలింగ్ చేసి 1 పరుగు తేడాతో విజయం సాధించింది. సొంతగడ్డపై ఆదివారం లఖ్?నవూపై పంజాబ్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్?లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 236 పరుగులు చేసింది. పవర్? ప్లే లోనే 2 వికెట్లు పడినా పంజాబ్ ఈ స్థాయి స్కోరు సాధించిందంటే కారణం ప్రభ్?సిమ్రనే. ఓపెనర్?గా వచ్చిన ఈ యువ సంచలనం మొదట్నుంచి బాదుడు మీదే ఉన్నాడు. రన్?రేట్ 10కి తగ్గకుండా చూసుకుంటూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలోనే సెంచరీకి చేరువయ్యాడు. అయితే 91 వ్యక్తిగత పరుగుల వద్ద ప్రభ్?సిమ్రన్?ను దిగ్వేశ్ రాఠీ పెవిలియన్ చేర్చాడు. చివర్లో శశాంక్ సింగ్ మెరుపులతో పంజాబ్ భారీ స్కోర్ నమోదు చేసింది.

## కొనసాగుతున్న పంత్ వైఫల్యాల బాట

లక్నో సూపర్ జెయింట్స్ పరాజయాల పరంపరం కొనసాగుతోంది. వరుసగా మూడు మ్యాచ్ ల్లో ఓడిపోయి, పరాజయాల హ్యాట్రిక్ నమోదు చేసింది. ఆదివారం డబుల్ హెడర్ లో భాగంగా పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 37 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. అయితే ఈ మ్యాచ్ లో జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ అంచనాలకు తగినట్లుగా రాణించలేకపోయాడు. 237 పరుగుల టార్గెట్ ఛేదించేందుకు బరిలోకి దిగిన లక్నోకు శుభారంభం దక్కలేదు. 71 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా భారీ ఛేదనలో లక్నోను ఆదుకోవడంలో పంత్ విఫలమయ్యాడు. కేవలం 17 పరుగులు మాత్రమే చేసి విఫలమయ్యాడు. అతను ఔటైన విధానంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యతారాహిత్యంగా ఆడి, వికెట్ పారేసుకున్నాడు. ఈ సందర్భంగా జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా హావభావాలపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. దీనిపై తమకు తోచిన కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లతో హెూరెత్తిస్తున్నారు. గతేడాది ఢిల్లీ క్యాపిటల్స్ కు నాయకత్వం వహించిన పంత్.. ఈ ఏడాది నుంచి లక్నోకు సారథ్యం వహిస్తున్నాడు. రూ.27 కోట్ల భారీ ధరకు అతడిని కొనుగోలు చేసిన లక్నో యాజమాన్యం.. పంత్ ఆటతీరుపై నిరాశ జనకంగా ఉంది. ఈ సీజన్ లో 11 మ్యాచ్ లాడిన పంత్.. 10 ఇన్నింగ్స్ ల్లో బరిలోకి దిగాడు. ఇందులో కేవలం 128 పరుగులు చేసి నిరాశ పర్చాడు. చెన్నై సూపర్ కింగ్స్ పై మాత్రం 63 పరుగులతో రాణించాడు. ఈ సీజన్ లో కేవలం 12 సగటు, వందలోపు స్ట్రైక్ రేట్ తో నిరాశపర్చాడు. కీలకమైన పంజాబ్ తో మ్యాచ్ లోనూ విఫలమయ్యాడు. ధర్మశాలలో పంజాబ్ తో జరిగిన మ్యాచ్ లో లక్నో అన్ని రంగాల్లో విఫలమైంది. ఫస్ట్ బౌలర్లు తేలిపోవడంతో 236 పరుగులను లక్నో సమర్పించుకుంది. సరైన లైన్ అండ్ లెంగ్త్ లేకపోవడంతోపాటు గాడి తప్పిన బౌలింగ్ ను పంజాబ్ బ్యాటర్లు పండుగ చేసుకున్నారు. ఇక బ్యాటింగ్ లో టాపార్డర్ ఘోరంగా విఫలమవడం జట్టు అవకాశాలను దెబ్బ తీసింది. పంత్ కూడా నిర్లక్ష్యంగా ఆడటంతో జట్టుకు ఓటమి తప్పలేదు. ఇక పేలవమైన ఫీల్డింగ్ తో పలు క్యాచ్ లను జారవిడవడం కూడా లక్నోకు శాపంగా మారింది. ఇక ఈ సీజన్ లో మిగిలిన మూడు మ్యాచ్ ల్లోనూ గెలిస్తే తప్ప, లక్నో ప్లే ఆఫ్స్ కు చేరుకునే అవకాశం లేదు. తన చివరి మూడు మ్యాచ్ లను ఆర్సీబీ, జీటీ, సన్ రైజర్స్ హైదరాబాద్ లతో లక్నో ఆడనుంది. ప్రస్తుతం 10 పాయింట్లతో లక్నో సూపర్ జెయింట్స్ ఏడో స్థానంలో ఉంది.




## 'పెద్ది' షాట్ ఆడిన ఢిల్లీ ప్లేయర్..

ఢిల్లీ క్యాపిటల్స్ యువ ప్లేయర్ సమీర్ రిజ్వీ .. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' మూవీ గ్లింప్స్‌లోని క్రికెట్ షాట్‌ను రీక్రియేట్ చేశాడు. స్టెప్ ఔటై.. పిచ్‌ను బ్యాట్‌తో గుద్ది ఆడే ఈ షాట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈ షాట్‌ను సమీర్ రిజ్వీ ఆడాడు. ఇందుకు సంబంధించిన వీడియోను ఢిల్లీ క్యాపిటల్స్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. పెద్ది సినిమా గ్లింప్స్‌లోని హిందీ డైలాగ్స్‌ను ఈ వీడియోకు ఉపయోగించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో కీలక పోరుకు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ ఈ షాట్‌ను రీక్రియేట్ చేసింది. ఉప్పల్ వేదికగా జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఈ వీడియోను షూట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వీడియోకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫిదా అయ్యాడు. థ్యాంకూ అంటూ ట్వీట్ చేశాడు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్ నేపథ్యంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆల్‌ది బెస్ట్ చెప్పాడు. అంతేకాకుండా ఆరెంజ్ ఆర్మీతో జాగ్రత్త అంటూ హెచ్చరించాడు. 'పెద్ది ఫస్ట్ షాట్‌ను రీక్రియేట్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ధన్యవాదాలు. నేటి మ్యాచ్‌కు ఆల్‌ది బెస్ట్. సన్‌రైజర్స్ బలంగా పుంజుకునే ప్రయత్నం చేస్తుంది. జాగ్రత్తగా ప్రిపేర్ అవ్వండి.'అని ఎక్స్‌వేదికగా రాసుకొచ్చాడు. ఈ పోస్ట్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ పెద్ది షాట్ రీక్రియేట్ వీడియోను కూడా జత చేశాడు. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు డైరెక్షన్‌లో చెర్రీ 16వ సినిమాగా 'పెద్ది' చిత్రం తెరకెక్కుతుంది.ఈ చిత్రాన్ని వ్రిద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమాను రిలీజ్ చేసే అవకాశం ఉంది. పెద్ది ఐకానిక్ క్రికెట్ షాట్‌ను మ్యాచ్‌లో ఆడొచ్చా? అనే సందేహం క్రికెట్ అభిమానులకు నెలకొంది. అయితే ఈ షాట్‌ను ఆడటం చాలా కష్టం. ఆడే ప్రయత్నం చేసినా బ్యాటర్లకు గాయమయ్యే అవకాశాలు ఉన్నాయి. బ్యాటర్‌కు అంత సమయం దొరకడం కష్టం. స్టెప్ ఔటై.. బ్యాట్‌ను క్రీజుతో గుద్దితే అంపైర్ ఊరుకోడు. రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటాడు. బ్యాట్‌తో బలంగా క్రీజును గుద్దితే .. పిచ్ డ్యామేజ్ అవుతుంది. ఈ సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో టాప్ లేపిన ఢిల్లీ.. ఆ తర్వాత వరుస పరాజయాలతో చతికలపడింది. ప్రస్తుతం 10 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఢిల్లీ ప్లే ఆఫ్స్ చేరాలంటే తమ చివరి 4 మ్యాచ్‌ల్లో రెండు గెలవాలి. ప్లే ఆఫ్స్ చేరడానికి ప్రతీ జట్టు 16 పాయింట్స్ సాధించాల్సి ఉంటుంది. రన్‌రేట్ కూడా మెరుగ్గా ఉండాలి. టాప్-2లో నిలవాలంటే 18-20 పాయింట్స్ సొంతం చేసుకోవాలి. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్‌తో జరిగే నేటి మ్యాచ్‌లో ఢిల్లీ గెలవడం అత్యంత కీలకం.

## వన్డేల్లో 124 రేటింగ్ పాయింట్లతో భారత్ అగ్రస్థానం

### టెస్టుల్లో ఆసీస్ దే పై చేయి!
### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ జోరు



అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజా వార్షిక ర్యాంకింగ్స్ ప్రకారం భారతదేశం, ఆస్ట్రేలియా క్రికెట్ జట్లు అన్ని ఫార్మాట్లలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. మే 2024 నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లను 100 శాతం బేస్‌గా తీసుకుని, గత రెండు సంవత్సరాల మ్యాచ్‌లను 50 శాతం విలువతో లెక్కించి విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ టీ20, వన్డే ఫార్మాట్లలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, టెస్ట్ క్రికెట్‌లో మాత్రం ఆస్ట్రేలియా తన సింహాసనాన్ని మళ్లీ కైవసం చేసుకుంది. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ విజేత అయిన ఆస్ట్రేలియా 126 రేటింగ్ పాయింట్లతో టెస్ట్ ఫార్మాట్‌లో నంబర్ వన్ జట్టుగా ఉంది. ఇది రెండవ స్థానంలో ఉన్న ఇంగ్లాండ్‌పై 13 పాయింట్ల ఆధిక్యం. ఇక ఈ ఏడాది ఆస్ట్రేలియాతో ఫైనల్‌లో తలపడనున్న దక్షిణాఫ్రికా 111 పాయింట్లతో మూడవ స్థానంలో ఉండగా, భారత్ నాల్గవ స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఐర్లాండ్ జట్లు వరుసగా టాప్ 10లో స్థానం పొందాయి. ఇక వన్డేల్లో భారత్ 124 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా (రెండు జట్లు 109 పాయింట్లు) భారత్‌కు వెనుకంజలో ఉన్నా, శ్రీలంక, పాకిస్తాన్ (104 పాయింట్లు) కూడా పోటీగా నిలుస్తున్నాయి. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి జట్లు దిగువ స్థానాల్లో ఉన్నాయి. అదే విధంగా టీ20 ఫార్మాట్‌లోనూ భారత్ తన ఆధిపత్యాన్ని మరింత బలంగా చూపించింది. ఇటీవలే టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు 271 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ ఉన్నారు. దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ వరుసగా ఆరెవ నుండి పదవ స్థానాల్లో ఉన్నాయి. ఈ ర్యాంకింగ్స్ చూస్తే, భారత్ తన పరాక్రమాన్ని పరిపూర్ణంగా ప్రదర్శించడమే కాక, భవిష్యత్తులో కూడా అన్ని ఫార్మాట్లలో ప్రభావాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టంగా తెలుస్తోంది.ఈ ర్యాంకింగ్స్ భారత్‌కు విశ్వాసాన్ని అందించడమే కాక, రాబోయే టోర్నమెంట్లకు సన్నద్ధమవ్వడానికి మోటివేషన్‌ను కూడా ఇస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలకు ముందు, భారత్ అన్ని ఫార్మాట్లలో టాప్ ర్యాంక్‌ను కొనసాగించడమే కాక, యువతరం ఆటగాళ్లను బలోపేతం చేయడంపై కూడా దృష్టి పెట్టనుంది. బీసీసీఐ వ్యూహాత్మకంగా స్క్వాడ్‌ను రొటేట్ చేస్తూ, అనుభవం, యువ శక్తికి సమతౌల్యాన్ని తీసుకువచ్చే దిశగా ముందుకు సాగుతోంది. ఇదే ధోరణిలో కొనసాగితే, భారత్ అంతర్జాతీయ క్రికెట్‌లో గల గ్లోబల్ డామినెన్స్‌ను మరింత పటిష్టం చేసే అవకాశముంది.




## బుమ్రా వైస్ కెప్టెన్సీ బాధ్యతల తొలగింపు!

ఐపీఎల్ తర్వాత టీమ్ఇండియా జూన్?లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్?లో ఆతిథ్య జట్టుతో భారత్ ఐదు మ్యాచ్?ల టెస్టు సిరీస్ ఆడనుంది. జూన్ 20- ఆగస్టు 04 వరకు పర్యటన సాగనుంది. అయితే ప్రస్తుతం టీమ్ఇండియా టెస్టు జట్టుకు సీనియర్ ప్లేయర్ రోహిత్ శర్మ కెప్టెన్?గా వ్యవహరిస్తుండగా, స్టార్ పేసర్ బుమ్రా వైస్ కెప్టెన్?గా ఉన్నాడు. అయితే ఈ టెస్టు సిరీస్?కు బుమ్రాను వైస్ కెప్టెన్? హెూదా నుంది తప్పించే ఛాన్స్ ఉన్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. గత కొంతకాలంగా బుమ్రా గాయాల బారిన పడుతున్నాడు. ప్రస్తుతం బుమ్రా ఫిట్?నెస్ పరంగా వరుసగా ఐదు టెస్టు మ్యాచ్?ల్లో బుమ్రా ఆడడం కష్టమేనని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బుమ్రా రెండు లేదా మూడు మ్యాచ్?లు ఆడే ఛాన్స్ ఉన్నట్లు తెలిసింది. దీంతో మిగిలిన టెస్టులకు బుమ్రా బెంచ్?కే పరిమితం కావొచ్చు. అందుకే సిరీస్ మధ్యలో వైదొలిగే ప్లేయర్?కు కాకుండా అన్ని మ్యాచ్?లు ఆడగలిగే మరో ప్లేయర్?కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని మేనేజ్?మెంట్ భావిస్తున్నట్లు సమాచారం.మరోవైపు కోచ్ గౌతమ్ గంభీర్ కూడా ఈ అంశాన్ని పరిశీస్తున్నాడట. తాత్కాలికంగా కాకుండా సుదీర్ఘ కాలం జట్టుకో కొనసాగే ప్లేయర్?నే వైస్?గా ఎంపిక చేయాలని భావిస్తున్నాడని టాక్. ఈ క్రమంలో యంగ్ ప్లేయర్ శుభ్?మన్ గిల్?కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం సాగుతోంది. 'బుమ్రా ఐదు టెస్టులు ఆడే ఛాన్స్? లేదు. అందుకే ఆయా మ్యాచ్‌లకు ఒక్కొక్క ప్లేయర్?ను వైస్?గా నియమించడం కుదరదు. అందుకే ఐదు టెస్టు మ్యాచ్‌లు ఆడే ప్లేయర్?కే వైస్ కెప్టెన్సీ బాధ్యత ఇవ్వాలని అనుకుంటున్నాం' అని బీసీసీఐ మెంబర్ ఒకరు పేర్కొన్నట్లు వార్తలు వస్తున్నాయి. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ గైర్హాజరీలో బుమ్రా మూడు టెస్టులకు కెప్టెన్?గా వ్యవహరించాడు. 2022లో తొలిసారి ఇంగ్లాండ్?పై టెస్టు మ్యాచ్?లో జట్టును నడిపించాడు. ఈ మ్యాచ్?లో టీమ్ఇండియా ఓడింది. ఇక గతేడాది ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో తొలి, ఐదో మ్యాచ్?కు కెప్టెన్సీ చేశాడు. ఇందులో ఫస్ట్ టెస్టులో నెగ్గగా, ఐదో మ్యాచ్?లో భారత్ ఓడింది.

## ఓడినా.. ఆదరిస్తున్నారు: ప్యాట్ కమిన్స్

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తెలిపాడు. ఆశించిన ఫలితాలు సాధించకున్నా అభిమానులు ఆదరిస్తున్నారని చెప్పాడు.'మేము ముందుగా బౌలింగ్ చేస్తాము. మేము కొన్ని విషయాల గురించి చర్చించాము. ఇంకా పూర్తి ఆట ఆడలేదు. మా బేసిక్స్‌ను సవరించాలనుకుంటున్నాం. జట్టులో ప్రతి ఒక్కరూ మ్యాచ్ విన్నరే. మాకు డీప్ బ్యాటింగ్ లైనప్ ఉంది. అభిమానుల మద్దతు అద్భుతం. ఆశించిన ఫలితాలు రాకున్నా.. ప్రేక్షకులు అండగా నిలవడం గొప్ప విషయం. మెరుగైన ప్రదర్శన చేసే ప్రయత్నం చేస్తాం.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.టాస్ గెలిస్తే తాము కూడా ముందుగా బౌలింగ్ చేసేవాళ్లమని ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ తెలిపాడు. 'మేం కూడా ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. పిచ్ చూడటానికి బాగుంది. వికెట్‌లో పెద్దగా మారే అవకాశం లేదు. మేం మెరుగైన లక్ష్యాన్ని నమోదు చేసి.. సన్‌రైజర్స్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేస్తాం. టోర్నీలో ఇది చివరి దశ. కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లు. మేం జట్టు వాతావరణాన్ని తేలికగా ఉంచే ప్రయత్నం చేస్తున్నాం. టోర్నీ ఆరంభంలో ఈ విషయాలు మాట్లాడుకోలేదు. మెరుగైన ప్రదర్శన చేశాం. అదే మైండ్‌సెట్‌తో అప్‌కమింగ్ మ్యాచ్‌లు గెలవాలనుకుంటున్నాం. మాపై ఒత్తిడి లేకుండా చూసుకుంటాం. మూమెంటమ్‌ను కొనసాగించడం కీలకం. ఉత్కంఠ మ్యాచ్‌లు ఆడాలనుంది. ఇలాంటి మ్యాచ్‌లు ఓడినా.. భారీ తేడాతో ఓడిపోం. ఎలాంటి మార్పులు లేకుండా సేమ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతున్నాం. సన్‌రైజర్స్ హైదరాబాద్: అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(కీపర్), సచిన్ బేబీ, హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, పాట్ కమిన్స్(కెప్టెన్), హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్, జీషన్ అన్సారీ, ఎషాన్ మలింగఢిల్లీ క్యాపిటల్స్: ఫాఫ్ డు ప్లెసిస్, అభిషేక్ పోరెల్, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, ట్రిస్టన్ స్టబ్స్, విప్రజ్ నిగమ్, మిచెల్ స్టార్క్, దుష్మంత చమీరా, కుల్దీప్ యాదవ్, టీ నటరాజన్

# విశ్వజ



# మహిళల్లో ఫ్యాటీ లివర్ సమస్య

ముఖ్యంగా మహిళల్లో ఫ్యాటీ లివర్ కేసులు పెరుగుతున్నాయి. ఫ్యాటీ లివర్ తోపాటు లివర్ సిర్రోసిస్, లివర్ ఇన్ఫెక్షన్, లివర్ ఫెయిల్యూర్ వంటి అనేక సమస్యలు కూడా ప్రస్తుతం మహిళలను ఇబ్బంది పెడుతున్నాయి. అయితే ఈ ఫ్యాటీ లివర్ సమస్య వచ్చినప్పుడు కచ్చితంగా కొన్ని లక్షణాలు కనబడతాయి. ఆ లక్షణాలు కనబడితే మహిళలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. తక్షణం వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. బాగా అలసిపోతున్నారా? మరి ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారికి కనిపించే లక్షణాలు ఏమిటో తెలుసుకుందాం. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడేవారు చిన్న చిన్న పనులకే అలసిపోతారు. చిన్న పని చేసినా అలసిపోయినట్టుగా భావిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. ఇది ఫ్యాటీ లివర్ సమస్యకు సంకేతం కావచ్చు. ఈ లక్షణాలు ఉంటే ఫ్యాటీ లివర్ ఉన్నట్టే ఎవరైతే ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడతారో సరిగ్గా భోజనం చేయరు. కడుపులో వికారం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొన్ని కొన్ని సార్లు వాంతులు అవడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. విపరీతంగా కాళ్ల వాపులు వస్తాయి. శరీరంలో టాక్సిన్స్ పేరుకుపోవడం వల్ల శరీర అవయవాలలో నీరు చేరి కాళ్లు , పాదాలు వాపుకు గురవుతాయి. ఈ లక్షణాలు కూడా ఫ్యాటీ లివర్ తోనే వస్తాయి. శరీరంలో ఈ మార్పులు ఫ్యాటీ లివర్ సంకేతాలు ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడేవారి మూత్రం రంగు మారుతుంది. తరచుగా మూత్రం పసుపు రంగులో కనిపిస్తే కచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. ఫ్యాటీ లివర్ సమస్య ఉంటే కడుపుకు దిగువ భాగంలో భరించలేని విధంగా నొప్పి ఉంటుంది. ఎవరైతే ఈ నొప్పితో బాధపడతారో వారు వైద్యుడిని సంప్రదించాలి. తగిన పరీక్షలు చేయించుకోవాలి. ఇక చర్మసమస్యలు, కాళ్లు, చేతుల సమస్యలు, నొప్పులు ఉంటే కూడా ఫ్యాటీ లివర్ సమస్య అయ్యే అవకాశం లేకపోలేదు. పచ్చకామెర్లు, ఈ సమస్యలు ఫ్యాటీ లివర్ తోనే కళ్ళు, చర్మం పచ్చ రంగులోకి మారడం, పచ్చకామెర్లు లక్షణాలు కనిపించడం కూడా ఫ్యాటీ లివర్ సంకేతాలు. అంతేకాదు చేతి గోళ్ళు, కాళ్ళ గోళ్ళు రంగు మారడం, గోళ్ళ మీద తెలుపు, పసుపు రంగులో మచ్చలు రావడం, ఒళ్ళు నొప్పులు, నడిచేటప్పుడు అసౌకర్యం కలగడం ఫ్యాటీ లివర్ సమస్యతోనే వచ్చి ఉండవచ్చు. కనుక పైన పేర్కొన్న లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి లివర్ ఆరోగ్యాన్ని కచ్చితంగా చెక్ చేయించుకోవాలి.

# డయాబెటిస్ మూత్రపిండాలను దెబ్బతీస్తుందా.. ఇది ప్రాణాలకే ప్రమాదమా?



డయాబెటిస్ (మధుమేహం) నేడు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేస్తున్న దీర్ఘకాలిక వ్యాధి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండటం వలన సంభవిస్తుంది. డయాబెటిస్ మూత్రపిండాల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ రెండింటి మధ్య అవినాభావ సంబంధం ఉంది.. శరీరంలోని అద్భుత వడపోత వ్యవస్థ మూత్రపిండాలు: మూత్రపిండాలు మన శరీరంలో చాలా ముఖ్యమైన అవయవాలు. ఇవి రక్తాన్ని శుద్ధి చేసి, వ్యర్థ పదార్థాలను, అదనపు ద్రవాలను మూత్రం ద్వారా బయటకు పంపుతాయి. అంతేకాకుండా, ఇవి రక్తపోటును నియంత్రించడంలో, ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని ప్రేరేపించడంలో, ఎముకల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. డయాబెటిస్ మూత్రపిండాలను ఎలా దెబ్బతీస్తుంది? డయాబెటిస్ ఉన్నవారిలో అధిక రక్త చక్కెర స్థాయిలు కాలక్రమేణా మూత్రపిండాలలోని చిన్న రక్తనాళాలను దెబ్బతీస్తాయి. దీనిని 'డయాబెటిక్ నెఫ్రోపతీ' అంటారు. ఈ రక్తనాళాలు దెబ్బతినడం వలన మూత్రపిండాలు రక్తాన్ని సరిగ్గా వడపోయలేవు. ఫలితంగా, వ్యర్థ పదార్థాలు, విషపదార్థాలు శరీరంలో పేరుకుపోతాయి. ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది. డయాబెటిక్ నెఫ్రోపతీ: నిశ్శబ్ద హంతకుడు డయాబెటిక్ నెఫ్రోపతీ చాలా నెమ్మదిగా ముదిరే వ్యాధి. ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే దీనిని 'నిశ్శబ్ద హంతకుడు' అని కూడా అంటారు. వ్యాధి ముదిరే కొద్దీ కాళ్ల వాపు, అధిక రక్తపోటు, మూత్రంలో ప్రోటీన్, తరచుగా మూత్రవిసర్జన, అలసట, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎలా? డయాబెటిస్ ఉన్నవారు తమ మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవడం: మందులు, ఆహార నియమాలు, వ్యాయామం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవాలి. అధిక రక్తపోటు మూత్రపిండాల వ్యాధిని మరింత వేగంగా ముదిరేలా చేస్తుంది. కాబట్టి, రక్తపోటును 130/80 %ఎఎన్హ్ర% కంటే తక్కువగా ఉంచుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం: పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, తక్కువ కొవ్వు ఉండే పాల ఉత్పత్తులు, లీన్ ప్రోటీన్ వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలను పరిమితం చేయాలి. అంతే కాకుండా వారానికి కనీసం 150 నిమిషాల పాటు మితమైన వ్యాయామం చేయాలి.ధూమపానం, మద్యపానం మూత్రపిండాల వ్యాధిని మరింత తీవ్రతరం చేస్తాయి. మూత్రపిండాల పనితీరును తెలుసుకోవడానికి క్రమం తప్పకుండా రక్త, మూత్ర పరీక్షలు చేయించుకోవాలి. డయాబెటిస్ ,మూత్రపిండాల ఆరోగ్యం ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారు తమ మూత్రపిండాలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. సరైన జీవనశైలి మార్పులు, క్రమబద్ధమైన వైద్య పరీక్షల ద్వారా మూత్రపిండాల వ్యాధిని నివారించవచ్చు లేదా ముదరకుండా చూసుకోవచ్చు.

## నిద్ర పట్టట్లేదా? హాయైన నిద్ర కోసం

# ఈ హెర్బల్ టీలను తాగండి!



ప్రస్తుత సమాజంలో చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. అయితే ఎవరైతే నిద్ర సరిగ్గా పోరో వారి ఆరోగ్యం పాడవుతుంది. వారు చురుగ్గా పనిచేసుకోలేరు. ఎక్కువకాలం నిద్రలేమి సమస్య కొనసాగితే ఆరోగ్యానికి చేటు జరుగుతుంది. కాబట్టి ఇటువంటి వారికి నిద్ర పట్టడం కోసం కొన్ని హెర్బల్ టీ లు ఎంతగానో సహకరిస్తున్నాయి. మరి వాటిని గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ఈ టీ తాగితే హాయిగా నిద్ర పడుతుంది సాధారణంగా నిద్రపోకుండా ఉండాలంటే టీ తాగుతారు. అయితే మంచి నిద్ర పోవడానికి కూడా కొన్ని రకాల టీలు ఉపయోగపడతాయి. ఇవి మన మానసిక ఆందోళనను తగ్గించి, ఒత్తిడిని తగ్గించి మనకు బాగా నిద్ర పట్టేందుకు దోహదం చేస్తాయి. ప్రశాంతతను కలిగించి నిద్రను మెరుగుపరుస్తాయి. ఇక అటువంటి టీలలో గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీతో హాయిగా నిద్ర గ్రీన్ టీ లో ఎల్ థియనైన్ అనే అమైనో యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. గ్రీన్ టీ తాగినప్పుడు చాలా హాయిగా అనిపించి నిద్ర పడుతుంది. అయితే కెఫీన్ తక్కువగా ఉండే గ్రీన్ టీ రకాన్ని ఎంచుకొని తాగడం ఎంతో మంచిది. ఇక మనకు నిద్ర బాగా పట్టడానికి ఉపయోగపడే టీ లలో చామంతి టీ ఒకటి. చమోమైల్ టీ, లావెండర్ టీ తో హాయిగా నిద్ర ఈ చామంతి టీ ని తాగడం వల్ల కూడా ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. చమోమైల్ టీలో ఉండే ఫ్లేవర్స్ శరీరానికి హాయిని ఇస్తాయి ఇది నాణ్యమైన నిద్ర పట్టడానికి ప్రతి ఒక్కరికి సహకరిస్తుంది. ఇక ప్రశాంతమైన నిద్రపోవడానికి లావెండర్ టీ కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనివల్ల మన నిద్రలో నాణ్యత పెరుగుతుంది. ఈ టీ తాగినట్లయితే మన శరీరం చాలా రిలాక్స్ అవుతుంది. ఆందోళన తగ్గుతుంది. గిన్ సెంగ్ టీ గిన్ సెంగ్ టీ.. ఈ టీలో అడాప్టేజన్ కాంపౌండ్స్ ఎక్కువగా ఉంటాయి.. ఇవి మన శరీరంలో హార్మోన్ల అసమతుల్యతను తగ్గిస్తాయి. ఇవి మనం ప్రశాంతంగా నిద్రపోవడానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ గిన్ సెంగ్ టీ బ్యాగులు మార్కెట్లో బాగానే లభ్యమవుతున్నాయి. త్వరలో నక్కతోక తొక్కి సంపన్నులయ్యే రాశులు వీరే.. రాసి పెట్టుకోమన్న రాహువు! వలెరియన్ మొక్క వేరుతో చేసిన టీ ఇక మనకు ప్రశాంతంగా నిద్ర పట్టించే టీ లలో వలేరియన్ మొక్క వేరుతో చేసే టీ ఒకటి. వలేరియన్ మొక్క వేరులో చాలా ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి నిద్రలేమి సమస్యను తగ్గిస్తాయి. ఈ టీ తాగడం వల్ల నిద్ర మెరుగుగా పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి నాణ్యమైన నిద్రకు ఈ టీ ఎంతగానో సహకరిస్తుంది.

## మందార పూల టీ తాగితే మీ ఆరోగ్యంలో జరిగేవి అద్భుతాలే.. ట్రై చెయ్యండి!

ఇటీవల కాలంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. ముఖ్యంగా ఉదయం పూట టీ తాగే విషయంలో చాలామంది తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తేయాకుతో తయారుచేసిన టీ కి బదులు శంఖు పూల టీ, మందార పూల టీ, తులసి ఆకుల తో టీ, గ్రీన్ టీ, బ్లూ టీ, లెమన్ టీ ఇలా రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. మందార పువ్వులలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ప్రస్తుతం మనం మందార పూలతో తయారుచేసే టీ లో ఉండే ఆరోగ్య ప్రయోజనాలను గురించి తెలుసుకుందాం. మందార చెట్టు రకరకాల రంగులతో రకరకాల సైజులలో పూస్తుంది. మందార పువ్వులలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. మందార పువ్వులలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంవల్ల ఇది మన శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. %ూశ్రీంశీ =ఘుఎ% రేపటినుండి ఈ రాశులవారికి జాక్ పాట్.. వెలిగిపోతారన్న సూర్యుడు మందార పూల టీతో యవ్వనంగా మందార పూల టీ తాగితే మన చర్మం వృద్ధాప్య సంకేతాలను ఇది తగ్గిస్తుంది. శరీరాన్ని డిహైడ్రేడ్ కాకుండా మందార పూల టీ కాపాడుతుంది. మందార పూల టీ ని తాగడం వల్ల మన శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బరువు కూడా తగ్గుతారు. ఇక మందార పూల టీని తయారు చేసే విధానానికి వచ్చినట్లయితే మందార పువ్వులను బాగా ఎండబెట్టి ఆ ఎండిన పూలను పక్కన పెట్టుకోవాలి. మందార పూల టీ తో బరువుకు చెక్ నీటిని బాగా మరగపెట్టి అందులో ఎండిన మందార పూలను వేసి మరిగించాలి. ఇక మందార పువ్వుల టీ ని తయారు చేయడానికి ఎండిన పువ్వులనైనా, తాజాగా ఉన్న పువ్వులనైనా వాడవచ్చు. ఈ పూల టీని తాగితే బరువు కూడా తగ్గుతారని ఎన్నో అధ్యాయాలు ఇప్పటికే వెల్లడించాయి. దీనిని ఒక హెర్బల్ టీ గా చెప్తారు. ఈ టీతో అధిక రక్తపోటు సమస్య తగ్గుతుంది. మందార పూల టీ తో డయాబెటిస్, బీపీ కంట్రోల్ మందార పూల టీతో శరీరంలో చెడు కొలెస్ట్రాల్ సమస్య తగ్గుతుంది.

# మార్కెట్

## బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు!



న్యూఢిల్లీ : బీమా ప్రీమియం చెల్లింపుదారులకు త్వరలో ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీమా ప్రీమియం వసూళ్లపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించే విషయంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై బీమా నియంత్రణ మండలి ఐఆర్డీఏఐ సూచనలు చేయాలని జీఎస్టీ కౌన్సిల్ ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఈ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. మే, జూన్ నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంకాబోతున్నది. ప్రస్తుతం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని తగ్గించాలనే ప్రతిపాదనపై గత కొన్నేండ్లుగా చర్చలు జరుగుతున్నప్పటికీ ఇంకా కొలిక్కిరాలేదు. ఈ సారి కొలిక్కిరానున్నట్లు, ఎంతమేర తగ్గించేదానిపై చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వవర్గాలు సూచనప్రా యంగా వెల్లడించాయి. ప్రీమి యం వసూళ్లపై జీఎస్టీని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. కానీ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీమా రంగ ప్రతినిధులు కలుసుకొని 12 శాతం విధించాలని సూచించారంట. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా 5 శాతం విధించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఐఆర్డీఏఐ..బీమా రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నది. త్వరలో జీఎస్టీ కౌన్సిల్‌కు ఒక నివేదికను సమర్పించనున్నది.

# మళ్లీ అమ్మకానికి ఎల్ఐసీ వాటా

**3 శాతం వరకు విక్రయించే యోచనలో కేంద్రం**

**రెండేండ్లలో 10 శాతం సేల్ లక్ష్యం**




న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)లో మరింత వాటాలను అమ్మేందుకు మోదీ సర్కారు సిద్ధమవుతున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో మార్కెట్ పరిస్థితులనుబట్టి 2 నుంచి 3 శాతం వాటాలను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. అంటే స్టాక్ మార్కెట్లు నష్టాల్లో నడిస్తే తక్కువగా, లాభాల్లో పరుగులు పెడితే ఎక్కువగా ఎల్ఐసీ నుంచి ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణలు ఉంటాయన్నమాట. 2027కల్లా 10 శాతం..రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి పెద్దమొత్తంలో కాకుండా కొద్దికొద్దిగానైనా ఎక్కువసార్లు వాటాలను అమ్మకానికి పెట్టి వీలున్నంత గరిష్ఠంగా సొమ్ము చేసుకోవాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇక 2027 మే 16కల్లా ఎల్ఐసీలో 10 శాతం వాటాను ఎట్టి పరిస్థితుల్లోనైనా అమ్మేయాలని కేంద్రం భావిస్తున్నది. స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ మినిమం పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనల్ని అందుకోవాలంటే ఇది తప్పనిసరి. 2022 మే నెలలో ఎల్ఐసీలో 3.5 శాతం వాటాను ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా కేంద్రం అమ్మేసిన విషయం తెలిసిందే. తద్వారా రూ.21,000 కోట్లను ఖజానాకు తరలించగా, దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఎల్ఐసీ అడుగు పెట్టింది. అయితే మినిమం పబ్లిక్ షేర్‌హోల్డింగ్ రూల్స్‌ను కంపెనీ పాటించలేపోతున్నది. ఈ నేపథ్యంలోనే మూడేండ్ల గడువు లభించింది. ఇది 2027 మే 16తో ముగియనున్నది. ఈలోపు ఎల్ఐసీలో 10 శాతం ప్రభుత్వ వాటాలను అమ్మాలని చూస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏప్రిల్‌తో మొదలయ్యే ఏడాదిలో 3 శాతం మేర వాటాలను విక్రయించాలని చూస్తున్నారు. మరికొన్నింటిలో.. వచ్చే మూడేండ్లకుపైగా కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రణాళికలో భాగంగా ఎల్ఐసీతోపాటు పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోనూ వాటాలను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఆయా కంపెనీల జాబితాను కూడా సిద్ధంగా ఉంచినట్టు చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఇందుకోసం మర్చంట్ బ్యాంకర్లు, లీగల్ అడ్వైజర్ల సహాయార్థం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) దరఖాస్తులను ఆహ్వానించింది.

**నష్టాల్లో ఎల్ఐసీ షేర్లు**

గడిచిన ఏడాదికిపైగా కాలంలో ఎల్ఐసీ షేర్ విలువ 23.29 శాతం క్షీణించడం గమనార్హం. గత ఆరు నెలల్నే తీసుకుంటే 26.66 శాతం పతనం కనిపిస్తున్నది. ఈ నెల రోజుల్లోనే 3.37 శాతం పడిపోయింది. దీంతో ఎల్ఐసీ షేర్లలో పెట్టుబడులు పెట్టిన మదుపరులకు నష్టాలే మిగులుతున్నట్టవుతున్నది. నిజానికి దేశంలోనే అతిపెద్ద సంస్థాగత మదుపరి ఎల్ఐసీ. వందలాది కంపెనీల్లో ఎల్ఐసీకి వాటాలున్నాయి. అయితే స్టాక్ మార్కెట్లు గతకొద్ది నెలలుగా నేలచూపుల్నే చూస్తుండటంతో ఈ వాటాలు కాస్తా ఆవిరైపోతున్నాయి. భారీ ఎత్తునే నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తున్నది. దాంతో స్టాక్ మార్కెట్ల వల్ల అటు బయటి కంపెనీల్లో పెట్టుబడులు, ఇటు సొంతంగా షేర్లు దిగజారిపోతుండటం.. ఎల్ఐసీ పాలసీదారులనూ కలవరపెడుతున్నదిప్పుడు.ఖ

# తమిళనాడు మత్స్యకారులకు రక్షణ ఇవ్వాలి

### ఇరు దేశాలు ఈ సమస్యపై పరస్పరం చర్చించాలి

### ఎక్స్‌లో పోస్ట్ చేసిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



అమరావతి : భారత మత్స్యకారుల విషయంలో శ్రీలంక ఉదారంగా ఉండాలని, సమస్యలు ఉంటే ఇరు దేశాలు కలిసి చర్చించాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇటీవల బంగాళాఖాతంలో జరిగిన ఐదు వేర్వేరు సంఘటనలలో తమిళనాడుకు చెందిన 24 మంది భారతీయ మత్స్యకారులకు సంబంధించిన సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. భారతదేశం, శ్రీలంక ప్రభుత్వాలు పరస్పర సహకార స్ఫూర్తితో ఈ సమస్యలను పరిష్కరించడానికి నిర్మాణాత్మక చర్చలు చేయడం అత్యవసరమని భావిస్తున్నట్లు- డిప్యూటీ- సీఎం అన్నారు. ఇరువైపులా మత్స్యకారుల భద్రత, గౌరవాన్ని నిలబెట్టడానికి నిరంతర ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నాగపట్నం జిల్లాకు చెందిన ఈ మత్స్యకారులు సముద్రంలో జరిగిన ఘర్షణల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గాయపడ్డారని తెలుసుకోవడం బాధాకరం, భారతదేశం.. శ్రీలంక మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా, పునరావృతమయ్యే ఈ సంఘటనలను గమనించి, ఈ పునరావృత పరిస్థితులను స్నేహపూర్వకంగా పరిష్కరించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరుతున్నానని పోస్టు చేశారు. కాగా రాజధాని అమరావతి ప్రపంచస్థాయి, సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుంది. కేవలం ఆర్కిటెక్చర్, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా... జవాబుదారీతనానికి, న్యాయానికి, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ కలిసి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతారు. మన యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు, జగన్ హయాంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావిస్తూ ఉద్వేగంగా ప్రసంగించారు. అప్పట్లో దివి సీమ తుఫాను వచ్చి అందరి ఆశలు తుడిచిపెట్టినట్లు-... గత ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టింది. అమరావతి అంటే పరదాలు, సెక్షన్ 30, సెక్షన్ 144 మాత్రమే గుర్తుకు వచ్చేలా చేసింది. రాజధాని కోసం 34వేల ఎకరాలు ఇచ్చిన 29వేల పైచిలుకు రైతులు గత ఐదేళ్లు నలిగిపోయారు. రోడ్ల మీదకు వచ్చారు. ముళ్ల కంచెల మధ్య కూర్చున్నారు. లాఠీ దెబ్బలు తిన్నారు. కేసులు ఎదుర్కొన్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి సమయంలో... తమ కన్నీళ్లు తుడిచే వారు ఉన్నారా... మా కష్టాలు ప్రధాని మోదీకి తెలుస్తాయా అని నన్ను అప్పట్లో అడిగారు. మోదీకి తెలియకుండా ఏదీ ఉండదు... అమరావతే శాశ్వత రాజధానిగా ఉంటు-ందని ఆనాడే మాట ఇచ్చాం. గత ప్రభుత్వం ఈ త్యాగాన్ని అవమానించిందని పవన్ కల్యాణ్ అన్నారు.

# కాకాణి మైనింగ్ దోపిడీ అందరికీ తెలుసు

### అక్రమాలు చేయకుంటే ఎందుకు పరారయ్యారు

### ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర విమర్శలు

నెల్లూరు : వైసీపీ హయాంలో జరిగిన మైనింగ్ దోపిడీలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాత్ర గురించి అందరికీ తెలుసు అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర విమర్శించారు. అక్రమాలు చేయనప్పుడు ఎందుకు పరారయ్యారని, బయటకు వచ్చి తాను నిజాయితీ పరుడునని చెప్పుకోవచ్చు కదా? అని అన్నారు. కేసులకు భయపడే కాకాణి పరారయ్యారని ఎద్దేవా చేశారు. అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కూడా త్వరలో అరెస్ట్ కాబోతున్నాడని ఎమ్మెల్సీ బీదా తెలిపారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ ఇప్పటి వరకూ ఎక్కడ ఉన్నారో తెలియదు. ఇప్పుడు బయటకు వచ్చి మాజీ మంత్రి కాకాణి పైన కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని మాట్లాడుతున్నారు. వైసీపీ హయాంలో జరిగిన మైనింగ్ దోపిడీ అందులో కాకాణి పాత్ర గురించి అందరికీ తెలుసు. అక్రమ మైనింగ్ వ్యతిరేకంగా సోమిరెడ్డి నిరసన దీక్ష చేపడితే ఆయనపై హిజ్రాలతో దాడి చేసిన ప్రయత్నాలు అందరికీ తెలుసు. వీడియో సాక్ష్యాలు కూడా ఉన్నాయి. రుస్తుం మైన్స్ లో కాకాణి అక్రమ తవ్వకాలు చేయించారు. అక్రమాలు చేయనప్పుడు ఎందుకు పరారయ్యారు. బయటకు వచ్చి తాను నిజాయితీపరుడునని చెప్పుకోవచ్చు కదా. కేసులకు భయపడే కాకాణి పరారయ్యారు' అని ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర అన్నారు. ఎంపీ వేమిరెడ్డి రాజకీయాల్లోకి రాకముందు నుంచే ఆయనకు అధికారికంగా మైన్స్ ఉన్నాయి. గూడూరు సైదాపురం ప్రాంతాల్లో మాజీ మంత్రి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కూడా అక్రమ మైనింగ్ జరిగింది. అక్రమ మైనింగ్ కేసులో తొందరలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కూడా అరెస్ట్ కాబోతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుంటు-ండటంతో మాజీ మంత్రి అనిల్ కుమార్ ఇప్పుడు బయటకు వచ్చి కూటమి ప్రభుత్వంపై మీద విమర్శలు చేస్తున్నారు' అని ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర ఫైర్ అయ్యారు.

# పెన్షన్ల పంపిణీలో అన్ని జాగ్రత్తలు: మంత్రి

అమరావతి : పింఛను పంపిణీలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు- ఏపీ సమాచారశాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛను అందించే బాధ్యత అధికారులదేనని చెప్పారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల పంపిణీలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అకాల వర్షాలు, పంట నష్టంపై సీఎం సమీక్ష నిర్వహించారని, కొన్ని చోట్ల ధాన్యం తడిసినట్లు- కలెక్టర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఏ రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధాన్యం ఎలా ఉన్నా ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేస్తుంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని పార్థసారథి తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి నాదెళ్ల

### ఉమ్మడి కృష్ణా జిల్లాలో భారీగా నష్టం

### అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

విజయవాడ : అకాల వర్షాలకు కల్లాలలో తడిసిపోయిన ధాన్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. సోమవారం ఆయన పెద్దాపురం మండలం జే తిమ్మాపురం గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కల్లాలలో తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వరి కోతలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అకాల వర్షాల వల్ల జరిగిన నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అకాల వర్షాల గురించి, కల్లాలలో తడిసిపోయిన ధాన్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ , కుడా చైర్మన్ తుమ్మల బాబు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం నాయక్, వ్యవసాయ శాఖ జే డి ఎన్ విజయ్ కుమార్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలావుంటే అకాల వర్షాలు ఏపీలోని పలు ప్రాంతాల్లో చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేశాయి.. ఈదురుగాలులతో మొదలైన వర్షం.. గంటన్నరపాటు బీభత్సం సృష్టించింది..ఆదివారం కురిసిన అకాల వర్షం.. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పంటలకు పట్టిన పూట పగిలినట్టయ్యింది. చేతికి వచ్చే పరిస్థితిలో ఉన్న పంటలు ఒక్కసారిగా వానకు గురై రైతుల కలలను కరిగింపజేశాయి. మొక్కజొన్న, మామిడి, వరి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. పంటలను ఎండబెట్టి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రైతుల ఆశలపై వర్షం నీళు చల్లింది. కల్లంలో కాట వేసిన ధాన్యాన్ని అధికారులు ఇప్పటివరకు తీసుకోకపోవడంతో, ఆ ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఇప్పటికే నష్టపోయిన రైతులకు ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని మరోచోటికి తరలించే ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు, కూలీల వ్యయాలు కూడా భారంగా మారాయి. ఇప్పటి వరకూ ఒక్క అధికారి కూడా వచ్చి మా పరిస్థితి చూడలేదు.. మా దయనీయం ఆయన పరిస్థితిని చూసి ప్రభుత్వం మమల్ని ఆదుకోవాలి అని రైతులు వేడుకుంటున్నారు..వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని స్థానిక నేతలు అంటున్నారు. కళ్లాల్లో, పొలాల్లో రైతులవద్దనున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు చోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించడంలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు అకాల వర్షాలవల్ల మరింతగా నష్టపోతున్నారు. యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలి.

# కౌలు రైతుల వరం అన్నదాత సుఖీభవ పథకం

### విధివిధానాలతో పాటు..అర్హుల గుర్తింపు ప్రక్రియ

### ఈనెలలోనే ప్రారంభించేలా ప్రభుత్వం కసరత్తు

అమరావతి : అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ఎపి లోని కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. కౌలు రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే ఈ పథకం ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దీనిని అమలు చేయబోతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది.. ఇప్పటికే పలు హామీలను అమలు చేస్తుండగా.. మే నెలలో మరో రెండు పథకాలను నెరవేర్చేందుకు సిద్ధమైంది. వీటిలో ముఖ్యమైనది అన్నదాత సుఖీభవ పథకం. దీనికింద ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున సాయం అందజేయనుంది. ఈ పథకాన్ని సొంత భూమి లేని కౌలు రైతులకు కూడా అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వం అందించే రూ.20 వేలను.. మూడు విడతల్లో ఇస్తారు. ఈ రూ. 20 వేలల్లో పిఎం కిసాన్ పథకం కింద వచ్చే పథకం కింద ఇచ్చే రూ.6 వేలు కూడా కలుపుతారు. అటవీ భూములపై హక్కులు ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకానికి సంబంధించి వ్యవసాయశాఖ అధికారులు రైతుల వివరాలను పరిశీలించి, అర్హుల జాబితాను తయారు చేస్తారు. ఈ నెల 20వ తేదీలోగా ఈ జాబితాను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. పూర్తి వివరాలు సేకరించిన తరవాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభించేందుకు సిద్దగా ఉన్నారు. ఈ పథకం అమలుకు సంబంధించి వ్యవసాయశాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. కాగా ఇప్పటికే మరణించిన లబ్ధిదారుల పేర్లను తొలగించడం, భూ రికార్డులకు అనుగుణంగా లబ్ధిదారుల నమోదు, రైతుల ఐడీ నంబర్లు, పెండింగ్‌లో ఉన్న ఆధార్, ఈకేవైసీ వివరాల సవరణ వంటి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. అటవీ హక్కుల చట్టం కింద హక్కులు పొందిన గిరిజనులకు, అలాగే ప్రత్యేకంగా గుర్తించబడిన అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలకు చెందిన అర్హుల ఎంపిక కోసం గిరిజన శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించింది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తులకు ఈ పథకం వర్తించదు. ప్రస్తుత, మాజీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, శాసనసభ్యులు, మంత్రులు, శాసనమండలి సభ్యులు, మేయర్లు, జడ్పీ చైర్‌పర్సన్లు వంటి రాజ్యాంగ బద్ధ పదవులను నిర్వహిస్తున్నవారు, నిర్వహించినవారు అర్హులు కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మంత్రిత్వ శాఖలు, శాఖల కార్యాలయాల్లో, ప్రభుత్వ రంగ సంస్థలలో, స్థానిక సంస్థలలో శాశ్వత ఉద్యోగంగా పని చేస్తున్నవారు కూడా ఈ పథకం కింద సాయం పొందడానికి అనర్హులు. అలాగే నెలకు రూ.10 వేలు లేదా అంతకన్నా ఎక్కువ పెన్షన్ తీసుకునే వారికి కూడా పథకం వర్తించదు. అయితే, మల్టీటాస్కింగ్ స్టాఫ్, క్లాస్-4, గ్రూప్-డి ఉద్యోగులకు మాత్రం మినహాయింపు ఉంది. వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, ఛార్టెడ్ అకౌంటెంట్లు-, ఆర్కిటెక్టులు, అలాగే ఇతర నమోదిత వృత్తి నిపుణులకూ ఈ పథకం వర్తించదని నిబంధనలు చెబుతున్నాయి. ప్రధానంగా కౌలు రైతులకు మేలు చేసేలా దీనిని రూపొందించారు.

# ఐపిఎస్ అధికారి పిఎస్సార్ అరెస్ట్ పెద్ద తప్పిదం

### అధికారులను ఇలా కేసుల్లో ఇరికించడం సరికాదు

### ముంబై నటి జెత్వానీ కేసు అక్కడే తేల్చాలి

### మీడియాతో మాజీ ఎంపి ఉండవల్ల అరుణ్ కుమార్

రాజమండ్రి : సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టుపై సీనియర్ రాజకీయ నేత, రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీనియర్ ఐపీఎస్ అధికారి ఆంజనేయులు అరెస్టు చాలా పెద్ద తప్పు అని అభిప్రాయపడ్డారు.. రాజమండ్రిలో ఉండవల్లి అరుణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం విజయవాడ జైలుకు వెళ్లి పీఎస్ఆర్ ను కలిసి వచ్చానని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పీఎస్ఆర్ పై కక్ష సాధిస్తోందని ఆరోపించారు. ముంబై నటి తనను రేప్ చేశారని ఫిర్యాదు ఇచ్చిందని , ముంబైలో ఆ కేసు పరిష్కారం కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో విచారణ ఎలా ప్రారంభిస్తారు? అని ప్రశ్నించారు. పీఎస్ఆర్ అరెస్ట్ పోలీస్ శాఖపై చాలా ప్రభావం చూపుతుందని వ్యాఖ్యానించారు. తాను మరి కొంతకాలం జైల్లో ఉండడానికి సిద్ధంగా ఉన్నానని పీఎస్ఆర్ నాతో చెప్పారని అన్నారు. ఈ కేసు కు సంబంధించి ముంబైలో పూర్తి సమాచారాన్ని సేకరించి త్వరలో మరోసారి మీడియా ముందుకు వస్తానని ఉండవల్లి అరుణ్ కుమార్ వెల్లడించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వగానే కక్ష సాధింపు చర్యలు వద్దని గతంలోనే చెప్పానని ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. జగన్ తప్పు చేస్తే జగన్‌ని జైలులో పెట్టాలని చెప్పారు. పోలీసులను జైల్లో పెట్టవద్దని అన్నారు. చాలా మంది ఐపీఎస్, ఐఏఎస్‌లు తనకు స్నేహితులుగా ఉన్నారని తెలిపారు. అందులో పీఎస్ఆర్ ఆంజనేయులు ఒకరని.. ఆంజనేయులు జైలుకి వెళ్లినప్పుడు చూడటానికి వెళ్లానని అన్నారు. డీజీ స్థాయి అధికారిని జైల్లో పెట్టడం ఇదే తొలిసారని ఉండవల్లి అరుణ్ కుమార్ తెలిపారు. పునర్విభజన చెల్లదని సుప్రీంకోర్టులో పిటీషన్ వేశానని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ గుర్తుచేశారు. పిటీషన్‌లో మార్పు చేసి ఏపీ పునర్విభజన తప్పు అని నిర్ధారించాలని మళ్లీ సుప్రీంకోర్టులో పిటీషన్ వేశానని తెలిపారు. 2014 ఫిబ్రవరి 18వ తేదీన పార్లమెంట్‌లో బిల్లు పాస్ కాకుండానే ఏపీ విభజన చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేయలేదని తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఒక సీనియర్ న్యాయవాదిని ఏర్పాటు-చేసి సుప్రీంకోర్టులో కేసు పాలో అప్ చేయాలని కోరారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కేసుకు ఒక ఆశాజ్యోతి అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. పునర్విభజనలో ఏపీకి జరిగిన అన్యాయంపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి నేటికి 11 ఏళ్లు పూర్తయిందని వెల్లడించారు. పవన్ కల్యాణ్‌కు ఇప్పటికే ఈ విషయంపై లేఖ రాశానని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ అఫిడవిట్ ఫైల్ చేయలేదన్నారు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ ఫైల్ చేసింది.. 43 సార్లు పార్టీ ఇన్ పర్సన్ గా కోర్టుకు హాజరయ్యాను.. ఆంధ్ర నుంచి ఈ విషయం ఎవరూ మాట్లాడరు అని ఆవేదన వ్యక్తం చేశారు.. విభజన చట్టంలో ఆంధ్రా కు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఒక ఆర్డర్ ఇవ్వండని కోర్టును కోరాము...పబ్లిక్ మీటింగ్‌లో మాత్రం ఆంధ్రాకు అన్యాయం జరిగిందని మాట్లాడుతున్నారు.. కానీ ఎక్కడ మాట్లాడాలో అక్కడ ప్రజాప్రతినిధులు మాట్లాడటం లేదని దుయ్యబట్టారు.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక సీనియర్ అడ్వకేట్ ను తీసుకువచ్చి వాదన వినిపించమని చెప్పాలని సూచించారు.. ప్రజాస్వామ్యానికి అతి ప్రధానమైన ఆర్టికల్ 100 లోక్‌సభలో ఏపీ రిఆర్గనైజేషన్ చట్టం చేసే సమయంలో సక్రమంగా అమలు కాలేదన్నారు.. గతంలో పవన్ కల్యాణ్ ఈ కేసుకు సంబంధించి అనుకూలంగా స్పందించారని గుర్తుచేసుకున్నారు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్..ఉగ్రవాదం విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అందరూ సమర్థించాలని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. భారతదేశంతో యుద్ధం చేసే శక్తి పాకిస్తాన్‌కు లేదని చెప్పారు. యుద్ధం జరిగితే పాకిస్తాన్ నష్టపోతుందని అన్నారు. మతం ప్రధానమనేది భారతదేశంలో సరికాదన్నారు. ఇండియాలో 12 శాతం ముస్లింలు ఉన్నారని తెలిపారు. పాకిస్తాన్‌లో హిందువులు ఒక్క శాతం మాత్రమే ఉన్నారని చెప్పారు. ముస్లింలపై వ్యతిరేకత సృష్టించకూడదని.. కానీ పాకిస్తాన్‌ను వ్యతిరేకించాలని అన్నారు. ప్రస్తుత తరుణంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టకూడదని చెప్పారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ప్రపంచ దేశాలన్నీ ఖండిస్తున్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ తెలిపారు.

# కోలుకుంటున్న శ్రీతేజ్


### పరామర్శించిన నిర్మాత అల్లు అర్జున్

హైదరాబాద్ : పుష్ప -2 రిలీజ్ రోజున సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ్ ను అ÷-ల్లు అరవింద్ పరామర్శించారు. కొన్ని నెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం శ్రీతేజ్ కొద్దీ రోజుల క్రితం ఆసుపత్రి నుండి డిశార్చి అయ్యాడు. అయితే శ్రీతేజ్ పూర్తిగా కోలుకునేందుకు మరి కొన్ని నెలలు పడుతుందని డాక్టర్లు వెల్లడించారు. అదే సమయంలో శ్రీతేజ్ ను రీహాబిలిటేషన్ సెంటర్ కు తరలించారు. ఈక్రమంలో సోమవారం శ్రీతేజ్ ను అల్లు అరవింద్ పరామర్శించారు. పునరావస కేంద్రానికి వెళ్లి డాక్టర్లను కలిసి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ 'శ్రీ తేజ్ కోలుకోవటం కోసం మా కుటుంబం అంతా ఎదురుచూస్తోంది. శ్రీతేజ్ రోజురోజుకు కోలుకుంటున్న విషయం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. శ్రీ తేజ్ చికిత్సకు సహకరిస్తున్నారు అని చెప్పారు డాక్టర్లు. ఇప్పటికే రూ. 2 కోట్లు- శ్రీతేజ్ అకౌంట్ లో డిపాజిట్ చేసాడు అల్లు అర్జున్. త్వరలోనే శ్రీ తేజ్ మనందరి మధ్య సాధారణల పిల్లల్లా ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నానని అన్నారు.

# రాయలసీమ గడ్డ...నా అడ్డా

### మా జోలికి వస్తూ ఊరుకునేది లేదు

### పుల అభివృద్ధి పనులు చేపట్టిన బాలకృష్ణ



శ్రీ సత్యసాయి జిల్లా : రాయలసీమ గడ్డ తన అడ్డా అని వైసీపీ నేతలకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గట్టి వార్నింగ్ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ వైసీపీ నేతలను బాలకృష్ణ హెచ్చరించారు. సోమవారం హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హిందూపురం మండలం ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు హిందూపురం అంటే రెండో పుట్టినిల్లుగా భావించేవారని నందమూరి బాలకృష్ణ అన్నారు. టీడీపీ అంటే ఒక జవాబుదారి పార్టీగా పేరుగాంచిందని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు ఒక విజనరీ ఉన్న లీడర్ అని కొనియాడారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే హిందూపురంలో రూ. 50 కోట్ల నిధులతో పనులు చేయించానని గుర్తుచేశారు. హిందూపురంలో శాశ్వత తాగునీటి పథకానికి రూ. 136 కోట్ల నివేదికలు సిద్ధం చేశామని అన్నారు. మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని తెలిపారు. 1984లోనే ఎన్టీఆర్ తూముకుంట వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటు- చేయడం.. హిందూపురం ప్రజలు మర్చి పోలేనిదని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రకమాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్న బాలకృష్ణ.. టేకులోడులోని ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.. ఇందిరమ్మ కాలనీలో గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్వాధీన పత్రాలను మంత్రి అనగానితో కలిసి పంపిణీ చేశారు.. మొత్తం 237 మంది లబ్దిదారులకు స్వాధీన పత్రాలు అందజేశారు.. ఇక, ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. టీ-డీపీ కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. రాయలసీమ గడ్డ.. నా అడ్డా.. అని పేర్కొన్నారు..

# గల్ఫ్‌లో ఉద్యోగం అంటూ..

### ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కే టోకరా

### కన్సల్టెన్సీపై కేసునమోదు చేసిన పోలీసులు

వేములవాడ : ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఓ మహిళ కాల్ చేసిన ఘటన హాట్ టాపిక్ గా మారింది. గల్ఫ్ లో మంచి ఆఫర్ ఉందంటూ ఎమ్మెల్యేకు ఓ కన్సల్టెన్సీ మహిళ ఫోన్ చేసింది. నువ్వు ఎవ్వరికి ఫోన్ చేశావో తెలుసా అంటూ ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యేతో మహిళ వాగ్వాదానికి దిగింది. మహిళ తీరుపై సదరు ఎమ్మెల్యే ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై జగిత్యాల పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. కన్సల్టెన్సీ మహిళ దుబాయ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాల్లో మంచి ఆఫర్స్ ఉన్నాయంటూ పలువురికి ఫోన్ కాల్స్ చేసినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ఎలాంటి లైసెన్స్ లేకుండానే విదేశీ బ్రోకరేజీ కన్సల్టెన్సీగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆఫీస్ సీజ్ చేసి, లక్ష్మీ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీపై కేసు నమోదు చేశారు.



# రామయణ మూవీపై సిఎం ఫడ్ణవీస్ ప్రశంసలు

బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'రామాయణ' సినిమాపై మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రశంసలు కురిపించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత గొప్పది గా నిలిచే చిత్రమని కొనియాడారు. నిర్మాత నమిత్ మల్హోత్రాతో కలిసి ఓ చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకుడు. బీటౌన్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్‌ను వేవ్స్ సమ్మిట్‌లో ప్రదర్శించారు. ఈ సినిమా గురించి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడనవీస్ మాట్లాడుతూ.. 'భారత్‌లో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. మన కళ, నాటక రంగం, సంగీతం చాలా పురాతనమైనవి. వీటికి తాజాగా కొత్త టెక్నాలజీని జోడించాలని అనుకుంటున్నాం. రామాయణ విషయంలో ఇదే జరుగుతోంది. నేను ప్రధానితో కలిసి ఈ సినిమాకు సంబంధించిన సెట్స్‌ను సందర్శించాను. దాని క్వాలిటీ చూసి ఆశ్చర్యపోయాను. కొత్త తరానికి మనం కథలు చెప్పడానికి ఇదే సరైన మార్గం. మీరు తీస్తోన్న సినిమా ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉంటుందని నేను నమ్ముతున్నానని అన్నారు. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్నారు. సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ కనిపించనున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, కెకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. రెండు పార్టులుగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో పార్ట్ విడుదల కానుంది.

# శుభం ఓ మంచి మూవీ...ఆదరించండి

## నటి సమంత ప్రేక్షకులకు విజ్ఞప్తి

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి 'శుభం' చిత్రాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఇందులో సామ్ అతిథి పాత్ర కూడా పోషించారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ మూవీలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక మే 9న విడుదల కానున్న ఈ మూవీ ప్రమోషన్స్ కూడా జోరుగా చేస్తున్నారు. తన హోమ్ బ్యానర్ నుంచి రాబోతున్న ఫస్ట్ మూవీ కావడంతో సమంత కూడా చాలా యాక్టివ్‌గా ప్రమోషనల్ కార్యక్రమాలలో పాల్గొంటు-న్నారు. ఇక రీసెంట్ గా ఈ మూవీకి సంబంధించి వైజాగ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. సమంతతో సహా సినిమాలో నటించిన నటీనటులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామ్ మాట్లాడుతూ.. వైజాగ్ లో ఈవెంట్స్ జరుపుకున్న తన సినిమాలు అన్నీ గుర్తు చేసుకుంది. ఇక్కడ ఈవెంట్ చేసిన ప్రతి సినిమా మంచి విజయం సాధించాయి, 'శుభం' చిత్రాన్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది. మూవీ చూశాక అందరు కూడా చిరు నవ్వుతోనే బయటకు వస్తారని పేర్కొన్నారు. అలాగే దాదాపు ఈ మూవీలో చాలా వరకు కొత్త వారినే తీసుకున్నారు. దీంతో ప్రతి ఒక్క ఈ మూవీ గురించి వారి అనుభూతిని పంచుకున్నారు. ఈ సందర్భంగా హీరో హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ.. ' రాజ్ అండ్ డీకే కారణంగానే ఈ సినిమాలో నటించే అవకాశం దక్కింది. స్టోరీ చెప్పినప్పుడే పడి పడి నవ్వుకున్నాను, హారర్ కామెడీని ఇలా కూడా తియ్యొచ్చా అనుకున్నాను. అండ్ సమంత మామ్ ఐ లవ్ యూ.. మీరు బాగా సపోర్ట్ చేశారు' అని చెప్పగా.. సామ్ నవ్వేసింది. ప్రజంట్ ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.





# నానితో నటించడానికి నో చెప్పిన రష్మిక

హీరోల కెరీర్ విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. దానికి బిగ్ ఎగ్జాంపుల్ హీరో నాని.. ముందు అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేసి 'అష్టాచమ్మా' సినిమాతో తెలుగు ఇండస్ట్రీ లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. కానీ నాని హీరోగా ట్రై చేస్తున్నా సమయంలో చాలా అవమానాలు ఎదుర్కొన్నారట . నువ్వు ఇండస్ట్రీలోకి సెట్ కావు.. నీ ఫేస్ కి అంత సీన్ లేదు ..ఇలా రకరకాలుగా మాట్లాడారట. అంతేకాదు నాని ఇండస్ట్రీలో హీరోగా సెటిల్ అయ్యి, హిట్స్ కొట్టిన తర్వాత కూడా చాలామంది హీరోయిన్లు ఆయన తో నటించాడిని నిరాకరించారట. ఇక ఓ హీరోయిన్ అయితే నానికి ఏకంగా మూడు సార్లు రిజెక్ట్ చేసిందట. ఇంతకి ఆ హీరోయిన్ మరెవరో కాదు..రష్మిక మందన్నా. హా.. నేషనల్ క్రష్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రష్మిక నాని తో మూడుసార్లు సినిమా చేసే అవకాశం దక్కించుకుందట. కానీ మూడు సార్లు ఆమె ఆ సినిమా రిజెక్ట్ చేసిందట. ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియదు కానీ, సోషల్ మీడియాలో ఈ న్యూస్ బాగా వైరల్ అవుతోంది. ఇప్పుడు కనుక చూసుకుంటే నాని రష్మికకు మించిన స్థాయిలోనే క్రేజీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. రీసెంట్‌గా 'హిట్ 3' మూవీతో నాని పేరు ఇండస్ట్రీలో మారుమ్రోగిపోతుంది. ఇది అందరికి సాధ్యం కాదు. కానీ నాని తన ట్యాలెంట్ తో సాదించుకున్నాడు. ఇప్పుడు నాని తో మూవీ అంటే ఏ హీరోయిన్  రిజక్ట్ చేసే ఛాన్స్ కూడా లేదు.






# హరిహర వీరమల్లు షూటింగ్ బిజీలో పవన్ కళ్యాణ్

'హరి హర వీరమల్లు'ను ముగించేందుకు కథానాయకుడు పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. ఆయన -టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే ముగింపు దశకు చేరుకోగా.. ఆఖరి షెడ్యూల్ కోసం పవన్ ఆదివారం సెట్లోకి అడుగు పెట్టారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన సెట్లో దర్శకుడు జ్యోతికృష్ణ నేతృత్వంలో రెండు రోజుల పాటు- ఈ చిత్రీకరణ కొనసాగనుంది. దీనిలో భాగంగా పవన్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరించి.. 6వ తేదీతో సినిమాకి గుమ్మడికాయ కొట్టనున్నారు. ఆ వెంటనే చిత్రబృందం కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. 17వ శతాబ్దం నాటి మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో జరిగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఇందులో నిధి అగర్వాల్ (కఠ ఆగశసూశ) కథానాయికగా నటిస్తుండగా.. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఛాయాగ్రహణం: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్. నిర్మాత: ఎ.దయాకర్ రావు, సమర్పణ: ఎ.ఎం.రత్నం.

# ఊరమాస్ లుక్‌లో సుహాస్

నటుడు సుహాస్ ఈ నడుమ మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. తాజాగా ఆయన నటిస్తున్న మూవీ మండాడి. కోలీవుడ్ నటుడు సూరితో కలిసి ఈ సినిమా చేస్తున్నాడు. తమిళ డైరెక్టర్ మతిమారన్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. తాజాగా మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో సుహాస్ ఊరమాస్ లుక్ లో వైల్డ్ గా కనిపిస్తున్నాడు. గడ్డం, పొడవాటి జుట్టు-తో రగ్డ్ లుక్ లో ఉన్నాడు. పైగా టీ-షర్టు, లుంగీలో కనిపిస్తున్నాడు. ఇది విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్నట్టు- తెలుస్తోంది. టీ-షర్టు మీద టీ- సునామీ రైడర్స్ అని రాసి ఉంది. ఇదేదో కబడ్డి ఆట నేపథ్యంలో సాగుతున్నట్టు- ఉంది. ఇంకో పోస్టర్ లో సూరి, సుహాస్ సముద్రంపై పడవల్లో సీరియస్ లుక్ లో కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్ ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. సుహాస్ ఇలాంటి సీరియస్ లుక్ లో ఇప్పటి వరకు కనిపించలేదు. ఇంత రగ్డ్ లుక్ తో కనిపిస్తుండటంతో ఈ మూవీపై ఒక్కసారిగా హైప్ పెరుగుతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా గురించి టాలీవుడ్ లో పెద్దగా తెలియదు. కానీ ఈ ఒక్క పోస్టర్ తోనే టాలీవుడ్ అ-టె-న్షన్ మొత్తం తనవైపు మళ్లించుకున్నాడు సుహాస్. మంచి కథలు ఎంచుకునే ఈ హీరో.. ఈ మండాడిలో ఇంకెలా ఉంటాడో అని అంతా వెయిట్ చేస్తున్నారు.






# బన్నీ-అట్లీ సినిమాపై పెరుగుతున్న అంచనాలు

పాన్ ఇండియా లెవెల్ లో తెలుగు హీరోలు తీస్తున్న సినిమాలు చిత్రసీమను షేక్ చేస్తున్నాయి. హాలీవుడ్ లెవెల్ యాక్షన్ హంగులు ఉన్న భారీ సెట్టింగ్స్, ఇలా ఎన్నెన్నో సినిమాలు ఇండియన్ సినిమా దగ్గర నుంచి వస్తున్నాయి. ఇక అలా ఇండియన్ సినిమా నుంచి రీసెంట్‌గా ఇంటర్నేషనల్ లెవెల్లో అనౌన్స్ అయిన సినిమా ఏదైనా ఉంది అంటే.. అది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ అని చెప్పవచ్చు. కాగా ఈ చిత్రం అనౌన్స్ చేసినపుడే అందులో విజువల్స్ చూసి హాలీవుడ్ లెవల్లో ప్లాన్ చేస్తున్నట్టు- అర్థం అవుతుంది. అయితే ఈ మూవీలో బన్ని మొత్తం మూడు పాత్రలు పోషించనున్నాని తెలుస్తోంది. ఇందుకోసం చాలా కసరత్తులు చేస్తున్నాడట. ఇక ఈ సినిమాతో విజువల్ ఎఫెక్ట్స్ పరంగా ఆడియెన్స్‌ని ఖచ్చితంగా మరో లోకం లోకి తీసుకెళ్ళడానికి బన్నీ ఇంకా అట్లీ- ఇద్దరు గట్టిగా ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా ఉంటే ఈ రెంజ్ మూవీ కోసం యాక్టర్స్‌ని ఎంచుకోవడం ఒక్కింత కష్టం అనే చెప్పాలి. ఎందుకంటే ప్రతి ఒక్క పాత్ర చాలా ముఖ్యం. అందుకే ఇప్పటిక వరకు ఈ మూవీలో నటనటు-ల గురించి ఎలాంటి అప్ డేట్‌లు రావడంలేదు. కానీ తాజాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ రోల్‌ను డిజైన్ చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈ పాత్రలో ఓ బాలీవుడ్ హీరోని తీసుకునే ఆలోచనలో మూవీ టీ-ం ఉన్నట్లు- సమాచారం. మరి ఆ హీరో ఎవరు అనేది చూడాలి. ప్రజంట్ టాలీవుడ్ బారీ చిత్రాల్లో ఒక్కరైనా బాలీవుడ్ యాక్టర్స్ కచ్చితంగా ఉంటున్నారు. మరి ఈ మూవీలో ఎవరు రాబోతున్నారు చూడాలి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com